


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com




విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
- APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
- నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
- కరెంట్ అఫైర్స్
- నమూనా ప్రశ్నాపత్రాలు
- విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

visit us @ http://epaper.suryaa.com

సంపుటి 18 | సంచిక 140

బుధవారం | 12 మార్చి 2025 | హైదరాబాద్

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, ఫాల్గుణమాసం శుద్ధ. త్రయోదశి ఉ.9.38, మఖ తె.4.13, వర్జ్యం మ.3.40 నుంచి 5.20 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు దుర్ముహూర్తం ఉ.11.48 నుంచి 12.34 వరకు

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు


5 లో

● ట్రంప్ దూకుడు నిర్ణయాలతో అనిశ్చితి ● మరోవైపు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్ డౌన్ భయాలు ● ఒక్కరోజులో రూ.349 లక్షల కోట్ల సంపద ఆవిరి

## గ్రూప్-2 ఫలితాల్లో పురుషుల హవా


3 లో

● 32వ ర్యాంకులో మహిళా అభ్యర్థి ● జనరల్ ర్యాంకుతో పాటు ఫైనల్ కీని విడుదల చేసినట్లు తెలిపిన టీజీపీఎస్సీ

గ్రూప్ –2 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. జనరల్ ర్యాంకుతో పాటు ఫైనల్ కీని విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ తెలిపింది. ఇక ఈ ఫలితాల్లో పురుష అభ్యర్థులు సత్తా చాటారు. టాప్ టెన్ ర్యాంకులతో పాటు 31వ ర్యాంకు వరకు పురుష అభ్యర్థులే ఉన్నారు.

# మా బంధాలు మరింత ధృఢం

● మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ప్రధాని మోడీ ● వేడుకలలో పాల్గొనటం నాకు, నా దేశానికి దక్కిన గౌరవం ● మారిషస్ ప్రెసిడెంట్ గోఖూల్‌తో ప్రధాని మోడీ ప్రత్యేక సమావేశం ● మహాకుంభ నీరు, బీహార్‌లోని మఖానాలు బహుమతులుగా అందజేత ● సర్ అనిరూడ్ జుగ్నాథ్ సమాధి వద్ద నివాళులర్పించిన ప్రధాని ● రామకోళం చారిత్రాత్మక ఉద్యానవనంలో ఏక్ పెడ్ మాకే నామ్ నాటిన మోడీ


6 లో

రిపబ్లిక్ ఆఫ్ మారిషస్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మారిషస్ ప్రెసిడెంట్ గోఖూల్‌తో సమావేశమై , మహాకుంభ నీరు, బీహార్‌లోని మఖానా మరియు మరిన్నింటిని బహుమతిగా ఇచ్చారు. ఆగ్నేయాసియా దేశంలోని స్టేట్ హౌస్‌లో రిపబ్లిక్ ఆఫ్ మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోఖూల్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సమావేశమయ్యారు.

## వైరా నియోజకవర్గానికి కోటా కంటే ఎక్కువ ఇళ్లు

తెలంగాణ గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి


7 లో

# యువత కోసం రాజీవ్ యువ వికాసం

● రూ. 6 వేల కోట్లతో 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి పథకాలు ● గత దశాబ్ద కాలంగా యువ వికాసాన్ని విస్మరించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ● మార్చి 15 నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ● ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తుల పరిశీలన లబ్ధిదారుల ఎంపిక ● జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ ● మీడియా సమావేశంలో కార్యాచరణ ప్రణాళికను వెల్లడించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.6 వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. వికాసం గురించి గత బిఆర్ఎస్ పూర్తిగా పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వివరించారు.


3 లో

## మోడీ మెచ్చిన అరకు కాఫీ

● పార్లమెంట్‌లో మన అరకు కాఫీ స్టాల్ ● అరకు కాఫీకి ప్రత్యేకమైన గుర్తింపు ● పర్మిషన్ గ్రాంటెడ్ ● మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన కేంద్ర మంత్రి రామ్మోహన్


6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

● నిరుద్యోగ యువతకి గుడ్‌న్యూస్ చెప్పిన ప్రభుత్వం ● రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటన ● మార్చి 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ


3 లో

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. నిరుద్యోగ యువతకి ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రూ. 6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించనున్నారు.

## చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

● రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని, రైతులు, అధికారులు శాస్త్రవేత్తలతో మాట్లాడిన మంత్రి తుమ్మల ● మంగళవారం నుండి పొలం నుండి రైతులు నేరుగా మాట్లాడే అవకాశం ● వ్యవసాయ యాంత్రీకరణలో చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్యత ● అధికారులతో మంత్రి తుమ్మల

ప్రస్తుతమున్న పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతుల చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రాజేందర్ నగర్ పరిశోధన స్థానం నుండి ప్రత్యక్షంగా వివరించిన శాస్త్రవేత్తలు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతనేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. వరి పంట విషయంలో ప్రస్తుత పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి, రాజేంద్రనగర్ వరిపరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా రైతులకు వివరించడం జరిగింది.


3 లో

## ఆదివాసీ పిల్లలు ఇంగ్లీష్‌లో మాట్లాడటం ఆనందదాయకం


3 లో

● కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ ● కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు నివాళి ● అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సూచన ● గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్‌గా చేయాలని ఆదేశం

అంతా ఇంతే!




ఈ మాట వింటే వైసీపీ ఖుషీ అవుతుందేమో సార్

## సీఎం రేవంత్ నేతృత్వంలో మరింత అభివృద్ధి

● కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి ● మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇంచార్జీల సమావేశంలో మంత్రి కొండా సురేఖ


3 లో

సీఎం రేవంత్ రెడ్డి నేతృావత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న పథకాలను మెదక్ జిల్లా ప్రజలకు చేరే వేసే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేసి... ముందుకు వెళ్ళాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గానికి వివిధ అభివృావిద్ధి పనుల నిమిత్తం ప్రత్యేకంగా స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ నేతృావత్వంలో హైదరాబాద్ బంజారాహిల్స్ లోని మంత్రుల నివాస సముదాయంలో మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇంఛార్జీల సమావేశం జరిగింది.

## బీసీల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

● ఏపీలో బీసీ సంక్షేమానికి 38 వేల కోట్లు కేటాయించారు ● తెలంగాణ ప్రభుత్వం సైతం బీసీ సంక్షేమానికి బీసీ బడ్జెట్ 20 వేల కోట్లకు పెంచాలి ● బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాలు కోసం 4000 కోట్లు ఎంబీసీ కార్పొరేషన్ 2000 కోట్లు కేటాయించాలి ● బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి ● బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం ఫెడరేషన్‌కు నిధులు కేటాయించాలి ● బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం


7 లో

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై కేసీఆర్ సమీక్ష



● బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాజీ సీఎం కేసీఆర్ ● అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం

వివరాలు-7లో



# సులభతర వాణిజ్యం, కంప్లెయన్స్ రిడక్షన్‌లో ఏపీని ఉత్తమంగా నిలిపేందుకు చర్యలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో సులభతర వాణిజ్యం మరియు కంప్లెయన్స్ రిడక్షన్ అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ను ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సులభతర వాణిజ్య విధానం మరియు కంప్లెయెన్స్ రిడక్షన్ అంశాలకు సంబంధించి సిఎస్ మరియు కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ కు చెందిన రాష్ట్రానికి నోడలు అధికారిగా ఉన్న సెక్రటరీ కోఆర్డినేషన్ వందన గుర్నాని( ) ఆధ్వర్యంలో సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో సులభతర వాణిజ్యానికి సంబంధించి వివిధ శాఖల్లో పెద్దఎత్తున సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు వేగవతంగా అవసరమైన అనుమతులు జారీతో పాటు ప్రభుత్వ పరంగా అందించాల్సిన సహకారానికి సంబంధించి సింగిల్ విండో డెస్క్ విధానంలో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు.అంతేగాక సులభతర వాణిజ్యం మరియు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులకు అనువుగా లేని పలు చట్టాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి జరుగుతోందని వివరించారు.ఉత్తమ విధానాలను అవలంభించడం ద్వారా వేగవంతమైన వాణిజ్యానిక కృషి జరుగుతోందని సిఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. అంతకు ముందు కేంద్ర కేబినెట్ సెక్రటేరియెట్ సెక్రటరీ కోఆర్డినేషన్ మరియు రాష్ట్రానికి నోడలు అధికారిగా ఉన్న వందన గుర్నాని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సులభతర వాణిజ్యం మరియు కంప్లెయెన్స్ రిడక్షన్ అంశాలకు సంబంధించిన అంశాలను వివరిస్తూ కేబనెట్ కార్యదర్శి నేతృత్వంలో 18 మంది కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో ప్రత్యేక టాస్కు ఫోర్సు కమిటీ జాతీయ స్థాయిలో పనిచేస్తోందని తెలిపారు.అలాగే రాష్ట్రాల్లో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ పనిచేస్తోందని అన్నారు.



# లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



● మహిళల రక్షణకు శక్తి యాప్ తెచ్చాం, పోలీసులు అప్రమత్తంగా లేకపోతే చర్యలు ● ఈగల్ వ్యవస్థతో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాం ● రాజకీయ ముసుగులో నేరాలు, ఘోరాలు చేస్తామంటే చూస్తూ ఊరుకోం ● నా రాజకీయ జీవితంలో హత్యా రాజకీయాలకు తావులేదు ● గత ఐదేళ్లు అసెంబ్లీలో బూతులు విన్నాం, ఇప్పుడు ప్రజా సమస్యలపై చర్చిస్తున్నాం ● శాసనసభలో సీఎం చంద్రబాబు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : శాంతి,భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవ్వరినీ ఉపేక్షించమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆడబిడ్డల జోలికొస్తే తాటతీస్తామని, మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తెచ్చామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రజలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు తలెత్తాయని, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజలు భయం లేకుండా సంతోషంగా ఉండాలంటే లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని అన్నారు.

**ఈగల్ తో డ్రగ్స్,గంజాయిపై ఉక్కుపాదం**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో డ్రగ్స్ , గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. బాధ్యతకలిగిన ప్రతిపక్షంగా దీనిపై తెలుగుదేశం పార్టీ ఆందోళన చేస్తే తిరిగి మా కార్యాలయంపైనే దాడులు చేశారు. ఏ రాజకీయ పార్టీకైనా పార్టీ కార్యాలయమంటే దేవాలయం. గతంలో ఎక్కడా పార్టీ ఆఫీస్ లపై దాడులు జరిగిన ఘటనలు నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను చూడలేదు. రాజకీయ కక్షసాధింపులకు నేను దూరంగా ఉంటాను. గత పాలకులు కనీసం గంజాయి, డ్రగ్స్ పై సమీక్ష చేయలేదు. అసెంబ్లీలో చర్చించిన పాపాన పోలేదు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిలో మార్పు అంత తేలిగ్గా రాదు. వ్యవస్థీకృతంగా మారిన గంజాయిసాగు, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చాం. స్వార్థం కోసం గంజాయి పండించి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడకూడదు. ఎట్టి పరిస్థితుల్లో ఈ రాష్ట్రంలో గంజాయి పండించేందుకు వీల్లేదు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం. ఎక్కడికక్కడ ఏజెన్సీలను పెట్టి రాష్ట్ర సరిహద్దుల్లోకి కూడా డ్రగ్స్ రానివ్వము. గంజాయి సాగు చేసే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం.తమ పిల్లలు ఎలా ఉంటున్నారో తల్లిదండ్రులు కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలి.

**సోషల్ మీడియాలో పిచ్చి రాతలు రాస్తే అంతే సంగతులు**

గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం ఎంతకైనా దిగజారారు. సోషల్ మీడియా ముసుగులో రోత పుట్టించే రాతలు రాశారు. మహిళలపై వ్యక్తిగత దూషణలు చేశారు. ఆడబిడ్డలు తలెత్తుకుని తిరగలేని విధంగా పోస్టులు పెట్టారు. అసెంబ్లీ లోపల, బయటా బూతులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. వాటన్నింటికీ చెక్ పెట్టాం. అసెంబ్లీలో బూతులకు తావులేదు. అర్థవంతమైన చర్చ జరుగుతోంది. మరోవైపు తీవ్ర వాదం అరికట్టాలి. మత సామరస్యం పెంచాలి. ముఠా నాయకులు, రౌడీ అనే మాట వినపడకూడదని నేను గతంలో కూడా మెసేజ్ ఇచ్చి ఆచరణలో చేసి చూపించాను.

**పేదల భూములు కాపాడతాం**

ల్యాండ్ గ్రాబింగ్ నిషేధం కింద కొత్త చట్టం తీసుకొస్తున్నాము. గత పాలకులు చేసిన భూ మాఫియా అంతా ఇంతా కాదు. 22 ఏ ఉపయోగించి భూ దందాలు చేశారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రభుత్వ, పేదల , ఫారెస్ట్ భూములు కొట్టేశారు. అందుకే కొత్త చట్టం తెస్తున్నాం. భూ కబ్జాలకు పాల్పడితే కొత్త చట్టం ద్వారా కఠినంగా శిక్షిస్తాం. ఇకపై ఎవరైనా భూ కబ్జా అనాలంటే భయపడాలి. నేరాలు చేసి ,సాక్ష్యాలు తారుమారు చేసి తప్పించుకునే వారికి కాలం చెల్లింది రాత్ర సమయంలో డ్రోన్ పెట్రోలింగ్ చేస్తాము. సీసీ టీవీ కెమెరాలు పెడుతున్నాం.. 26 సైబర్ సెక్యూరిటీ స్టేషన్లు పెడుతున్నం. నేరస్థులను వెంటనే పట్టుకుంటాం. నేను సమైక్యాంధ్రలో ప్రతి రెవెన్యూ డివిజన్ కు పోలీస్ డ్ర్యాగ్స్ ను పెట్టి నేరాలకు అడ్డుకట్ట వేశాను.

**రాజకీయ ముసుగులో నేరాలు-ఘోరాలు**

సంచలనం కలిగించిన వివేకానంద హత్య ఉదంతం తలుచుకుంటే ఆందోళన కలుగుతుంది. ఆ కేసుకు సంబంధించి 6 మంది సాక్ష్యులు చనిపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. 2019లో వివేకా హత్య జరిగింది. మొదట వివేకా గుండెపోటుతో చనిపోయినట్టు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఎన్నికల హడావుడిలో నేనూ అదే నిజమనుకున్నాను. నేరస్థులు ఏ విధంగా ట్రాప్ లో వేస్తారో ఇదో ఉదాహరణ. మధ్యాహ్నానికి బాడీ పోస్టుమార్టమ్ చేయాలని ఆయన కూతురు సునీత అడిగారు. ఆవిడ పోస్టుమార్టమ్ అడగకపోతే నిజం సమాధయ్యేది. అప్పటివరకూ గుండెపోటు అని ప్రచారం చేసిన టీవీ చానల్ పోస్టుమార్టమ్ తర్వాత మాట మార్చింది. నారాసుర రక్త చరిత్ర అని నాపై విష ప్రచారం చేశారు. ఇలాంటి అరాచకాలు చేసి కూడా రాజకీయాలు చేశారు. నా 45 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎక్కడా హత్యా రాజకీయాల మరక అంటకుండా ఉన్నాను. హత్యారాజకీయాలు చేసిన వారికి ప్రజాక్షేత్రంలో శిక్ష పడేలా చేశాను. రాజకీయ ముసుగులో నేరాలు చేసి తప్పించుకుంటానంటే ఈ ప్రభుత్వంలో సాగనివ్వను. ప్రజలకు భద్రత కల్పించడం మన బాధ్యత. నియోజకవర్గాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ ఎమ్మెల్యేల బాధ్యత. పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తాం. ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే పేట్రేగుతారు. ప్రభుత్వం కఠినంగా ఉంటే అందరూ లైన్ లోకి వస్తారు.

**మహిళా భద్రతకు శక్తి యాప్**

ప్రేమ పేరుతో అమ్మాయిలను ట్రాప్ చేసేవారి తాట తీస్తాం. గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దాచేపల్లిలో చిన్నారిపై అత్యాచారం జరిగింది. 18 టాస్క్ ఫోర్స్ లు నియమించి ప్రభుత్వ యంత్రాంగాన్ని అక్కడ మోహరించాను. ప్రభుత్వం శిక్షిస్తుందనే భయంతో నిందితుడు ఉరేసుకుని చనిపోయాడు. ఆడబిడ్డల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని ఆనాడు విజయవాడలో ర్యాలీ నిర్వహించాం. మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తెచ్చాం. ఆడబిడ్డలపై అత్యాచారాలకు ఒడిగడితే అదే వారికి చివరిరోజు. అత్యవసర పరిస్థితులు లేక ఆపదలో చిక్కుకున్నప్పుడు మహిళలు శక్తి యాప్ లో ఫిర్యాదు చేస్తే చాలు...నిమిషాల వ్యవధిలో పోలీసులు వచ్చి రక్షిస్తారు. గత ప్రభుత్వంలో దిశా యాప్ అని ప్రచారం చేశారు. ఏమైంది..దిక్కుమాలిన యాప్ గా మిగిలింది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులదే. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా లేకపోతే పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలుగుజాతి చరిత్ర పరిరక్షణకు చర్యలు

● మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ ఏర్పాటు చేస్తాం ● మహనీయుల లేఖలన్నీ అర్కీవ్స్‌లో ఉన్నాయి ● స్పెషల్ నీడ్స్ పిల్లలకు ప్రత్యేక బోధనా ● ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేస్తాం ● అసెంబ్లీలో మంత్రి లోకేష్ వెల్లడి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు వంటి మహనీయులు రాసిన లేఖలతో వివిధ ప్రాచీన పత్రాలను సంరక్షిస్తామని, దీని కోసం అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్ర ప్రాచీనపత్ర భాండాగారం నుంచి అధికారిక పత్రాలు, శాసనాలు, రికార్డులు రాష్ట్రానికి రప్పించే అంశంపై శాసనసభలో మంత్రి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రశ్నించారు.. తెలుగుజాతి చరిత్ర పరిరక్షణకు ఆర్కీవ్స్, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీకి, డిస్ట్రిక్ట్ గెజిట్స్ అనే మూడు సంస్థలు ఉన్నాయని అయన చెప్పారు. అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు వంటి మహనీయులు రాసిన లేఖలు ఆర్కీవ్స్ ఉన్నాయని, రాష్ట్ర విభజన తర్వాత ఈ అంశాన్ని షెడ్యూలు 10లో చేర్చారని వెల్లడించారు.

డిజిటలైజ్ చేసేందుకు చర్యలు..

ఏపీకి చెందిన జాతి సంపదను కాపాడాకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దీనిపై ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో చెప్పాలని బుద్ద ప్రసాద్ కోరారు. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. లైబ్రరీస్ పై మూడు సార్లు రివ్యూ చేశాం అన్నారు.., ఆర్కివ్స్ పై వెనుకబడి ఉన్నామని.. ఇది చాలా సీరియస్ గా తీసుకోవాల్సిన అంశం అన్నారు.. 10వ షెడ్యూలులో ఈ సంస్థ ఉందన్నారు.. మొత్తం 15 కేటగిరిల రికార్డులకుగాను 7 కేటగిరిలు ఇచ్చారన్నారు. రెండు కాపీలు ఉన్నవి. ఒకటి మనకు ఇచ్చా, ఒకే ఒక కాపీ ఉన్నవాటిపై చర్చించాల్సి ఉంది. డిజిటలైజ్ చేసి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తాం. బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కోరాం, అవసరమైతే సీఎస్ఆర్ నిధులు తెచ్చి పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేస్తాం. పెద్దఎత్తున డిజిటలైజేషన్ చేపట్టాల్సి ఉంది. 24,347 చదరవు అడుగుల అద్దె భవనంలో ప్రస్తుతం ఆర్కివ్స్ విభాగం పనిచేస్తోంది, అక్కడే రికార్డులన్నీ నిర్వహిస్తున్నాం. రాష్ట్రవిభజన తర్వాత మనకు సెంట్రల్ లైబ్రరీ లేనందున అమరావతిలో భూమి కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరాం. అక్కడే ఆర్కివ్స్ పరిరరక్షణపై దృష్టి పెడతాం. ఆర్కివ్స్ పై శాసనసభ్యులతో కమిటీ ఏర్పాటుచేస్తాం. టెక్నాలజీ జోడించి, ఆర్కివ్స్ పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం అన్నారు..

స్పెషల్ నీడ్స్ పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ..

రాష్ట్రంలో 125 కొత్త స్పెషల్ నీడ్స్ పాఠశాలలను ప్రతిపాదించామని మంత్రి లోకేష్ వెల్లడించారు. స్పెషల్ నీడ్స్ పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు తల్లిదండ్రులు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటారని.. వారి అవసరాలను ఆసరాగా తీసుకొని ప్రైవేటు సంస్థలు కొన్ని రూ.50 వేలు కూడా వసూలు చేస్తున్నాయని మంత్రి తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరంగా పాఠశాలల ఏర్పాటుకు ముందుకు వెళుతున్నామన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రస్తావించారు. స్పెషల్ నీడ్స్ పిల్లలకు టీచర్ అండ్ స్టూడెంట్ రేషియోను మెయింటైన్ చేయాలని.. అప్పుడే వారి కాళ్లపై వాళ్లను నిలబట్టడానికి అవకాశమేర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రకాశం జిల్లాలో రెండు ఆల్ట్రా మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్లు

● ఒక్కొక్క సోలార్ ప్లాంట్‌తో 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ● ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 తో 7.5 లక్షల మందికి ఉపాధి ● 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం ● లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లు -2025 తో మరింత భద్రత ● పూర్తి అధ్యయనం తరువాతే చట్ట సభ ముందుకు బిల్లు ● అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి: ప్రకాశం జిల్లాలో రెండు ఆల్ట్రా మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. శాసనసభలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి మంగళవారం సమాధానం చెప్పారు. దీనికి సంబంధించి ఆయన సభలో మాట్లాడుతూ... రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాయలసీమ తరువాత ప్రకాశం జిల్లానే అత్యంత అనువైన ప్రాంతమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దొనకొండ, చంద్రశేఖరపురం ప్రాంతాల్లో మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఒక్కో ప్లాంట్ నిర్మాణానికి సుమారు 5,500 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ప్లాంట్ల నిర్మాణానికి భూ కేటాయింపులకు సంబంధించి ఇప్పటికే ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక కోరామన్నారు. కలెక్టర్ నివేదిక తరువాత సోలార్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడుతామని మంత్రి చెప్పారు. ఒక్కో సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా సుమారు 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 (ఐసీఈ) ద్వారా పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశాభవం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఐసీఈ పాలసీ ద్వారా 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మంత్రి గొట్టిపాటి సభాముఖంగా సభ్యులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లు - 2025తో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులతో పాటు ప్రజలకు మరింత భద్రత కలుగుతుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లు -2025 ను ప్రవేశ పెట్టిన తరువాత ఆయన మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న పట్టణీకరణతో పాటు వేగంగా నిర్మాణమవుతున్న బహుళ అంతస్తుల భవనాలు, ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ ను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు మరియు ఎస్కలేటర్లు బిల్లు - 2025ను రూపొందించినట్లు వివరించారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల వినియోగంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని మంత్రి గొట్టిపాటి ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల భద్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కొత్త బిల్లు చట్టరూపం దాల్చితే లిఫ్టులు, ఎస్కలేటర్ల ప్రమాదాలను చాలా వరకు కట్టడి చేయవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లును 2024లోనే తీసుకొచ్చిందని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల చట్టాన్నిదేశంలోని 15 రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాన్నిపూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తరువాతే ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లు - 2025 ను రూపొందించి చట్ట సభల్లో ప్రవేశ పెట్టామని ఆయన వివరించారు. విస్తృత ప్రజా ప్రయోజనాలతో పాటు అతి ముఖ్యమైన పౌరుల భద్రత దృష్ట్యా బిల్లును చట్ట రూపంలోకి తీసుకొచ్చి అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా సీసీ కెమెరాల వినియోగం, డేటాను భద్ర పరచడం వంటి వాటికి సంబంధించిన అంశాలన్నింటినీ బిల్లులో పొందుపరిచామని తెలిపారు. బిల్లుకు సంబంధించి గౌరవ సభ్యులు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఈ సందర్భంగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

# 18 నుంచి 20 వరకు ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సర్వం సిద్ధం



బహుమతులు , క్రీడా సామాగ్రిని పరిశీలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభ్యులకు మార్చి 18, 19, 20 తేదీల్లో మూడు రోజుల పాటు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ అనూరాధ, మంత్రులు, ఎమ్మెల్యేలతో గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు అసెంబ్లీలో సమావేశం నిర్వహించారు. 18వ తేదీ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభం కానుంది. విజేతలకు ప్రైజులు, మెమెంటోలు అందజేయడం, క్రీడల్లో పాల్గొనే వారికి గాను ప్రత్యేక డ్రెస్సు శాప్ చైర్మన్ రవి నాయుడుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలు రాజకీయ నాయకులకు రిలీఫ్ కలిగించేలా నిర్వహించాలని, ఇంకా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. శాసనసభ్యులు, మండలి సభ్యులు అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. మార్చి 20న రాత్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో విప్ గణబాబు గారు,శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ గారు, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారు,సుందరవు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# రోజా వంతు వచ్చేసింది




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ మంత్రి రోజా చుట్టూ ఏసీబీ ఉచ్చు బిగిసుకో నున్నది. కూటమి ప్రభుత్వం వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులపై ఇప్పటికే పలు విచారణలు జరువుతోంది. కొందరు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ముందస్తు బెయిల్ కూడా తెచ్చుకున్నారు. వీరిలో మాజీ మంత్రులు పేర్ని నాని, విడుదల రజనీలు ఉన్నారు. వీరి తరువాత మాజీ మంత్రి రోజా కూడా రానున్నారు. వీరంతా వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ లపై వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. కొందరైతే వారి మనోభావాలకు బాధ కలగించే విషయాలపై బాహాటంగా విమర్శలు చేశారు. యువగళం సమయంలో లోకేష్ అధికారంలోకి వచ్చిన తరువాత వీరందరిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అందుకు అనుగుణంగానే ప్రస్తుతం చర్యలు కొనసాగుతున్నాయి. మాజీ మంత్రి ఆర్కే రోజాకు భారీ షాక్ ఇచ్చేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో దాదావు రూ.400 కోట్ల అవినీతికి సంబంధించి ఆమెను టార్గెట్ చేసేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు ఈ వ్యవహారంపై ప్రభుత్వాన్ని లాంఛనంగా ప్రశ్నించడం, చర్యలు తీసుకుంటామని ప్రకటన చేయడం కూడా జరిగిపోయింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏసీబీ దర్యాప్తుకు ఆదేశించబోతోంది. గత ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా యువతకు క్రికెట్ కిట్లు ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా పోటీలు నిర్వహించారు. ఇందులో దాదావు రూ.119 కోట్లను 45 రోజుల్లోనే ఖర్చు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిధుల్ని మళ్లించి మొత్తంగా రూ.400 కోట్ల మేర ఈ పథకం కోసం ఖర్చు చేసినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిన్న అసెంబ్లీలో ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రశ్నించగా.. క్రీడా మంత్రి మండిపల్లి రాంపప్రాద్ రెడ్డి దర్యాప్తు చేయిస్తామన్నారు. ఈ మేరకు ఆడుదాం ఆంధ్రాలో జరిగిన అవకతవకలపై ఏసీబీతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం సిఫార్సు చేయబోతోంది.

# వైసీపీ హయాంలో మత సాంస్కృతి సంప్రదాయలను నిర్వీర్యం చేశారు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 2019 నుండి 2024 మధ్య కాలంలో రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేయడం, రథాలను తగలబెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై జరిగిన విచారణ, నమోదైన కేసులు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శాసన మండలిలో సభ్యుల ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. మంత్రి అనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ : గత ప్రభుత్వం హయాంలో దేవాలయాలపై దాడులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదావు వందల సంఖ్యలో ఘటనలు నమోదయ్యాయి. ఇందులో చాలా వరకు నిర్లక్ష్య వైఖరితో సరిపెట్టారు. అప్పటి ప్రభుత్వం ఈ ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిపోయి, మౌనంగా ఉండడం గమనార్హం. హిందూ భక్తుల మనోభావాలను గౌరవించకుండా ఆ ఘటనలను నిర్లక్ష్యంగా పరిగణించారు అని మంత్రి మండిపడ్డారు. మన ధర్మం మనకు రక్షణగా నిలవాలంటే ప్రభుత్వ పాలకులు భక్తులు మనోభావాలను గౌరవించాలి దేవాలయాల ప్రతిష్టను కాపాడాలి కానీ గత వైసిపి హయాంలో దేవాలయాలపై జరిగిన దాడులను నిర్లక్ష్యం చేయడమే కాదు దోషులను కాపాడేందుకు చిత్తశుద్ధి లేని విచారణలు జరిపింది అని మంత్రి ఆనం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019-2024 మధ్య కాలం లో అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి రథం దహనం, బిట్రగుంట రథం కాలిపోవడం ఆంజనేయస్వామి తోక, విరగొట్టడం, ఇలా ఒకటే రాష్ట్రవ్యాప్తంగా దాదావు వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. అలాగే చాలా దేవాలయంలో భద్రత సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాల ధ్వంసం ఇవన్నీ హిందూ సమాజాన్ని కలవరపరిచాయి అని మంత్రి గుర్తు చేశారు. ప్రభుత్వం కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ దేవాలయాల విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తుంది ఏదయినా చిన్న చిన్న ఘటనలు జరిగితే తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది గతంలో జరిగినటువంటి ఘటనలను పునరావృతం కాకుండా అందు కొరకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి గతంలో నిర్లక్ష్యం చేసిన కేసులపై సమగ్ర విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాము.

# కాషాయం కప్పుకొంటే సరిపోతుందా?



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కడప జిల్లా జ్యోతి మండలంలోని ప్రఖ్యాత అవధూత కాశినాయన ఆశ్రమం కూల్చివేత వ్యవహారం రాజకీయ దుమారం రేవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చెలరేగుతున్నాయి. తాజాగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ ఆశ్రమాన్ని సందర్శించారు. అవధూత కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని పరిరక్షించుకుంటామని కడప జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు పీ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, అధికార ప్రతినిధి ఆరె శ్యామల జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. ఇటీవల జ్యోతిక్షేత్రంలో మహిళల స్నానపుగదులు, క్షౌరశాల, గోశాల, విశ్రాంతి గదులను అటవీశాఖ అధికారులు కూల్చివేసిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ఆకలి తీర్చడానికి దేవాలయాల వద్ద నిత్యాన్నదాన సత్రాలు ఏర్పాటు చేసి కాశినాయన అన్నదానం కొనసాగించారని అన్నారు. జ్యోతిక్షేత్రంలో ఆయన పరిత్యాగం చెందారని, ఆయన ఆలయాన్ని నిర్మించడానికి అటవీశాఖ ఇబ్బందులు సృష్టించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, గోవిందరెడ్డి సహకారంతో జ్యోతి క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో అటవీశాఖను పర్యవేక్షిస్తోన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. కాషాయ దుస్తులు ధరించి, సనాతన ధర్మ పరిరక్షకుడిగా చెప్పుకొంటున్నాడని, స్వయంగా జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలపై స్పందించకపోవడం విచారకరమని చెప్పారు.

# మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు



మంగళగిరి: మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకి పాల్పడిన కేసులలో దర్యాప్తు వేగవంతం చేసి న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్ తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే దాడులను ఉక్కుపాదంతో అణచివేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. విజయనగరం జిల్లా పరిధిలో చిన్నారులపై జరిగిన ఆఘాయిత్యాల () కేసుల్లో నిందితులకు 3 నెలల నుండి 6 నెలల లోపే శిక్షలు ఖరారు చేయడంలో విజయం సాదించిన విజయనగరం పోలీసులను ఈ సందర్భంగా డీజీపీ అభినందించారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారు శిక్షల నుండి తప్పించుకోలేరని అన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలను నివారించడానికి ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ శక్తి యాప్ కు పలు అదునాతన ఫీచర్ లను జోడించడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్స్ 181, 112, 1098,1093 కు కాల్ చేసినా లేదా మొబైల్లో ఉన్న శక్తి యాప్ లో గల మీట నొక్కినా లేదా ఫోనును అటూ, ఇటూ గట్టిగా ఊపినా కంట్రోల్ రూమ్ కి సమాచారం వెళ్లి నిమిషాల వ్యవధిలోనే శక్తి టీమ్స్ సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణగా నిలుస్తాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేదింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడమే లక్ష్యంగా శక్తి టీమ్స్ పనిచేస్తాయి అని అన్నారు.




# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్ న్యూస్

తెలంగాణ బ్యూరో॑ప్రతినిధిః తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారంలోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మూడు, నాలుగేళ్లలోగా పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆయన చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తామని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు తాము వడ్డీలు కట్టడానికే సరిపోతుందని ఆయన విమర్శించారు. వడ్డీ కడుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు మంత్రి పొంగులేటి. ఓర్వలేకనే తమపై విమర్శలు చేస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారం రోజుల్లో పనులు మొదలు పెడతామని తెలిపారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందులో భాగంగా మళ్లీ విడతలో అధికారులు నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించింది. వాటిని వేర్వేరుగానే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు నిర్ణయించింది. నారాయణపేట జిల్లాలోని అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్లకు ఫిబ్రవరి 21న సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల నుంచి ఇప్పటికే అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం వారిలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. తొలి విడతలో 72,045 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం అందించనున్నారు.

# యువత కోసం రాజీవ్ యువ వికాసం

- రూ. 6 వేల కోట్లతో 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి పథకాలు
- గత దశాబ్ద కాలంగా యువ వికాసాన్ని విస్మరించిన బిఆర్ఎస్ ప్రభుత్వం
- మార్చి 15 నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తుల పరిశీలన లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ
- మీడియా సమావేశంలో కార్యాచరణ ప్రణాళికను వెల్లడించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.6 వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. యువత వికాసం గురించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్లను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి 3 లక్షల చొప్పున సాయం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సంవత్సరం స్వయం ఉపాధి పథకం అందించడానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. స్వయం ఉపాధి పథకం కొరకు ఆన్ లైన్ లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 02న స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేస్తామని వివరించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తగిన మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తున్నారని చెప్పారు. సామాజిక స్పృహ కలిగిన ప్రజా ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడం సామాజిక బాధ్యతగా తీసుకున్నదన్నారు.

చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి 540 కోట్లు

వీరవనిత చాకలి ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం 540 కోట్ల రూపాయలు కేటాయించిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ డిజైన్ చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీలో ఉన్న హెరిటేజ్ భవనాలను పునరుద్ధరణ చేస్తామన్నారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం మూసి రివర్ ను ఆనుకొని ఉందని మూసి పునర్జీవం అయిన తర్వాత యూనివర్సిటీ ప్రధాన ద్వారా అన్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం 15.5 కోట్లు, అదేవిధంగా నూతన భవన నిర్మాణాలకు తక్షణమే 100 కోట్లు విడుదల చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు హెరిటేజ్ భవనాలు, పునరుద్ధరణ ప్రణాళికలను అధికారులతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు. సమావేశం లో స్పెషల్ సీఎస్ రామకృష్ణా రావు, కమిషనర్ హరీష్, ఐలమ్మ యూనివర్సిటీ వీసీ సూర్య ధనుజయ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ పిల్లలు ఇంగ్లీష్‌లో మాట్లాడటం

# ఆనందదాయకం

- కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్
- కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు నివాళి
- అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సూచన
- గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్‌గా చేయాలని ఆదేశం



తెలంగాణ బ్యూరో॑ప్రతినిధిః తాను దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, కిషోర్ ప్రిన్సిపల్ సెక్రటరి, కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసువు, పిండి యూనిట్ ప్రారంభించారు.

AU SMALL FINANCE BANK

**Registered Office:** 19-A Dhuleshwar Garden, Jaipur, Rajasthan, India, 302001.
www.aubank.in

**LOAN AGAINST GOLD - AUCTION NOTICE ON "AS IS WHERE IS" BASIS**

The below mentioned borrower/s have been issued notices to pay their outstanding amounts towards the loan against gold facilities availed from AU Small Finance Bank Limited ("Bank"). Since the borrower/s has/have failed to repay his/their dues, we are constrained to conduct an auction of pledged gold items/articles on **19 MAR 2025** between **11:00 AM – 3:00 PM** (Time) at below mentioned branches according to the mode specified therein. In the case of deceased borrowers, all conditions will be applicable to legal heirs. Please note that in the event of failure of the above auction, the bank reserves its right to conduct another auction without prior intimation.

**E-Auction Branch Details (E-auction will be conducted by using Weblink - https://gold.samil.in)**

**ACHAMPET** - 24660001366751 24660001392221 24660002381574 24660002503357 | **ARMOOR** - 24660001296412 24660001305607 24660001313262 24660001314070 24660001339903 24660001344483 24660001349764 24660001369105 24660001392731 24660001400388 24660002089614 24660002241689 | **BANSWADA** - 24660001304179 24660001308522 24660001314270 24660001334092 24660001374845 24660001389977 24660001423834 24660001424713 24660001776339 24660002343527 24660002503867 24660002526714 | **BHUPALPALLY** - 23660002293222 24660001287179 24660001287619 24660001306895 24660001309820 24660001337216 24660001347417 24660001364994 24660001377340 24660001404551 24660001405599 24660001422196 24660001423154 24660001425441 24660001425511 | **BODHAN** - 24660001291511 24660001323183 24660001328264 24660001417056 | **CHITYALA** - 24660001363086 24660001379036 24660001414722 24660001415710 24660001481644 24660001627331 24660002522281 | **CHOUTUPPAL** - 24660001283056 24660001347047 24660001352827 24660001357978 24660001400118 24660002018300 | **GAJWEL** - 24660001288727 24660001312204 24660001316306 24660001345691 24660001354234 24660001364034 24660001375814 24660001414072 | **GHANPUR** - 24660001293297 24660001314710 24660001357488 24660001358776 24660001377590 24660001406197 24660001409852 24660001411797 24660001418594 24660001560975 | **HANAMKONDA - WARANGAL** - 24660001281290 24660001285003 24660001301914 24660001316766 24660001334182 24660001335090 24660001349734 24660001350321 24660001361560 24660001364364 24660001365363 24660001371871 24660001377040 24660001383188 24660001387041 24660001396184 24660001397172 24660001403953 24660001406227 24660001409402 24660001409522 24660001414802 24660001468639 24660001482402 24660001585618 24660001729799 24660001921667 24660002033971 24660002048433 24660002310480 24660002328286 24660002345854 24660002399951 24660002425884 24660002429176 24660002500393 | **HUSNABAD** - 24660001118149 24660001278876 24660001283556 24660001290103 24660001290263 24660001315508 24660001315708 24660001321016 24660001323203 24660001331727 24660001331997 24660001354884 24660001382760 24660001387681 24660001395935 24660001397062 24660001408804 24660001786220 | **HUZURABAD** - 24660001278146 24660001284044 24660001286461 24660001308162 24660001310347 24660001312564 24660001317854 24660001325479 24660001329202 24660001338584 24660001350121 24660001351829 24660001370153 24660001386023 24660001386303 24660001396274 24660001406707 24660001408944 24660001410539 24660001411307 24660001412555 24660001413924 24660001418614 24660001592154 24660002124550 24660002329314 24660002438799 24660002498374 24660002534128 | **HYDERABAD-KUKATPALLY** - 24660001325579 24660001335490 | **JAGTIAL** - 24660001288497 24660001299436 24660001377180 24660001411257 24660001418764 24660001422076 24660001933114 24660002047654 24660002248876 24660002494692 | **JANGAON** - 24660001282358 24660001284444 24660001367619 24660001390614 24660001445543 24660001887470 24660002026914 24660002522961 | **JOGIPET** - 24660001344093 24660001369475 | **KAMAREDDY** - 24660001289365 24660001296612 24660001301064 24660001415730 24660001421428 24660001421978 24660002357421 | **KARIMNAGAR** - 24660001311945 24660001380844 24660001410949 24660001411047 24660001811194 24660002214651 24660002368740 | **KHAMMAM** - 24660001295914 24660001304229 24660001310397 24660001324681 24660001329172 24660001336848 24660001387071 24660001413334 24660002762928 | **KODAD** - 24660001291791 24660001345451 24660001359334 24660001365723 24660001380994 24660001381842 24660001388939 24660001395695 24660001396824 24660001405589 24660001406837 24660001421368 24660001423744 | **KONDAMALLEPALLI** - 24660001277918 24660001292069 24660001303601 24660001313912 24660001336078 24660001416878 24660002488274 24660002503547 | **KORUTLA** - 24660001294975 24660001304369 24660001312424 24660001312594 24660001335660 24660001374755 24660001375194 24660001380084 24660001632991 | **KOTHAGUDEM** - 24660001299056 24660001309490 24660001313222 24660001325469 24660001346289 24660001366501 24660001417906 24660002372432 24660002377403 24660002407368 | **MADHIRA** - 24660001290283 24660001356300 24660001359394 24660001361410 24660001374255 24660001892620 | **MAHABUBABAD** - 24660001277118 24660001280452 24660001281250 24660001295844 24660001295964 24660001296222 24660001298398 24660001301094 24660001308652 24660001308912 24660001326097 24660001337896 24660001352417 24660001360702 24660001361190 24660001403323 24660001406367 24660001407895 24660001408904 24660001410189 24660001413244 24660001415060 24660001417736 24660001420230 24660001423884 24660001444864 24660001680299 24660001737274 24660001839012 24660002380016 24660002380066 24660002469980 24660002521913 | **MANTHANI** - 24660001329132 24660001368767 24660001383428 24660001384236 24660001418194 24660002350354 | **MANUGURU** - 24660001320938 24660001367119 | **MEDAK** - 24660001339143 24660001367919 24660002492665 | **MEHBOOBNAGAR** - 24660001343474 | **MIRIYALGUDA** - 24660001307464 24660001309150 24660001748263 24660002073904 24660002206606 24660002385027 | **MOTHKUR** - 24660001315188 24660001370263 24660001403243 24660001405359 24660001413304 24660002444097 | **NAGARKURNOOL** - 24660001299076 24660001327785 24660001354514 24660001356780 24660001365053 24660001380064 24660001380374 24660001381372 24660001400298 24660001413274 24660001417436 24660001885344 24660002376524 24660002396916 | **NALGONDA** - 24660001385984 | **NARAYANAPET** - 24660001277588 24660001284644 24660001309330 24660001315088 24660001333384 24660001401266 24660001404051 24660001408714 24660001411967 24660001418374 24660002357041 24660002439577 24660002455576 24660002495550 24660002533290 | **NARAYANKHED** - 24660001278306 24660001313482 24660001382230 24660001390784 24660001400178 24660001413504 24660002491777 | **NARSAMPET** - 24660001277168 24660001278016 24660001281050 24660001285673 24660001301124 24660001302833 24660001316786 24660001317404 24660001334902 24660001336008 24660001356760 24660001361580 24660001377880 24660001380104 24660001389787 24660001394387 24660001406877 24660002019428 24660002348758 | **NIZAMABAD** - 24660001368697 24660001383908 24660001390484 24660001423704 24660001808151 | **PARKAL** - 24660001275942 24660001276370 24660001286221 24660001296492 24660001301964 24660001302373 24660001303691 24660001308952 24660001311725 24660001333594 24660001334332 24660001345811 24660001354734 24660001355132 24660001360502 24660001362008 24660001363876 24660001370873 24660001382820 24660001384156 24660001384726 24660001388949 24660001393249 24660001404681 24660001408434 24660001410889 24660001410899 24660001411147 24660001413164 24660001558490 24660001590368 24660001731844 24660001928564 24660001948786 24660002004996 24660002044400 24660002143454 24660002357371 24660002364567 24660002364807 24660002405582 24660002410012 24660002419725 24660002445605 24660002464849 24660002483143 24660002487625 24660002513758 24660002525465 | **PEDDAPALLE** - 24660001286761 24660001313052 24660001342316 24660001367309 24660001422376 24660001425661 24660002152676 | **RAMAYAMPET** - 24660001361090 24660001412015 | **SANGAREDDY** - 24660001301524 24660001301944 24660001351929 24660001357758 24660001368407 24660001368537 24660001375844 24660001378918 24660001718820 24660002379199 | **SATHUPALLI** - 24660001308192 24660001347657 24660001389547 24660001395765 24660001399478 24660001400168 24660001879535 24660002411850 | **SHADNAGAR** - 24660001396214 24660001403863 24660002380936 24660002381264 | **SIDDIPET** - 24660001282658 24660001292599 24660001293647 24660001304879 24660001330739 24660001391083 24660001418364 24660001483000 24660001652163 24660002401239 | **SURYAPET** - 24660001296342 24660001337306 24660001346019 24660001360262 24660001365793 24660001418654 24660001425381 24660002034069 | **THALLADA** - 24660001361050 24660001383888 24660001693244 24660001711943 | **THORRUR** - 24660001284864 24660001285573 24660001295164 24660001306545 24660001360342 24660001376852 24660001408934 24660001604984 | **VANASTHALIPURAM** - 24660001275632 24660001293547 24660001383788 24660002254584 24660002353158 | **VEMULAWADA** - 24660001286891 24660001294115 24660001306865 24660001308932 24660001330249 24660001331887 24660001344213 24660001350171 24660001353135 24660001365973 24660001371351 24660001390674 24660001391273 24660001392391 24660001398410 24660001398420 24660001399428 24660001399838 24660001412535 24660001455284 24660001794934 24660001836027 24660001908183 24660002034609 24660002034669 24660002034689 24660002105076 24660002198259 24660002340153 24660002377213 24660002426952 24660002487105 24660002504045 | **VIKARABAD** - 24660001323803 | **WANAPARTHY** - 24660001279874 24660001323963 24660001357578 24660001363576 24660001387731 24660001393309 24660001394707 24660001660567 24660002451544 24660002456904 24660002479871 | **YADADRI-BHONGIR** - 24660001309300 24660001330329 24660001330439 24660001361760 24660001364464 24660001364944 24660001394767 24660001740907 24660002407028 | **ZAHEERABAD** - 24660001400208 |

**Note:** The auction is subject to certain terms and conditions mentioned in the bid form, which is made available before the commencement of auction.

Sd/-
**Manager**
**AU Small Finance Bank Limited**

# సీఎం రేవంత్ నేతృత్వంలో మరింత అభివృద్ధి

- కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇంచార్జీల సమావేశంలో మంత్రి కొండా సురేఖ



తెలంగాణ బ్యూరో॑ప్రతినిధిః సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న పథకాలను మెదక్ జిల్లా ప్రజలకు చేరే వేసే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేసి... ముందుకు వెళ్ళాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రత్యేకంగా స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో హైదరాబాద్ బంజారాహిల్స్ లోని మంత్రుల నివాస సముదాయంలో మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇంఛార్జీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, డాక్టర్ మైనంపల్లి హనుమంతరావు(మెదక్), ఆవుల రాజిరెడ్డి(నర్సాపూర్), పూజల హరికృష్ణ(సిద్దిపేట), తుంకూట నర్సారెడ్డి(గజ్వేల్), నీలం మధు ముదిరాజ్(మెదక్ పార్లమెంట్), కాట శ్రీనివాస్ గౌడ్(పటాన్ చెరు), ఏ. చంద్రశేఖర్(జహీరాబాద్), డాక్టర్ సంజీవరెడ్డి(నారాయణఖేడ్), ఎన్ గిరిధర్ రెడ్డి(జహీరాబాద్ సెట్విన్ చైర్మన్) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మంత్రి సురేఖకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జీలు వివరించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. మంత్రి సురేఖ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన మెదక్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జీలు. స్థానికంగా ఉన్న మెదక్ జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి పథకాలు తీసుకెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజాప్రతినిధులకు మంత్రి సురేఖ, దామోదర సూచించారు.

మాజీ సీఎస్ఓ మృతికి మంత్రి సురేఖ సంతాపం

తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ మాజీ సీఎస్ఓ, సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్ టి. గంగారాం మృతి పట్ల తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణంపై మంత్రి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కమాండెంట్ గంగారాం ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబీకులు ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని కొండా సురేఖ పేర్కొన్నారు.

# నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- నిరుద్యోగ యువతకి గుడ్‌న్యూస్ చెప్పిన ప్రభుత్వం
- రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటన
- మార్చి 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ



తెలంగాణ బ్యూరో॑ప్రతినిధిః నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. నిరుద్యోగ యువతకి ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రూ. 6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించనున్నారు. సంక్షేమ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ ల ద్వారా నిరుద్యోగ యువతకి మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు సాయం చేయనున్నారు. మార్చి 15 నుంచి దరఖాస్తుల స్వీకరిస్తారు.
ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

## గ్రూప్-2 ఫలితాల్లో

# సత్తా చాటిన పురుష అభ్యర్థులు

- 32వ ర్యాంకులో మహిళా అభ్యర్థి
- జనరల్ ర్యాంకుతో పాటు ఫైనల్ కీని విడుదల చేసినట్లు తెలిపిన టీజీపీఎస్సీ

తెలంగాణ బ్యూరో॑ప్రతినిధి: గ్రూప్ -2 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. జనరల్ ర్యాంకుతో పాటు ఫైనల్ కీని విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ తెలిపింది. ఇక ఈ ఫలితాల్లో పురుష అభ్యర్థులు సత్తా చాటారు. టాప్ టెన్ ర్యాంకులతో పాటు 31వ ర్యాంకు వరకు పురుష అభ్యర్థులే ఉన్నారు. లక్కిరెడ్డి వినిషా రెడ్డికి 32వ ర్యాంకు వరించింది. వినిషారెడ్డికి 408 మార్కులు వచ్చాయి. టాప్ టెన్ అభ్యర్థుల్లో ఐదుగురు ఓసీలు కాగా, మిగతా ఐదుగురు బీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు ఉన్నారు. టాప్ 50లో ఇద్దరు ఎస్టీ అభ్యర్థులు ఉన్నారు.

నారు వెంకట హరవర్ధన్ (ఓసీ) (మల్టీజోన్ -1) 447.088
వడ్లకొండ సచిన్ (ఓసీ) (మల్టీజోన్ -1) 444.754
బీ మనోహర్ రావు (బీసీ-డీ) (మల్టీజోన్ -2) 439.344
శ్రీరామ్ మధు (బీసీ-బీ) (మల్టీజోన్ -2) 438.972
చింతపల్లి ప్రీతమ్ రెడ్డి(ఓసీ) (మల్టీజోన్ -1) 431.102
అఖిల్ ఎర్ర (ఓసీ) (మల్టీజోన్ -2) 430.807
గొడ్డేటి అశోక్ (బీసీ-బీ) (మల్టీజోన్-1) 425.842
చిమ్ముల రాజశేఖర్(ఓసీ) (మల్టీజోన్-2) 423.933
మేకల ఉపేందర్ (బీసీ-డీ) (మల్టీజోన్-1) 423.119
కరీంగు నరేశ్(బీసీ-బీ) (మల్టీజోన్ -2) 422.989

## లిఫ్ట్ వచ్చిందనుకుని అడుగుపెట్టి..

# కానిరాని లోకాలకు సిరిసిల్లలో కమాండెంట్

తెలంగాణ బ్యూరో॑ప్రతినిధి: సిరిసిల్లలో ఓ భవనంలో లిఫ్ట్ ప్రమాదం జరిగింది. లిఫ్ట్ వచ్చిందనుకుని లోపలికి అడుగుపెట్టడంతో 17వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ గంగారాం (58) కిందపడ్డారు. మూడో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న లిఫ్టు ఆయన పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించేలోపే గంగారాం మృతిచెందారు. స్నేహితుడిని కలిసి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గంగారాం స్వస్థలం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులం.

# చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని, రైతులు, అధికారులు శాస్త్రవేత్తలతో మాట్లాడిన మంత్రి తుమ్మల
- మంగళవారం నుండి పొలం నుండి రైతులు నేరుగా మాట్లాడే అవకాశం
- వ్యవసాయ యాంత్రీకరణలో చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్యత
- అధికారులతో మంత్రి తుమ్మల



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ప్రస్తుతమున్న పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతుల చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రాజేంద్రనగర్ పరిశోధన స్థానం నుండి ప్రత్యక్షంగా వివరించిన శాస్త్రవేత్తలు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతనేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. వరి పంట విషయంలో ప్రస్తుత పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి, రాజేంద్రనగర్ వరిపరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా రైతులకు వివరించడం జరిగింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పద్ధతిలో వరి పంటకు నీరు అందించాలని, దీనివల్ల నీటి ఎద్దడిని అధిగమించడంతో పాటు, అధిక దిగుబడులు కూడా సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు వివరించారు. స్వల్పకాలిక రకాలను నవంబర్ లోనే సాగును ప్రారంభించినట్లయితే మార్చి మొదటి వారం వరకు వరికోతకు రావడానికి అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని గ్రహించి రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుచేయాల్సిన అవసరం ఉందని, తద్వారా నీటి ఎద్దడిని అధికమించడంతో పాటు, వడగళ్ల వర్షం వంటి విపత్తుల నుండి కూడా వరి పంటను రక్షించుకోవడానికి వీలుకలుగుతుందని ఈ సందర్భంగా మంత్రివర్యులు పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్ మరియు ట్రాక్టర్ తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్స్ మొదలైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడి మీద వెంటనే రైతులకు అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ శ్రీమతి యాస్మిన్ బాషా కి మంత్రి సూచించారు. గత 5 సంవత్సరాలలో టీజీ సీడ్స్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో సంస్థ నష్టాల్లోకి వెళ్లిందని, టీజీ సీడ్స్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన సీడ్స్ ని అంతా రైతులకు సరసమైన ధరలో అందించగలిగామని, గత 5 సంవత్సరాలలో సీడ్స్ ని నాన్ సీడ్స్ గా అమ్మినందుకే దాదావు 90 కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. సీడ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ద్వారా నాణ్యమైన సన్నరకాల విత్తనాలను రైతులకు అందించేందుకు తగుచర్యలు తీసుకోవాలని డైరెక్టర్ కి సూచించారు. కందులు, మినుములు, సన్ ఫ్లవర్, శనగలు మొదలైన పంటల విషయంలో నాణ్యమైన విత్తనాలను సీడ్ కార్పోరేషన్ ద్వారా అందించాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా నిర్వహించబడుతున్న జిన్నింగ్ మిల్లు గత నాలుగు సంవత్సరాలుగా ఉపయోగంలో లేదని, ఈ సంవత్సరం దాని జిన్నింగ్ పనిని ఆరంభించమన్నారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న గోదాములు 100 శాతం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న కందులు, శనగలు, వేరుశనగ పొద్దుతిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు గారు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పోరేషన్ ఎండి యాస్మిన్ బాషా, సీడ్ సర్టిఫికేషన్ ఎండి కేశవులు, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం

### కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని తెలిపిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



తెలంగాణ బ్యూరో॑ప్రతినిధి: రీజినల్ రింగడ్డు (ఆర్ఆర్ఆర్)కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్సు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి తెలిపారు. రీజినల్ రింగడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదావు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# సంపాదకీయం

editpage@suryaa.com

ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అమెరికా కెనడా మధ్య రాజకీయ వాతావరణం వేడెక్కింది. రావడం రావడంతోనే కెనడా పై ఇరవై ఐదు శాతం టారిఫ్ ను విధించాడు ట్రంప్. కెనడా మాజి ప్రధాని ట్రూడో ఈ విషయం మీద తీవ్రంగానే స్పందించారు. బలవంతంగా టారిఫ్ లను అమలు చేయాలను కుంటే అమెరికా కెనడా మధ్య సంబంధాలు దెబ్బ తింటాయని, తాము ట్రంప్ ను ఎదు-ర్కోవడానికి సిద్ధమని బహిరంగంగానే ప్రకటించాడు. ఇప్పుడు కెనడా కి కొత్త ప్రధానిగా మార్క్ కార్ని ఎన్నికయ్యారు. ఈ విజయం సందర్భంగా ఆయన ఇంకో అడుగు ముందుకు వేసి గట్టిగానే ట్రంప్ కి కౌంటర్ ఇచ్చారు. అధికార లిబరల్ పార్టీ ఈ మార్చ్ తొమ్మిదిన మార్క్ కార్నిని తమ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకుంది. సుమారు 86 శాతం సభ్యుల ఓట్లతో భారి మెజారిటీతో ఆయనకు విజయం కట్టబెట్టింది. ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ, అమెరికా ఎప్పటికి అమెరికాలో భాగం కాదు,ఏ రకంగా కూడా అమెరికాలో కలవదు. ఇతర దేశాలతో మేము ఏ రకమైన యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కాని అవతలివాళ్ళు కయ్యానికి కాలు దువ్వితే మాత్రం మేము ఉపెక్షించము. అమెరికా ఈ విషయంలో సరిగ్గా ప్రవర్తించాలని కోరుకుంటున్నాను. ఇప్పటి వరకు వాణిజ్యంలో నైనా,హాకి లోనైనా కెనడాదే పై చేయి అని మర్చిపోకూడదు”అని అన్నారాయన. అలాగే అమెరికా కెనడా పై విధించిన సుంకాలకు బదులుగా కెనడా కూడా అదే స్థాయిలో సుంకాలు విధిస్తుందని కూడా హెచ్చరించారు.

అమెరికాకు,కెనడాకి మధ్య ఈ పరోక్ష యుద్ధం ట్రూడో ప్రధానిగా ఉన్నప్పటి నుండే ఉంది. కెనడాను 51వ రాష్ట్రం చేయాలన్న వ్యాఖ్యతో ఇది ఇంకా తీవ్ర స్థాయికి చేరుకుంది. ఒక పక్క సుంకాలు, ఇంకో పక్కా కెనడాను కలిపేసు కోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు కెనడాని కలవరపరుస్తునే ఉన్నాయి. గతంలో ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పుడు “అమెరికా ఫస్ట్” విధానంతో వ్యవ హరించడం వల్ల కెనడాతో సంబంధాలను ఇది కొంత మేరకు ప్రతికూలంగా ప్రభావితం చేసింది. నార్త్ అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పునరుద్ధరణకు సంబంధించి కెనడా, అమెరికా మధ్య విభేదాలు తలెత్తాయి. ట్రంప్ అమెరికాకు నష్టం కలుగుతుందన్న అభిప్రాయంతో నాఫ్టా ఒప్పందాన్ని రద్దు చేయాలని భావిం చాడు. దీంతో యుఎస్ఎంసిఎ (యునైటెడ్ స్టేట్స్ -మెక్సికో -%కెనడా ఒప్పందం అనే

## ట్రంప్ తో తగ్గేదేలే అంటున్న మార్క్ కార్ని!

కొత్త వాణిజ్య ఒప్పందం 2020లో అమలులోకి వచ్చింది, కానీ ఇది కెనడాకు కొన్ని కొత్త సవాళ్లను సృష్టించింది. ముఖ్యంగా, డైరీ ఉత్పత్తులు (పాలు, పాల ఉత్పత్తులు) మరియు ఆటోమొబైల్ తయారీ రంగాల్లో కెనడాపై కొన్ని పరిమితులు విధించబడ్డాయి. 2018లో ట్రంప్ కెనడా స్టీల్ మరియు అల్యూ మినియం ఎగుమతులపై భారీ టారిఫ్లను విధించాడు, దీనివల్ల కెనడా తీవ్ర అసంతృప్తికి లోనైంది. ప్రధాని జస్టిన్ ట్రూడో దీనిని తప్పుపట్టారు మరియు ప్రతిస్పందనగా అమెరికా ఉత్పత్తులపై టారిఫ్లను విధించారు.

ట్రంప్ ప్రభుత్వం కఠిన వలస విధానాలను అమలు చేసింది, ముఖ్యంగా అక్రమ వలసదారులపై చర్యలు కఠినతరం అయ్యాయి. కెనడా, అమెరికా మధ్య రొక్సామ్ రోడ్ మార్గం ద్వారా అక్రమ వలసదారులు ప్రవేశించేందుకు ప్రయత్నించడం పెరిగింది. 2020లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా అమెరికా-కెనడా సరిహద్దు తాత్కాలికంగా మూసివేయబడింది, ఇది రెండు దేశాల వాణిజ్యాన్ని ప్రభావితం చేసింది. అమెరికా-కెనడా నాటో భాగస్వామ్యం కొనసాగింది, కానీ ట్రంప్ నాటో పై వ్యతిరేకంగా మాట్లాడటం కెనడాను నిరాశపరిచింది. అమెరికా కెనడాను రక్షణ వ్యయాలను పెంచాలని కోరింది, కానీ ట్రూడో ప్రభుత్వం మితంగా స్పందించింది.

బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత, అమెరికా-కెనడా సంబంధాల్లో కొంత స్నేహపూర్వక దృక్పథం కనబడింది. ట్రంప్ విధించిన స్టీల్, అల్యూమినియం టారిఫ్లను కొంతవరకు తగ్గించాడు, ఇది కెనడా కోసం ఊరటగా మారింది. అయితే, “బయ్ అమెరికన్ “ పాలసీ ద్వారా అమెరికా ప్రభుత్వం దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం కెనడా కంపెనీలకు కొన్ని ఇబ్బందులను కలిగించింది. బైడెన్ పర్యావరణ పరిరక్షణపై ఎక్కువగా దృష్టి సారించారు, కానీ ఇది కొన్ని కెనడా-అమెరికా ప్రాజెక్టులపై ప్రతికూల ప్రభావం చూపింది. 2021లో బైడ **Keystone XL Pipeline** ప్రాజెక్టును రద్దు చేశాడు, ఇది కెనడాకు భారీ ఆర్థిక నష్టాన్ని కలిగించింది.

ట్రంప్ కంటే బైడెన్ వలసదారులపై మృదువైన విధానాన్ని అవలంబించారు. అమెరికాలో అక్రమంగా ఉన్న కొందరు వలసదారులకు పౌరసత్వ అవకాశాలు కల్పించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 2022లో, కెనడా-అమెరికా సరి హద్దు పూర్తిగా తెరవబడింది, కోవిడ్-19 నిబంధనలు పూర్తిగా సడలించ బడ్డాయి. బైడెన్ ప్రభుత్వం నాటో, నోరాడ్ వంటి భద్రతా సంస్థల సహాయాన్ని పెంచింది, ఇది కెనడాకు లాభదాయకం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయంలో అమెరికా మరియు కెనడా ఉక్రెయిన్కు మద్దతు అందించాయి. చైనా విషయంలో రెండు దేశాలు సామాన్య విధానాన్ని అవలంబించాయి, ముఖ్యంగా హువాయి వంటి చైనా కంపెనీలపై కొన్ని నిషేధాలు విధించాయి.

ఇక ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రత్యక్షంగానే కెనడాని ట్రంప్ బెదిరించి అయినా తన దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. కొత్త కెనడా ప్రధానిగా వచ్చిన మార్క్ కార్ని ఒక ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్రీయ బ్యాంక్ గవర్నర్, మరియు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ నాయకుడు. 2008 ఆర్థిక మాంద్యంలో కెనడాను స్థిరంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. బ్రెగ్జిట్ సమయంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను సమతుల్యం చేయడంలో సహాయపడ్డారు. పర్యావరణ సంబంధిత ఆర్థిక విధానాలకు మద్దతుగా పనిచేశారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో, కార్నీ కెనడా బ్యాంకింగ్ వ్యవస్థను కూలకుండా రక్షించారు. అత్యవసర తక్కువ వడ్డీ రేట్లు అమలు చేసి మార్కెట్లో మదుపుదారుల విశ్వాసాన్ని పెంచారు. బ్యాంక్ రెగ్యులేషన్లు కఠినతరం చేసి మళ్లీ ఆర్థిక సంక్షోభాలు రాకుండా చర్యలు తీసుకున్నారు. కార్నీ పర్యావరణ సమస్యలను పరిష్కరించే దిశలో ఆర్థిక విధానాలు తీసుకువచ్చే ప్రయత్నాలు చేశారు. గ్రీన్ ఇన్వెస్ట్మెంట్స్, పునరుత్పాదక శక్తి ప్రోత్సాహం ద్వారా పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ఆసక్తి కనబర్చారు. ఇది ఆయన ట్రాక్ రికార్డ్.

కార్నీ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం ఉన్న నాయకుడు. అంతర్జాతీయ పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంచడం ద్వారా కెనడా ఆర్థిక వ్యవస్థను మరింత బలపడేలా చేయగలరు. ఇన్నోవేషన్, టెక్నాలజీ రంగాలలో పెట్టుబడులను ఇంకా ముందుకు తీసుకువెళ్ళగలడు. కాని ట్రంప్ ని ప్రత్యక్షంగా రాజకీయ అనుభవం లేని మార్క్ కార్ని ఎదుర్కోవాలని అనుకోవడం మాత్రం కొంత ప్రమాదంతో కూడిన విషయమే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కెనడాలో ప్రస్తుతం ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, బడ్జెట్ లోటు వంటి సమస్యలు ఉన్నాయి.ట్రంప్ తో వ్యూహాత్మకంగా వ్యవహరించడం వేరు, బహిరంగంగా మాటల యుద్ధంతో కయ్యానికి సిద్ధం అని చెప్పడం వేరు. అసలే తనకు వ్యతిరేకంగా ఉన్న ప్రతి అంశానికి ఎంతో తీవ్రంగా స్పందించే ట్రంప్ మార్క్ కార్నిని ,కెనడాను బద్ధ శత్రువుగా భావిస్తే మాత్రం ట్రూడో సమయంలోనే మొదలైన ఈ యుద్ధం ఇంకా ముదిరే అవకాశం ఉంది. దీన్ని కొంత సుతిమెత్తగా ముందుకు తీసుకువెళ్ళగలిగితేనే కార్ని ట్రంప్ ని ఎదుర్కోగలడు.అలా కాకుండా ఇలా ట్రంప్ ను రెచ్చగొట్టే చర్యలకు ప్రత్యక్షంగా పూనుకుంటే అది ప్రతికూల ప్రభావాన్నే చూపే అవకాశం ఎక్కువ ఉంది.

# శశి థరూర్ హస్తానికి హ్యాండ్ ఇస్తాడా?

■ కేరళ కాంగ్రెస్లో నాయకత్వ శూన్యత పై విమర్శలు ■ ఇటీవల ప్రదాని మోడీ పై శశిథరూర్ ప్రశంసల వర్షం ■ వివాదాలు ఆయన జీవితంలో ఓ బాగమయ్యాయి ■ అయినా అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించడం ఆతని ప్రత్యేకం ■ కాంగ్రెస్లో “గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా తిరిగే వ్యక్తి గా పేరు



**తేజస్వి**
**హైదరాబాద్**

ప్రధాని మోదీని, కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని పొగడటం వివాదాస్పదమైన నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తాను ఇప్పటికీ పార్టీకి అందుబాటులోనే ఉన్నానని చెబుతూనే వార్నింగ్ ఇచ్చారు. తన అవసరం లేదని పార్టీ భావిస్తే తనకూ వేరే ఆప్షన్లు ఉన్నాయని ‘ఐఈ మలయాళం’ పాడ్కాస్ట్లో ఆయన మాట్లాడారు. కేరళ ప్రభుత్వ స్టార్టప్ పాలసీని, ప్రధాని మోదీ యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ను కలవడంపై ఇటీవల తన ఆర్టికల్లో శశిథరూర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇదే ప్రస్తుత వివాదానికి మూలమైన విషయం.

ఇంకో పక్క తన పార్టీ అయిన కాంగ్రెస్ ను కేరళ విషయంలో విమర్శించారు. ‘కేరళ కాంగ్రెస్లో నాయకత్వ శూన్యత ఉంది. ఈ విషయమై నా అభిప్రాయాలను పార్టీ ఇతర నేతలూ సమర్థించారు. కొత్త ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ తన బేస్ను విస్తరించాల్సిన అవసరముంది. రాష్ట్ర నాయకత్వ రేసులో నేను అందరికంటే ముందున్నాను. కొన్ని సంస్థల పోల్లో ఈ విషయం స్పష్టమైంది. కాంగ్రెస్ తన ప్రాబల్యాన్ని విస్తరించకపోతే వచ్చే ఎన్నికల్లో మూడోసారి ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వస్తుంది’,అని అనడం ,అదే సమయంలో బిజెపి నాయకులను పొగడటం దేశవ్యాప్తంగా చర్చలకు దారి తీసింది.

శశి థరూర్ భారత రాజకీయాలలో ప్రముఖ వ్యక్తి, ప్రముఖ రచయిత, మరియు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నేత. ఆయన అంతర్జాతీయ అనుభవంతో పాటు ఐక్యరాజ్యసమితి లోని విశేష అనుభవం, పార్లమెంటరీ ప్రదర్శన, మరియు అభిప్రాయాల స్పష్టత వల్ల ప్రత్యేకంగా నిలిచారు. అయితే, ఆయన రాజకీయ జీవితంలోనూ వ్యక్తిగత జీవితంలోని ఎన్నో వివాదాలు. వివాదాలు ఆయనకు కొత్తేం కాదు.

శశి థరూర్ 1956లో లండన్లో జన్మించారు కానీ, భారతీయ కుటుంబానికి చెందినవారు. సెంట్రల్ స్కూల్, కోల్కతా లో చదివి, తర్వాత స్టీఫెన్ కాలేజీ, ఢిల్లీ యూనివర్శిటీ నుంచి పట్టభద్రుడయ్యారు. టుఫ్ట్స్ యూనివర్శిటీ, యు ఎస్ ఎ లో ఇంటర్నేషనల్ రిలేషన్స్లో పట్టా పొందారు. 1978లో ఐక్యరాజ్యసమితి లో చేరి 2007 వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. 2006-07లో యు ఎన్ సెక్రటరీ జనరల్ అభ్యర్థిగా పోటీచేశారు, కానీ బాన్ కీ మూన్ గెలిచారు. 2009 లో కాంగ్రెస్ పార్టీ తరఫున తిరువనంతపురం నుంచి లోక్సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తర్వాత 2014, 2019లో కూడా తిరిగి ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల సహాయ మంత్రిగా నియమితులయ్యారు.

ఆయన జీవితంలో వివాదాలను గమనిస్తే అత్యంత సంచలనం సృష్టించిన వివాదం ఆయన భార్య సునందా పుష్కర్ అనుమానాస్పద మృతి. 2014 జనవరి 17 న ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్ గదిలో సునందా పుష్కర్ మృతదేహాన్ని గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, ఇది ఆత్మహత్య అని భావించారు, కానీ తర్వాత ఆమె విషప్రయోగం కారణంగా చనిపోయినట్లు నివేదికలు వచ్చాయి. శశి థరూర్పై హత్య, ఆత్మహత్యకు దారి తీసిన కారణాలు అనే ఆరోపణలు వచ్చాయి. 2018లో ఢిల్లీ పోలీసులు శశి థరూర్పై అభియోగాలు నమోదు చేశారు, కానీ 2021లో కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసు ఆయన రాజకీయ జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

2012లో ఐపి ఎల్ స్పాట్ ఫిక్సింగ్ వివాదంలో శశి థరూర్ పేరు వచ్చింది.ఆయన రాజస్థాన్ రాయల్స్ క్రికెట్ జట్టుకు సహాయం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.అప్పటి ఐపీఎల్ కమిషనర్ లలిత్ మోడీ, “సునందా పుష్కర్కు 50 కోట్లు అన్యాయంగా ఇచ్చారని” ఆరోపించారు.ఈ వివాదం కారణంగా శశి థరూర్ కేంద్ర సహాయ మంత్రిగా రాజీనామా చేయాల్సి వచ్చింది.తర్వాత సునందా పుష్కర్ తనకు స్వయంగా ఐ పి ఎల్ ఫ్రాంచైజీలో వాటా ఉందని చెప్పిన తర్వాత వివాదం మరింత ముదిరింది. 2018లో “భారతదేశం భవిష్యత్తులో హిందూ పాకిస్థాన్గా మారవచ్చు” అని వ్యాఖ్యానించారు. బిజెపి నేతలు, హిందుత్వ అనుచరులు తీవ్రంగా విమర్శించారు. ఆయన “భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, భారతదేశాన్ని మత ఆధారంగా హిందూ రాష్ట్రంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి” అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి నేతలు కేసులు కూడా నమోదు చేశారు. తర్వాత ఆయన ఈ వ్యాఖ్యకే వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా, ఈ వివాదం కొనసాగింది. 2018లో ప్రధాని నరేంద్ర మోదీని వ్యంగ్యంగా అని అభివర్ణించడం పెద్ద వివాదానికి దారి తీసింది. ఈ వ్యాఖ్యను ఆర్ ఎస్ ఎస్ ,బిజెపి నేతలు తీవ్రంగా ఖండించారు. ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు కోర్టులో కేసు కూడా వేశారు. తర్వాత థరూర్ “నా వ్యాఖ్యను వక్రీకరించారు” అని వివరణ ఇచ్చినా, వివాదం పెద్దదయ్యింది. 2018లో భారతదేశంలో మీ టూ ఉద్యమం సమయంలో, ఓ మహిళా జర్నలిస్ట్ థరూర్పై అసభ్యమైన ప్రవర్తన చేశారని ఆరోపించారు. కానీ, ఆమె పూర్తి వివరాలు వెల్లడించలేదు. థరూర్ ఈ ఆరోపణలను ఖండించారు, కానీ ఇది అప్పట్లో చర్చనీయాంశమైంది. 2022లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు.మల్లికార్జున ఖర్గే గెలిచినప్పటికీ, ఆయన పోటీ తీరును పార్టీ లోపల పలువురు విమర్శించారు.పార్టీ అధినేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వర్గం ఆయనను పూర్తిగా మద్దతు ఇవ్వలేదు.కాంగ్రెస్లో “గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా తిరిగే వ్యక్తి” అనే ముద్ర పడింది.ఇప్పటికి ఆయన కాంగ్రెస్ పార్టీ నేతగా కొనసాగుతున్నప్పటికీ, పెద్దగా అధికార దృష్టిలో లేరు. పార్టీ హైకమాండ్తో కొంత అంతర్లీన విభేదాలు ఉన్నట్లు కని పిస్తోంది. కానీ, బుద్ధిజీవిగా, మేధావిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ ని బహిరంగంగా విమర్శిస్తూ బిజెపి పట్ల కొంత సానుకూలంగా ప్రవర్తిస్తూ ఉండటం ఆయన కొత్త రాజకీయ వ్యూహం కావొచ్చు. ఇప్పటికే కాంగ్రెస్ తో అసలు పడని పరిస్థితుల్లో ఉన్న శశి థరూర్ బిజెపి దృష్టిలో పడటానికి ఈ చర్యలు చేస్తూ ఉండొచ్చు. బిజెపి నానాటికి బలపడుతూ ఉండటంతో కాంగ్రెస్ నుండి బయటపడి బిజెపిలో ఎంట్రీ కోసం ప్రత్యక్షంగానే కాంగ్రెస్ పై మాటల యుద్ధం ప్రకటించి ఉండొచ్చు. ఏదేమైనా మేధావిగా పేరు పొందిన శశి థరూర్ త్వరలోనే కాంగ్రెస్ కి గుడ్ బై చెప్పి బిజెపిలో చేరినా ఆశ్చర్యపోనవసరం లేదు.

# తెలంగాణ హోం మంత్రిగా విజయశాంతి?

■ ఇటీవలే కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నిక ■ రేవంత్ కేబినెట్ లోకి రాములమ్మని తీస్కొనే ఆస్కారం ■ ఉద్యమం అంటే తమ సొత్తు అన్నట్లు వ్యవహరిస్తున్న కెసిఆర్ కుటుంబం ■ తెలంగాణ సెంటిమెంట్ వాడుకుంటున్న కేసీఆర్ కు చెక్ కు చాన్స్ ■ రేవంత్ రెడ్డికి విజయశాంతి తోడైతే బిఆర్ఎస్ విమర్శలకు కౌంటర్లు ఖాయం ■ విజయశాంతికి హోం మంత్రిగా ఇస్తే కెసిఆర్ కుటుంబంపై మరిన్ని కేసులు



**విద్య వెంకట్ - తెలంగాణ బ్యూరో**
**9391618181**

ముల్లును ముల్లునే తీయాలన్నా ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ కెసిఆర్ కుటుంబానికి చెక్ పెట్టేందుకు వ్యూహరచన చేస్తోంది. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ కు విజయశాంతి తోడైతే గత ప్రభుత్వ అవినీతిని మరొకసారి వెలికి తీసి ప్రజల ముందు పెట్టి ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేసేందుకు వ్యూహరచన చేస్తోంది. అందులో భాగంగానే ఎవరు ఊహించని విధంగా ఫైర్ బ్రాండ్ విజయశాంతి కి కాంగ్రెస్ అధిష్టానం సూచనతో ఎమ్మెల్యే ఫోటోలు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. విజయశాంతి భారతీయ జనతా పార్టీ లో రాజకీయ అరంగేట్రం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తల్లి తెలంగాణ పార్టీని ఆవిర్భవించింది. తల్లి తెలంగాణ పార్టీతో ఉద్యమంలో పాల్గొన్న విజయశాంతి ఆ తర్వాత క్రమంలో తెలంగాణ రాష్ట్రం కోసం ఆవిర్భవించిన టిఆర్ఎస్ లో చేరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ ఎంపిక గెలుపొందిన ఫైర్ బ్రాండ్ విజయశాంతి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టినప్పుడు ఆముదం కోసం టిఆర్ఎస్ ఎంపీగా పోరాటం చేశారు. విజయశాంతిని టిఆర్ఎస్ పార్టీ నుండి పొమ్మనక పొగబెట్టినట్లు చేసి పార్టీ నుండి తప్పించారు. ఆ తదుపరి రాజకీయాలకు దూరంగా ఉన్న విజయశాంతి తిరిగి భారతీయ జనతా పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు విజయశాంతి భారతీయ జనతా పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత ప్రభుత్వ తీరుపై ఒకవైపు డిసిసి అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి మరోవైపు ఫైర్ బ్రాండ్ విజయశాంతిలు ప్రచారం చేయడంతో భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో యాక్టివ్ గా లేనప్పటికీ పార్టీ అధిష్టానం సూచనతో విజయశాంతికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఎన్నికల లాంచడమే కావడంతో రేవంత్ సర్కార్ లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండడం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు సైతం తక్కువగా ఉండడంతో విజయశాంతి బీసీ కావడంతో మంత్రి పదవి ఖాయమని చర్చ జరుగుతుంది. బిఆర్ఎస్ నేతలు కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్, కవిత లతోపాటు ఇతర నాయకులు రేవంత్ సర్కార్ పై విమర్శలు సంధించడం తెలంగాణ ఉద్యమ జవసత్వం లేని రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారు. దీంతో వారి విమర్శలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఫైర్ బ్రాండ్ విజయశాంతి కి హోం మంత్రి శాఖ కేటాయిస్తే ఉద్యమకారులను మోసం చేసి కుటుంబ పార్టీగా లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డ కేసీఆర్ కుటుంబంపై ధీత అయిన జవాబు విజయశాంతి ఇచ్చే అవకాశం ఉందని అది స్థానం స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది. తెలుగు సినీ పరిశ్రమలో లేడీ అమితాబ్ గా ఓ వెలుగు వెలిగిన విజయశాంతి, తెలంగాణ రాజకీయాలలో ఫైర్ బ్రాండ్ నాయకురాలిగా గుర్తింపు పొందారు. అటువంటి విజయశాంతికి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలను పార్టీ అధిష్ఠానం నిర్ణయం దిగ్భ్రమకు గురి చేసిందనడంలో సందేహం లేదు. సరిగ్గా గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన విజయశాంతి ఆ ఎన్నికలలో కానీ, ఆ తరువాత జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో కానీ విజయశాంతి రాష్ట్ర కాంగ్రెస్ తరఫున పెద్దగా ప్రచారం చేసిన దాఖలాలు లేవు. సరే ఆ సంగతి పక్కన పెడితే ఇప్పుడు ఆమెకు కాంగ్రెస్ హై కమాండ్ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంలోనూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రమేయం లేదు.

అసలు రాష్ట్ర పార్టీ నాయకత్వం నుంచి ఆమె పేరును ఎవరూ సిఫారసు కూడా చేయలేదు. ఆమె గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన సందర్భంలో అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జ్ ఠాక్రే అప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు విజయశాంతికి ఎమ్మెల్సీ టికెట్ దక్కిందన్న చర్చ కాంగ్రెస్ వర్గాలలో జోరుగా సాగుతోంది. సరే మొత్తం మీద రాష్ట్ర కాంగ్రెస్ నేతల సిఫారసు లేకుండా, అసలిక్కడి నేతలతో సంబంధం లేకుండా విజయశాంతి పేరును నేరుగా అధిష్ఠానమే ఖరారు చేసింది.

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కాంగ్రెస్ లో ఓ కొత్త చర్చకు తెరలేచింది. ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత జరగనున్న రేవంత్ కేబినెట్ విస్తరణలో విజయశాంతికి బెర్త్ కన్ఫర్మ్ అంటూ రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. ఇందుకు కారణంగా వారు.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు దీటుగా బదులిచ్చే నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ లో చాలా తక్కువగా ఉన్నారనీ, మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ పైన కేటీఆర్, హరీష్ ల విమర్శలకు దీటుగా బదులిస్తున్న దాఖలాలు లేవనీ అంటున్నారు. ఈ పరిస్థితుల్లో త్వరలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా పొలిటికల్ గా యాక్టివ్ అవుతారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో కేబినెట్ లో విజయశాంతి వంటి ఫైర్ బ్రాండ్ లీడర్ అవసరమని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తున్నదని చెబుతున్నారు. విజయశాంతి హోం మంత్రిగా పదవీ బాధ్యతలు చేపడితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో ప్రచారానికి ప్రజల నుండి మద్దతు లభిస్తుందన్న ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఉన్నట్టు తెలుస్తుంది. అయితే త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో ఆమెకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు బలం చేకూరుతుంది.

# పరువు హత్యలపై - సంస్కరణలు అవసరం

■ సూపారి ఇచ్చి మరీ హత్యలు చేయించడం ఆందోళన కరంద ■ కన్నవారిని పొట్టన పెట్టుకునేందుకు కూడా వెనక్కి తగ్గని వైనం ■ వేరే రాష్ట్రం నుంచి తీసుకువచ్చి మరీ చంపేస్తున్న కర్కసత్వం ■ సమాజంలో సామాజిక రుగ్మత గా పెరుగుతుండటం ఆశ్చర్యకరం ■ పరువు హత్యలు చేసే వారికి ఉరి తీతే సరైన శిక్ష

**-కిరణ్ ఫిషర్**
**7989381219**

ప్రపంచ దేశాలలో మన భారత దేశం విభిన్నంగా ఉంటుంది, ఇక్కడ ఉన్న వివిధ రకాల కులాలు, మతాలు, వర్ణాలు ఉంటాయి, అయితే భారత దేశంలో అనాది గా ఒక పెద్ద కులం ఇంకో కులాన్ని తక్కువగా చూడటం మనం చూస్తుంటాము, అది అందరికీ తెలిసిన విషయమే! అయితే గత ఆరేళ్ల క్రితం పరువు హత్య పేరుతో ప్రణయ్ అనే అబ్బాయిని అన్యాయంగా ఒక ఎక్కువ కులం అమ్మాయిని పెళ్లి చేసుకున్న కారణంగా అమ్మాయి వాళ్ళ తండ్రి, జీర్ణించుకోలేక పోయాడు, సూపారి ఇచ్చి మరీ వేరే రాష్ట్రం నుంచి తీసుకువచ్చి చంపించడం జరిగింది, ఈ నెల10 తారీఖున నల్గొండ జిల్లా కోర్టు వాళ్లకు శిక్షలు విధించడం జరిగింది. ఈ తీర్పు లో బాధితులకు న్యాయం జరిగినట్టే అని సమాజం భావిస్తుంది! అసలు శిక్షలు విధిస్తే న్యాయం అందుతుందా! సమాజంలో దీని ద్వారా మార్పు వస్తుందా!

పరువు హత్య అంటే: పరువు హత్య సమాజంలో సామాజిక రుగ్మత గా చెప్పవచ్చు, ఇది ఒక కుటుంబంలో వ్యక్తి, ఆ కుటుంబ సభ్యులకు మచ్చ తెచ్చిన, పరువు పోగొట్టిన వాళ్ళ బందువులు గాని, కుటుంబ సభ్యులు కాని వారిని చంపిచడం కానీ చంపడం కానీ చేసినట్లయితే అది పరువు హత్యగా చెప్పవచ్చు, ఇది ఎన్నో ఏండ్లుగా మన దేశంలో కొనసాగుతుంది, ఇది సామాజిక, మత, కుల, వారి కుటుంబ పరువుల పై ఆధారపడి ఉన్నది, నేటికీ హత్యలు జరుగుతూనే ఉన్నాయి. పరువు హత్యలు ముఖ్యంగా కులాంతర పెళ్ళిళ్ళు, అక్రమ సంబంధాలు, వంటి వల్లనే జరుగుతున్నాయి, దేశంలో నేషనల్ క్రైమ్ బ్యూరో డేటా ప్రకారం 2019 -2020 లో 25 హత్యలు, 2021 లో 33 గా హత్యలు నమోదు



అయ్యాయి, ఇంకా వెలుగులోకి రానివి చాలనే ఉన్నాయి,

**కారణాలు:** కుల వ్యవస్థ: వాస్తవానికి పరువు హత్యలు జరగడానికి కొన్ని కారణాలు న్నాయి, అందులో ఒకటి కుల వ్యవస్థ , మన దేశంలో ఎన్నో కులాలు దొంతరులుగా ఉన్నాయి, ఒక్కో కులం ఇంకో కులానికి పెళ్ళిళ్ళు చేయరు, వారి వారి కులాలలో మాత్రమే పెళ్ళిళ్ళు చేసుకోవడం జరుగుతుంది, అయితే మారుతున్న కాలానికి ఎంతో మంది కులాంతర వివాహాలు చేసుకుంటున్నారు దాని ద్వారా కూడా హత్యలు జరుగుతూనే ఉన్నాయి,పితృస్వామ్య నియమాలు : ఇవి కూడా ఒక కారణం గా చెప్పొచ్చు, నిజానికి నేటికీ అమ్మాయిల ఒప్పందం లేకుండా ఆమె హక్కును లెక్క చేయకుండా వాళ్ళ కుటుంబ సభ్యుల పరువు పైనే ఇంకా పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి, అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**కుల పంచాయతీ లు:** నిజానికి కొన్ని డామినెంట్ కులాలు కింది కులాల వాళ్ళు పెద్ద కులం వాళ్ళని పెళ్లి చేసుకుంటే అది జీర్ణించుకోలేని పెద్ద కులం వాళ్ళు కొన్ని రకాల నేరాలు చేయడం మనం చూస్తున్నాము, అందులో చంపే వరకు అయిన వెనుకకు వెళ్ళే ప్రసక్తే లేకుండా ఉంటారు, అంటే వాళ్ళ కుల నియమాలు భంగం వాటిల్లటం ద్వారా ఇలా జరుగుతున్నాయి, ఉదాహరణకు నార్త్ ఇండియా లో జరిగే“కాప్ పంచాయతీ” లు గా చెప్పవచ్చు. సోషల్ స్టేటస్ కూడా ఒక కారణం గా ఉంది అని చెప్పొచ్చు.

**లీగల్ ప్రొవిజన్స్ ఏమీ ఉన్నాయిబీ** పరువు హత్యను మర్డర్ గా పరిగణిం చడం జరుగుతుందిసెక్షన్ 299- 304 ఇండియన్ పీనల్ కోడ్ ( ఇప్పుడు బిఎన్ఎస్ సెక్షన్ 100, 101,103,104,106) వివరించడం జరుగుతుంది, ఇందులో మర్డర్ కి శిక్ష “జీవిత ఖైదు మరియు డెత్ గా విధించడం జరుగుతుంది “ ఐపిసి 307 కూడా అట్టేమ్ట్ మర్డర్ కూడా 10 ఏళ్ల వరకు శిక్ష విధించడం జరుగుతున్నది, ఐపీసీ 34, 35 కూడా వివరించడం జరుగుతుంది. అయితే లా కమిషను 242 (2012) రిపోర్ట్ కూడా పూర్తిగా చెప్పింది, emphasised the need for anti honor killing laws that would provide legal clear guidelines for investigation, prosecution, and punishments in such cases. లతా సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ 2006 కేసులో పరువు హత్యలపై సుప్రీం కోర్టు పూర్తి స్థాయిలో ఖండించింది, కులాంతర వివాహం చేసుకున్న వారికి పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలి అని, పెళ్లి చేసుకున్న వాళ్లకు ఇబ్బందులు గురి చేస్తే తీవ్రమైన శిక్షలు ఉంటాయి అని చెప్పింది, మరో కేసులో కూడా స్టేట్ అఫ్ ఉత్తరప్రదేశ్ వర్సెస్ కృష్ణ మాస్టర్కేసు 2010లో కూడా పరువు హత్యలు చేసిన వారికిజీవిత ఖైదు విధించడం జరిగింది,శక్తి వాహిని కేసు 2018 లో సుప్రీం కోర్టు తేల్చి చెప్పేసింది పరువు హత్యలు ప్రాథమిక హక్కులను భంగం కలిగిస్తుంది అని, వీటిపై బలమైన శిక్షలు అమలు చేయాలి అని చెప్పింది,

**తీసుకోవాల్సిన చర్యలు** :సమాజం మారాలిబీ ముందుగా సమాజం మారాలి కులం, మతం, ప్రాంతం,లింగం, అసమానతలు పై ఇతరులను దూషించడం వంటివి చేయకూడదు, సమాజం లో రోజు రోజు మారుతున్న కాలానికి ఇంకా కులం ఆచారం పరువు వంటివి పట్టుకొని వేలాడొద్దు, చట్టం ముందు అందరూ సమానులే అనే భావన రావాలి, మనిషి కి విలువ ఉండాలి, పరువు హత్యలు వల్ల రెండు కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉంటాయి, దాని ద్వారా కుటుంబ సభ్యులు ఎంతో మానసిక వేదనకు గురి కావాల్సిన అవసరం ఉంటుంది, సమాజం లో సామాజిక మార్పు అవసరం ఉంది. అదేవిధంగా చట్టాలు కూడా బలంగా చేయాలి, శిక్షలు వెంటనే విధించాలి, ముందస్తుగా కులాంతర వివాహం చేసుకున్న వారికి రక్షణ ప్రభుత్వం కల్పించాలి, జీవించే హక్కుకు భంగం కలగకుండా చూడాలి, గొప్ప గొప్ప వాళ్ళకు పరువు హత్యలు పాల్పడితే రాజకీయంగా వారిని పోటీ చేసే అర్హత నుండి తీసెయ్యాలి, కుల ఆధారంగా ఉన్న చట్టాలను ఇంకా కఠిన తరం చేయాలి, చట్టాలను కూడా నిర్వీర్యం చేయకుండా, దానిని మంచికే వాడాలి, ప్రత్యేక వివాహ చట్టం 1954 రిజిస్ట్రేషన్ కూడా ఒక నెల నుండి ఒక వారానికి తగ్గించే విధంగా సంస్కరణ చేయాలి, అదేవిధంగా పెళ్లి చేసుకున్న వారికి పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలి, అటు ప్రభుత్వం ఇటు సమాజం పరువు హత్యను ఖండించాలి, మెరుగైన సమాజం కోసం వెతకాలి!

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com


SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H.
NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# బిజినెస్

## 16న జీ తెలుగు డ్రామా జూనియర్స్ సీజన్ 8 ఆడిషన్స్




హైదరాబాద్ : ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుండే ఛానల్ జీ తెలుగు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి బుల్లితెరపై మెరిసే అవకాశం కల్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న సక్సెస్ఫుల్ షో డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 8 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 7 సీజన్లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రతిభగల పిల్లలని ఆడిషన్స్కి ఆహ్వానిస్తోంది. - డ్రామా జూనియర్స్ సీజన్ 8 కోసం తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులకు అద్భుత అవకాశం అందిస్తోంది. 4 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కని అవకాశం అందిస్తోంది జీ తెలుగు. మీ పిల్లలకు నటనపై ఆసక్తి ఉంటే తప్పకుండా ప్రోత్సహించి వారి భవిష్యత్తుకు బాటలు వేయండి. విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్తో పాటు చక్కగా పాటలు పాడి అలరించే పిల్లలకోసం ఆన్గ్రౌండ్ ఆడిషన్స్ నిర్వహించనుంది. నటన, అద్భుతమైన డైలాగ్ డెలివరీ, మార్షల్ ఆర్ట్స్, మ్యాజిక్ లో ప్రవేశం ఉన్న పిల్లలకూ అద్భుత అవకాశం అందిస్తోంది. ఈ ఆడిషన్స్ ఆదివారం (మార్చి 16న) రోజు, సారథి స్టూడియో, అమీర్పేట్, హైదరాబాద్ నందు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించబడతాయి. ఏవైనా సందేహాలు ఉంటే 9032581717 నెంబర్కి కాల్ చేయవచ్చు.

### తొలి మొబైల్ టెలి-సర్జికల్ యూనిట్

## మంత్ర ఎంను ఆవిష్కరించిన ఎస్ఎస్ ఇన్నోవేషన్స్




గుర్గావ్ : దేశంలో మొట్టమొదటి, ఏకైక దేశీయ సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ - ఎస్ ఎస్ఐ మంత్ర తయారీదారు ఎస్ ఎస్ ఇన్నోవేషన్స్, గుర్గావ్లోని లీలాలో రెండో గ్లోబల్ ఎస్ ఎస్ ఐ మల్టీ-స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ కాన్ఫరెన్స్ (ఎస్ ఎం ఆర్ ఎస్ సీ) 2025 ను నిర్వహించింది. రోబోటిక్ శస్త్రచికిత్సల పరివర్తన సామర్థ్యాన్ని అన్వేషించడానికి ఒకే వేదికపై సమావేశమైన 1200 మందికిపైగా ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణులు రెండు రోజుల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ఎంఆర్ఎస్సీ 2025 లో అద్భుతమైన ప్రకటన, ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఎస్ ఎస్ఐ మంత్ర టెలి-సింక్ మొబైల్ యూనిట్ - "ఎస్ ఎస్ ఐ మంత్ర ఎం" ను ఆవిష్కరించారు. ఇది భారతదేశంలో రోబోటిక్ శస్త్రచికిత్స, టెలిమెడిసిన్ రంగాలను మార్చడానికి మొట్టమొదటి ఆవిష్కరణ.

ఈ విప్లవాత్మక మొబైల్ టెలి-సర్జికల్ యూనిట్ వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను పునర్నిర్వచించడం, అత్యాధునిక శస్త్రచికిత్సలను అందరికీ అందుబాటులోకి తేవడంలో ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ అచంచల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ పురోగతితో, ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ మెడ్-టెక్ సరిహద్దులను చెరిపేసి, శస్త్రచికిత్స మౌలిక సదుపాయాలను విప్లవాత్మకంగా మార్చి, రోబోటిక్ శస్త్రచికిత్స, ఆరోగ్య-సాంకేతిక ఆవిష్కరణలలో భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, "ఎస్ ఎస్ఐ మంత్రఎం ఒక మొబైల్ టెలీసర్జికల్ యూనిట్ కంటే ఎక్కువ. హై-స్పీడ్ టెలికమ్యూనికేషన్, శాటిలైట్ కనెక్టివిటీతో ఇది భౌగోళిక అడ్డంకులను చెరిపేస్తుంది. నిరుపేదల ప్రాణాలను కాపాడే రోబోటిక్-సహాయక శస్త్రచికిత్సను అందిస్తుంది. టెలీ-సర్జికల్ విధానాలకు మించి, శస్త్రచికిత్స విద్య, టెలి-మెంటరింగ్, రియల్-టైమ్ రోగి డేటా విశ్లేషణలకు ఎస్ఎస్ఐ మంత్రఎం ఒక శక్తివంతమైన వేదిక. నిరంతర పరిశోధన, ఆవిష్కరణలతో అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స అత్యం త అవసరమైన వారికి చేరే దిశగా ఎస్ఎస్ఐ కీలక అడుగు వేస్తోంది" అన్నారు.

## కాలిఫోర్నియా బాదంపప్పులతో హెల్తీ హోలీ



హోలీ, రంగుల పండుగ, సంతోషం, ఐక్యత మరియు సాంస్కృతిక చైతన్యం. వసంతకాలం ఆగమనం మరియు చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకుంటారు, ఇది సంగీతం, నవ్వు మరియు ఆనందకరమైన పండుగ విందుల యొక్క ఉత్సాహభరితమైన మిశ్రమంలో ప్రజలను ఒకచోట చేర్చుతుంది. గుజియాలు మరియు మాల్పువాలు వంటి తీపి డిలైట్స్ నుండి సువాసనగల తాండాయి మరియు రుచికరమైన స్నాక్స్ వరకు, వేడుకలలో ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏది ఏమైనప్పటికీ, అన్ని ఉత్సాహాల మధ్య, మనం తినేవాటిని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం, ఎందుకంటే డీప్ఫ్రైడ్ లేదా చక్కెరతో కూడిన ట్రీట్ల అధిక వినియోగం మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కాలిఫోర్నియా బాదంపప్పులు - గింజల రారాజు - హోలీ సంబరాలలో చేర్చడం ద్వారా తృప్తి మరియు పోషకాహారం మధ్య సంపూర్ణ సమతుల్యతను సాధించడానికి సులభమైన మార్గం. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదంపప్పులు సహజంగా 15 ముఖ్యమైన పోషకాలతో నిండి ఉన్నాయి, వీటిలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు మరియు ఫైబర్ ఉన్నాయి, ఇవి సాంప్రదాయ వంటకాలకు ఆరోగ్యకరమైన అదనంగా ఉంటాయి. తాండాయిలో మిళితం చేసినా, స్వీట్లపై చల్లుకున్నా లేదా కాల్చిన చిరుతిండిగా ఆస్వాదించినా, బాదం రుచి మరియు ఆకృతి రెండింటినీ మెరుగుపరుస్తుంది. సమతుల్య ఆహారంలో చేర్చబడినప్పుడు, అవి బరువు నిర్వహణకు తోడ్పడతాయి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి మరియు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి, వీటిని ప్రతి ఒక్కరికీ తెలివైన ఎంపికగా మారుస్తుంది.

బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ మాట్లాడుతూ, "హోలీ నాకు అత్యంత ఇష్టమైన పండుగలలో ఒకటి, ఆనందం, కలిసిమెలిసి ఉండే సమయం మరియు రుచికరమైన విందులు! నేను నా కుటుంబం మరియు స్నేహితులతో జరుపుకోవడాన్ని ఇష్టపడతాను. సంప్రదాయంలో భాగంగా, నేను ఎల్లప్పుడూ ప్రత్యేకమైన పండుగ డెజర్టను తయారు చేస్తాను-ఆరోగ్యకరమైన ట్విస్ట్ తో. నాకు ఇష్టమైన వాటిలో ఒకటి కాల్చిన బాదం మరియు రుచికరమైన బర్ఫీ పోషకాహారం బాదం రోజువారీ అవసరం నాకు-వారి బహుముఖ ప్రజ్ఞకు మాత్రమే కాకుండా, వారి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలకు కూడా వారు నన్ను ఎక్కువసేపు శక్తివంతంగా మరియు నిండుగా ఉంచుతారు, ఉత్సవాలను ఆస్వాదిస్తూనే అనారోగ్యకరమైన భోగాలను నివారించడం సులభతరం చేస్తుంది." అని అన్నారు.

## సోనీ ఇండియా స్మార్ట్ విజన్ గ్లాసెస్




హైదరాబాద్, దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సాధికారత కల్పించే లక్ష్యంతో సోనీ ఇండియా తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో ఒక ముఖ్యమైన మైలురాయిని ప్రకటించింది. హైదరాబాద్ లోని సోనీ ఇండియా కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది, సోనీ ఇండియా సిహెచ్ఆర్ఓ & సీఎస్ ఆర్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ సంజయ్ భట్నాగర్ , దృష్టి లోపం ఉన్న శ్రీ బయ్య మహేష్ కు స్మార్ట్ విజన్ గ్లాసెస్ ను విరాళంగా ఇచ్చారు. తన మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం పోటీ ప్రభుత్వ పరీక్షలకు శ్రీ బయ్య మహేష్ సిద్ధమవుతున్నారు. సున్నితమైన వినియోగదారు అనుభవాన్ని నిర్ధారించడానికి, బ్లైండ్ విజన్ ఫౌండేషన్ నుండి విజయ్ చందర్ స్మార్ట్ విజన్ గ్లాసెస్ యొక్క వివిధ అంశాలపై మహేష్ కు మార్గనిర్దేశం చేస్తూ సమగ్ర శిక్షణా సెషన్ అందించారు. శ్రీ బయ్య మహేష్ తన కృతజ్ఞతను వెల్లడిస్తూ, "ఈ గ్లాసెస్ నా చదువులకు మరియు రోజువారీ కార్యకలాపాలకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. నేను ఇప్పుడు పుస్తకాలు చదవగలను, పరీక్షలకు సిద్ధం కాగలను మరియు సహాయం లేకుండా సురక్షితంగా తిరగగలను. జీవితాన్ని మార్చే ఈ మద్దతును అందించిన సోనీ ఇండియా మరియు బ్లైండ్ విజన్ ఫౌండేషన్కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని అన్నారు. ఈ కార్యక్రమం గురించి సోనీ ఇండియాకు చెందిన సంజయ్ భట్నాగర్ మాట్లాడుతూ, "సోనీ ఇండియా వద్ద , జీవితాలను మార్చే సాంకేతికత శక్తిని మేము విశ్వసిస్తాము. దేశవ్యాప్తంగా స్మార్ట్ విజన్ గ్లాసెస్ యొక్క పంపిణీ ద్వారా, లభ్యత అంతరాలను తగ్గించడం , దృష్టి లోపం ఉన్న వ్యక్తులు ఎక్కువ స్వాతంత్ర్యం మరియు మెరుగైన జీవన నాణ్యతను సాధించడానికి వీలు కల్పించడం మా లక్ష్యం. ఈ కార్యక్రమం చేరిక , సానుకూల ప్రభావాన్ని సృష్టించడం పట్ల మా అచంచలమైన నిబద్ధతను వెల్లడిస్తుంది" అని అన్నారు.

## నష్టాల నుంచి కోలుకున్న మార్కెట్లు

### సెన్సెక్స్ 12 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 37 పాయింట్ల లాభం




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్గా ముగిశాయి. అమెరికాలో నెలకొన్న మాంద్యం భయాలతో నిన్న ఆ దేశ స్టాక్ మార్కెట్లు కుదేలవ్వగా.. నేడు ఆసియా స్టాక్ మార్కెట్లపైనా ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ మార్కెట్లపైనా ఆరంభంలో ఆ ప్రభావం కనిపించినప్పటికీ.. తర్వాత సూచీలు క్రమంగా కోలుకున్నాయి. చివరికి ఫ్లాట్గా ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లలో విక్రయాలు సూచీలను పడేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్టెల్, రిలయన్స్ షేర్లు నిలబెట్టాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 73,743.88 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,115.17) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా దాదాపు నష్టాల్లోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత స్వల్ప లాభాల్లోకి వచ్చిన సూచీ 74,195.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 12.85 పాయింట్ల నష్టంతో 74,102.32 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 37.60 పాయింట్ల నష్టంతో 22,497.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు కోలుకుని 87.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్ సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో షేర్లు నష్టాల్లో ముగిశాయి. సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్టెల్, హెచ్సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2916 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు కుదేలు**

ప్రముఖ ప్రైవేటురంగ బ్యాంక్ ఇండస్ ఇండ్ షేర్లు నేడు భారీగా కుంగాయి. మంగళవారం ట్రేడింగ్ సెషన్లో ఏకంగా 27 శాతం మేర క్షీణించాయి. బ్యాంక్కు చెందిన డెరివేటివ్ పోర్ట్ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు అంతర్గత సమీక్షలో తేలడం ఇందుక్కారణం. దీంతో బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు బ్యాంక్ అంచనా వేసింది. అంటే ఏకంగా రూ.1,500 కోట్ల నష్టానికి సమానం. ఈ ప్రకటన షేర్లపై ప్రతికూల ప్రభావం చూపింది. ప్రస్తుత సీఈఓ సుమంత్ కత్పలియా పదవీకాలాన్ని మూడేళ్లు కాకుండా ఒక సంవత్సరం పాటే పొడిగించేందుకు ఆర్ బీఐ అనుమతించడంతో సోమవారం బీఎస్ ఈలో 3.86 శాతం నష్టంతో రూ.900.70 వద్ద ముగిశాయి. బ్యాంక్ నుంచి తాజా ప్రకటన వెలువడడంతో మంగళవారం మరో 27 శాతం క్షీణించి రూ.655.95కి చేరింది.

## ఇండియన్ టేబుల్ గ్రేప్స్ మహీంద్రా ఎగుమతులకు 20 ఏళ్లు



నాసిక్: మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్లో భాగమైన మహీంద్రా అగ్రి సొల్యూషన్స్ లిమిటెడ్ (ఎంఏఎస్ఎల్), భారత్ నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు టేబుల్ గ్రేప్స్ ఎగుమతులు ప్రారంభించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు వెల్లడించింది. 2005లో మహీంద్రా తమ తొలి ద్రాక్షల షిప్మెంట్ను యూరప్కి ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఉత్తర అమెరికా, యూరప్, చైనా, ఆగ్నేయాసియా, ఇతర మార్కెట్లలోని కస్టమర్లకు అత్యంత నాణ్యమైన ద్రాక్షలను అత్యుత్తమ భద్రతా ప్రమాణాలతో ఎగుమతి చేస్తోంది. సబోరో మరియు ఫ్రూకింజ్ బ్రాండ్ల కింద థామ్సన్, సొనాకా పేరిట వైట్ సీడ్లెస్ ద్రాక్షలు, ఫ్లేమ్, క్రిమ్సన్ పేరిట రెడ్ సీడ్లెస్ ద్రాక్షలు, జంబో, శరద్ పేరిట బ్లాక్ సీడ్లెస్ ద్రాక్షలను ఎంఏఎస్ఎల్ సంస్థ ఎగుమతి చేస్తోంది.

ఉద్యోగాల కల్పన, సామాజిక సంక్షేమ కార్యక్రమాల ద్వారా స్థానిక కమ్యూనిటీలకు తోడ్పాటు అందిస్తోంది. ఎగుమతి చేయగలిగే విధంగా దిగుబడులను 3రెట్లు మెరుగుపర్చుకోవడంలో (ఎకరానికి 2.5 ఎంటీ నుంచి ఎకరానికి 7.5 ఎంటీ వరకు) రైతాంగానికి తోడ్పాటు అందించింది. సంస్థకు నాసిక్లో అధునాతన గ్రేప్ ప్యాక్ హౌస్ ఉండగా, నాసిక్, బారామతి, సాంగ్లిలో 500 మంది పైచిలుకు రైతులతో కలిసి పని చేస్తోంది. "గత 20 ఏళ్లలో ద్రాక్ష వ్యాపారంలో సాధించిన వృద్ధి ఎంఏఎస్ఎల్కు గర్వకారణం. వ్యవసాయ వేల్యూ చెయిన్వ్యాప్తంగా సాగులో పరివర్తన తేవడంపై మాకున్న నిబద్ధతను ఈ మైలురాయి ప్రతిఫలిస్తుంది. మా కృషి ఫలితంగా ఇతర దేశాలకు భారతీయ టేబుల్ గ్రేప్స్ ఎగుమతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. అలాగే ప్రాంతీయంగా వందల కొద్దీ రైతుల జీవితాలపై సానుకూలంగా ప్రభావం చూపగలగడం మాకు సంతోషకరమైన విషయం" అని ఎంఏఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈవో రమేష్ రామచంద్రన్ తెలిపారు.

6.5 ఎకరాల్లో, 75,000 చ.అ. విస్తీర్ణంలో విస్తరించిన మహీంద్రా గ్రేప్ ప్యాక్ హౌస్లో నిత్యం 80 మెట్రిక్ టన్నుల ద్రాక్షలు ప్యాక్ చేయబడతాయి. ఇందులో 12 ప్రీకూలింగ్ చాంబర్లు, 170 ఎంటీ సామర్థ్యంతో రెండు కోల్డ్ స్టోరేజీ ఫెసిలిటీలు ఉన్నాయి. ఒక్కో షిఫ్టులో 500 మంది పైచిలుకు ఉద్యోగులు ఉంటారు. సుస్థిర సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు నాసిక్లో ఎంఏఎస్ఎల్కు 15 ఎకరాల్లో డెమో ఫార్మ్ ఉంది. అన్నారు.

## దక్షిణాన వండర్ చెఫ్ స్టోర్స్ రెట్టింపు




హైదరాబాద్, 5: చెఫ్ సంజీవ్ కపూర్, రవి సక్సేనా కలిసి స్థాపించిన ప్రీమియం కిచెన్ ఉపకరణాల బ్రాండ్ వండర్చెఫ్ దక్షిణ భారతంలో స్టోర్స్ సంఖ్య రెట్టింపు చేయనుంది. హైదరాబాద్ ఎక్స్ క్లూజివ్ బ్రాండ్ అవుట్ లెట్లో సంస్థ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించింది. దక్షిణ భారత దేశంపై తన వ్యూహాత్మక దృష్టిని పునరుద్ఘాటించింది. ఈ ప్రాంతంలో బ్రాండ్ యొక్క పెరుగుతున్న ఉనికిని వేడుక చేసుకోడానికి ఈ కార్యక్రమం వండర్చెఫ్ అగ్రశ్రేణి వాణిజ్య భాగస్వాములు, కస్టమర్లు, స్థానిక హోమ్ చెఫ్లు, ఫుడ్ బ్లాగర్లను ఒకచోట చేర్చింది. ప్రాంతీయ వంట అభిరుచులకు అనుగుణంగా, వండర్చెఫ్ తన తాజా తేలికపాటి తదుపరి తరం కాస్ట్ ఐరన్ వంట సామగ్రి 'ఫెరో'ని ప్రవేశపెట్టింది.

దీనిని అధునాతన గ్రావిటీ మోల్డింగ్ టెక్నాలజీని ఉపయోగించి తయారు చేశారు. ఈ ఆవిష్కరణ మెరుగైన వేడి నిలుపుదలతో మన్నికను మిళితం చేస్తుంది. ఇది సంప్రదాయ దక్షిణ భారత వంటలకు అనువైనది.

దక్షిణ భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రూపొందించబడిన వండర్చెఫ్ తాజా ఉత్పత్తి ఆవిష్కరణలను ఈ కార్యక్రమం చాటిచెప్పింది. వాటలో చెఫ్ మ్యాజిక్ ఆల్-ఇన్-వన్ కిచెన్ రోబోట్ కూడా ఉంది. ఒకే పరికరంలో కత్తిరించడం, ఆవిరి చేయడం, సాటింగ్ చేయడం, కలపడం, బ్లెండింగ్ చేయడం, వేయించడం వంటి అన్నింటిని కలిపి తయారుచేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఈ ఉత్పత్తి హైదరాబాద్లో బాగా ఆదరణ పొందింది. ఇక్కడ హోమ్ చెఫ్లు సమర్థవంతమైన, ఆరోగ్యకరమైన వంట కోసం స్మార్ట్ పరిష్కారాలను స్వీకరిస్తున్నారు. చెఫ్ మ్యాజిక్ అంతర్నిర్మిత 7-అంగుళాల స్క్రీన్ చెఫ్ సంజీవ్ కపూర్ స్వయం గా క్యూరేట్ చేసిన 370 కి పైగా వంటకాలతో గైడెడ్ వంటను అందిస్తుంది.

ఈ కార్యక్రమంలో చెఫ్ సంజీవ్ కపూర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బ్రాండ్ తన స్థానాన్ని బలోపేతం చేయడానికి నిబద్ధతను నొక్కి చెప్పారు. "దక్షిణాది మార్కెట్ మా వినూత్న వంటగది పరిష్కారాలకు వేగంగా పెరుగుతున్న డిమాండ్ను చూపించింది. ముఖ్యంగా హైదరాబాద్ మాకు కీలకమైన నగరంగా అవతరించింది.

ఈ అఖండ స్పందన మమ్మల్ని మరింత విస్తరించడానికి ప్రేరేపిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి భారతదేశం అంతటా మా ప్రత్యేకమైన బ్రాండ్ అవుట్లెట్లను రెట్టింపు చేయాలని, దక్షిణ భారతదేశం అంతటా మా ఉనికిని బలోపేతం చేయడంపై బలమైన ప్రాధాన్యత ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాం" అని ఆయన అన్నారు.

## అల్ట్రా డైనమిక్ లెన్సెస్ను లాంచ్ చేసిన ట్రాన్సిస్టన్



భారతదేశంలో ప్రీమియమ్ ఐ వేర్ బ్రాండ్ అనగానే ప్రతీ ఒక్కరికీ గుర్తుకు వచ్చేది ఎస్సిలార్. అలాంటి ఎస్సిరాల్ లగ్జోటికా ఇరియా ఇప్పుడు అధికారికంగా ట్రాన్సిస్టన్ జెన్ఎస్ని ప్రారంభించింది. ఇది ఆప్టికల్ టెక్నాలజీలో ఒక విప్లవాత్మక పురోగతిగా అభివర్ణించవచ్చు. ఇది విలక్షణ స్టైల్ తో పాటు ప్రీమియం బ్రాండ్ లుక్ కోరుకునే వారికి, అదే సమయంలో మన దృష్టిని మరింత మెరుగుపరిచే దిశగా ఒక పెద్ద ముందడుగును భావించవచ్చు. వినియోగదారుల మారుతున్న అభిరుచులకు అనుగుణంగా, వారికి కావాల్సినట్లుగా వేగం, స్టైల్ మరియు స్మార్ట్ విజన్పై దృష్టి సారించి ఈ ట్రాన్సిస్టన్ జెన్ ఎస్ ఆప్టికల్స్ ను రూపొందించారు. ఇది మారుతున్న వాతావరణాలకు సులభంగా అనుగుణంగా ఉండే డైనమిక్ దృశ్య అనుభవాన్ని అందిస్తుంది. క్లియర్-టు-డార్క్ ఫోటోక్రోమిక్ విభాగంలో అత్యంత వేగవంతమైన డార్కినింగ్ లెన్స్, ట్రాన్సి షన్స్ GEN S™ నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సంప్రదాయ ప్రిస్క్రిప్షన్ లెన్సును మించి , విస్తృతమైన పరిశోధన చేసి, అదే సమ యంలో ధరించేవారి సహకారం ద్వారా జాగ్రత్తగా అభివృద్ధి చేయబడింది. ఆధునిక ధరించేవారిని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన ఈ వినూత్న లెన్స్ అసమానమైన సౌకర్యం, సౌలభ్యం మరియు అనుకూలతను అందిస్తుంది. ఈ సందర్భంగా దక్షిణాసియాలోని ఎస్సిలర్ లక్సోటికా అధ్యక్షుడు నరసింహన్ నారాయణన్ మాట్లాడుతూ... "వినియోగదారులు సాధ్యమైనంత వరకు అత్యుత్తమ నాణ్యత కలిగిన ఆప్టికల్స్ను వాడేందుకు ఇష్టపడుతుంటారు. అలాంటి వారి కోసమే వారు ఎల్లప్పుడు శోధన చేస్తుంటారు. అందుచేత అలాంటి వారికి దృష్టిని కాపాడుతూ చూస్తున్న ప్రతీది అద్భుతంగా కన్పించేలా చేయడమే అసలు పని. ఇందులో కాంతి కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పుడు కొత్తగా లాంచ్ చేసిన ట్రాన్సిస్టన్ జెన్ఎస్తో, మేము అత్యాధునిక సైన్స్ మరియు టెక్నాలజీని కలిపి కాంతికి అకారణంగా అనుగుణంగా, ధరించేవారి అవసరాలను తీర్చడానికి త్వరగా స్పందించే విప్లవాత్మక ఉత్పత్తిని సృష్టించాము. అంతేకాకుండా, ఈ లెన్సు విస్తృత రంగుల పాలెట్తో ఉన్నతమైన అనుభవాన్ని అందిస్తాయి, ధరించేవారు ఏదైనా ఫ్రేమ్కు సరిపోయేలా వారి కళ్లజోడును వ్యక్తిగతీకరించడానికి వీలు కల్పిస్తాయి. "సీ మోర్, బీ మోర్ " అనే మా కార్య నిర్వహణకు అనుగుణంగా దృష్టి సంరక్షణను మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని సూచిస్తుంది. ట్రాన్సిషన్స్ GEN S కంటి సంరక్షణ నిపుణులకు కీలక సిఫార్సుగా మారుతుందని మేము విశ్వసిస్తున్నాము." అని అన్నారు ఆయన.

## హైదరాబాద్లో థండర్ ప్లస్ మహిళా ఈవీ ఫాస్ట్ చార్జింగ్ ఫ్రాంచైజీ



హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఈవీ రంగంలో సమానత్వాన్ని ప్రోత్సహించే కీలకమైన అడుగుగా, థండర్ప్లస్ హైదరాబాద్ లో భారతదేశపు తొలి మహిళా ఈవీ ఫాస్ట్ చార్జర్ ఫ్రాంచైజీని ప్రారంభించింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం మహిళా ఔత్సాహిక వ్యాపారులకు ఓ అవకాశం కల్పిస్తూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యుత్ వాహన ఛార్జింగ్ రంగంలో నూతన వ్యాపార అవకాశాలను అంది స్తోంది. ఈ ప్రత్యేకమైన ఫ్రాంచైజీ మోడల్ మహిళా పారిశ్రామికవేత్తల కోసం రూపొందించబడింది, ఇందులో టెక్నాలజీ సౌకర్యం, స్థాపన, బ్రాండింగ్, ప్రచారం, వ్యాపారాభివృద్ధి మద్దతు వంటి అన్ని ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. రూ. 6 లక్షల పెట్టుబడితో, ఫ్రాంచైజీలకు మూడు సంవత్సరాల్లో రూ. 12 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఈ ప్యాకేజీలో 30 కిలో వాట్ డీసీ 4-వీలర్ చార్జర్, షెడ్డు స్థాపన మరి యు ఆపరేషన్ కలిగి ఉంటుంది. తొలి మూడు సంవత్సరాల పాటు ఉచిత నిర్వహణ అందించడంతో పాటు, కనీస వ్యాపార భరోసా కూడా అందుబాటులో ఉంది. ఇక, మూడు సంవత్సరాల తరువాత 50% పెట్టుబడిని తిరిగి కొనుగోలు చేసే గ్యారంటీని కూడా అందిస్తోంది. ఫ్రాంచైజీలు అవసరమైన స్థలం మరియు విద్యుత్ కనెక్షన్ అందించాల్సి ఉంటుంది. ఈ ఛార్జింగ్ స్టేషన్ను తెలంగాణలో మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఇన్డోకాన్ సిఈఓ శ్రీమతి అమృతా పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇతర పారిశ్రామిక ప్రముఖులు, మహిళా నాయకుల సమక్షంలో, ఫ్రాంచైజీ యజమానిగా ఎంపికైన శ్రీమతి తరిణీ పాండేని అభినందిస్తూ, ఈ కార్యక్రమం గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ "మహిళలను కోట్లాధిపతులుగా మార్చే" లక్ష్యానికి అనుగుణంగా ఉందని అన్నారు.

## ఎస్బిఐ మహిళా సిఎస్పిలను ఆవిష్కరించిన ఆర్థిక మంత్రి



ముంబై : దేశంలోని అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జులై 1, 1955న స్థాపించబడిన 70 సంవత్సరాల జ్ఞాపకార్థం ప్లాటినం జూబ్లీ వేడుకలను ప్రారంభించింది. వేడుకల్లో భాగంగా, గౌరవనీయ ఆర్థిక మంత్రి శ్రీమతి. నిర్మలా సీతారామన్, 70 శాఖలను మరియు 501 మహిళా కస్టమర్ సర్వీస్ పాయింట్లను ప్రారంభించి, వెనుకబడిన జనాభాకు సమర్థవంతంగా సేవలందించేందుకు బ్యాంక్ నిబద్ధతను బలోపేతం చేశారు. డిఎఫ్ ఎస్ కార్యదర్శి శ్రీ ఎం. నాగరాజు, ఎస్బిఐ చైర్మన్ సిఎస్ సెట్టి సమక్షంలో ప్రారంభోత్సవం జరిగింది. ఆమె పర్యటన సందర్భంగా, ఆర్థిక మంత్రి బ్యాంక్ ప్రత్యేక బోర్డు సమావేశంలో కూడా ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి శ్రీమతి. నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, "అనేక దేశాల జనాభా కంటే 51 కోట్ల మంది వినియోగదారులకు ఎస్బిఐ విశ్వసనీయ భాగస్వామిగా కొనసాగుతోంది-అన్ని ఆదాయ వర్గాల్లో ఆర్థిక పురోగతికి లోతైన నిబద్ధతను ప్రదర్శిస్తోంది. నియంత్రణ సవాళ్లు మరియు మార్కెట్ అంతరాయాలు ఉన్నప్పటికీ బ్యాంక్ యొక్క అభివృద్ధి మరియు ఆవిష్కరణల సామర్థ్యం దాని నాయకత్వాన్ని కొనసాగించడంలో కీలకంగా ఉంది. డిజిటల్ పరివర్తనను స్వీకరించడం ద్వారా, ఎస్బిఐ కస్టమర్ అనుభవాలను పునర్నిర్వచించింది, అతుకులు లేని ఆర్థిక ఉత్పత్తులను పరిచయం చేసింది మరియు కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరిచింది, బ్యాంకింగ్ను మునుపెన్నడూ లేనంతగా అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచంలోని అతిపెద్ద వాణిజ్య బ్యాంకులలో ఒకటిగా, ప్రపంచ జనాభాలో దాదాపు 5.6% మందికి సేవలందిస్తున్నందున, SBI యొక్క చురుకుదనం మరియు పోటీతత్వం సాటిలేనివని ఆమె పేర్కొన్నారు.

## స్వదేశ్ క్రాఫ్ట్ & సృజనాత్మక సంప్రదాయాల మహిళా ఛాంపియన్



హైదరాబాద్ : భారతదేశంలోని ప్రముఖ హస్తకళా లగ్జరీ డెస్టినేషన్ అయిన స్వదేశ్, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా చాంపియన్స్ ఆఫ్ క్రాఫ్ట్ & క్రియేటివ్ ట్రెడిషన్స్ను 20,000 చ.అ. అడుగులు హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్లోని స్టోర్- చక్కటి హస్తకళ మరియు సాంస్కృతిక వారసత్వాన్ని మెచ్చుకునే వారు తప్పక సందర్శించవలసిన ప్రదేశం. శ్రీమతి దూరదృష్టితో కూడిన నాయకత్వంలో. నీతా అంబానీ, స్వదేశ్ భారతదేశ శిల్పకళా వారసత్వాన్ని సంరక్షించడం మరియు ప్రోత్సహించడం, మాస్టర్ హస్తకళాకారులకు వారి కళాత్మకతను ప్రదర్శించడానికి మరియు వారి స్ఫూర్తిదాయకమైన ప్రయాణాలను పంచుకోవడానికి వేదికను అందించడం అనే దాని మిషన్ను కొనసాగిస్తోంది. ఈ ప్రత్యేక సమావేశం ఆరుగురు అవార్డు గెలుచుకున్న క్రాఫ్ట్ మాస్టర్లను ఒకచోట చేర్చింది, ప్రతి ఒక్కరు భారతదేశం యొక్క చేతితో తయారు చేసిన వారసత్వానికి సంరక్షకులు, భారతదేశ సాంస్కృతిక గుర్తింపును నిర్వచించే అరుదైన మరియు క్లిష్టమైన సాంకేతికతలను ముందుకు తీసుకువెళ్లారు.

## టాటా ప్లే కె-డ్రామాలో ఐ యామ్ నాట్ ఎ రోబో




అన్యోంఘసేయో! మీ ఇంటి నుంచే సౌకర్యంగా థ్రిల్లింగ్ యాక్షన్, రొమాంటిక్ కామెడీలు మరియు కె-పాప్తో కొరియన్ వినోద ప్రపంచంలోకి అడుగు పెట్టండి. వివిధ రకాల జానర్లలో టైటిళ్ల శ్రేణిని కలిగిన టాటా ప్లే కె-డ్రామాస్ (గతంలో టాటా ప్లే విదేశీ కహానియా అని వ్యవహరించేవారు) మీరు అడగగలిగే అన్ని కొరియన్ వినోదాలను మీకు అందిస్తుంది! కొత్త చిత్రాలతో తాజా కేటలాగ్ అత్యంత ప్రజాదరణ పొందిన కొరియన్ కంటెంట్ను ఒకే చోట అందిస్తుంది. సమ్మర్ స్ట్రైక్, ఐ యామ్ నాట్ ఎ రోబోట్, డబ్ల్యూ-టూ వరల్డ్స్ అపార్ట్ వంటి రొమాన్స్ షోలు, అన్లాక్ మై బాస్ వంటి ఆకర్షణీయమైన యాక్షన్లు మరియు ఫ్లవర్ ఆఫ్ ఈవిల్, 365 - రిపీట్ ది ఇయర్ వంటి క్రైమ్ థ్రిల్లర్లు మరియు అద్భుతమైన కె-పాప్ షోలతో, ప్రతి ఒక్కరూ ఆస్వాదం చేందుకు ఏదో ఒక చిత్రం అందుబాటులో ఉంటుంది. సియోల్ నుంచి టాటా ప్లే కె-డ్రామాస్లో పూర్తిగా ప్రకటనలు లేకుండా కొరియన్ వినోదం గొప్ప రిపోజిటరీని అన్వేషించేందుకు సిద్ధంగా ఉండండి. ఇక్కడ ఉత్తమ అంశం ఏమిటంటే- విదేశీ కహానియాన్ ఇప్పుడు టాటా ప్లే కె-డ్రామాస్లోకి మారుతున్నందున, ఇప్పటికే ఉన్న వీక్షకులు అదనపు ఖర్చు లేకుండా అదే ఛానెల్ #151లో హిందీ, తెలుగు, తమిళం మరియు కొరియన్ భాషలలోని ఉత్తమ కొరియన్ వినోదాన్ని ఆస్వాదించవచ్చు. కొత్త వీక్షకులు రోజుకు రూ.2 నామమాత్రపు రుసుముతో సభ్యత్వాన్ని పొందవచ్చు. అన్ని షోలు ప్రయాణంలో వీక్షించేందుకు టాటా ప్లే మొబైల్ యాప్లోనూ అందుబాటులో ఉన్నాయి.

## అమెజాన్లో రంగుల పండుగ హోలీ




బెంగళూరు : మీ హోలీ షాపింగ్ స్ప్రీని అమేజాన్ ఇండియా వారి హోలీ స్టోర్ తో ప్రారంభించండి, సమగ్రమైన ఉత్ప త్తుల ఎంపికతో ఇప్పుడు లైవ్ లో ఉంది. కస్టమర్లు విస్తృత శ్రేణి సంప్రదాయ బద్ధమైన దుస్తులు మరియు ఆర్గానిక్ గులాల్, పండగ మిఠాయిలైన గుజియా, ఆధునిక ఎలక్ట్రానిక్స్ మరియు ఆధునిక ఉపకరణాలు, ప్రీమియం స్కిన్ కేర్ అవసరాలు, సొగసైన హోమ్ డెకార్ వంటి వాటి నుండి అన్వేషించవచ్చు. వివిధ శ్రేణులలో ఉత్తేజభరితమైన డీల్స్ లభిస్తూ, పండగ సన్నాహాల కోసం సాటిలేని విలువను నిర్ధారిస్తున్నాయి. మీ హోలీ షాపింగ్ అనుభవాన్ని పెంచుతూ, రూఫస్- అమేజాన్ AI-సౌకర్యం షాపింగ్ అసిస్టెంట్ తక్షణ జవాబులు మరియు వ్యక్తిగత సిఫారసులతో సరైన పండగ అవసరాలను కనుగొనడంలో మీకు సహాయపడుతుంది. ఉత్తమమైన గులాల్, వాటర్ గన్స్, లేదా పార్టీ అలంకరణల గురించి రూఫస్ను అడగండి మరియు మీ ప్రాధాన్యతను బట్టి అనుకూలమైన సూచనలు పొందండి. పండగ షాపింగ్ మరింత సహజంగా మరియు ఆనందదాయకంగా చేయడానికి రుఫస్ అమేజాన్ వారి నిబద్ధతలో ఒక భాగం. స్టోర్ మార్చి 14, 2025 వరకు ఇప్పుడు లైవ్లో ఉంటుంది.

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

వెటర్నరీ విభాగం, సికింద్రాబాద్ జోన్, GHMC. **టెండర్ నోటీసు**

**నిట్ నెం.01 & 02 /VET/SBZ/GHMC/ 25,** **తేది: 11-03-2025**

క్రమ సంఖ్య 1 నుండి 2. GHMC లోని సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) www.eprocurement.telangana.gov.in ద్వారా ఆన్లైన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు. 2025-2026 సంవత్సరంలో (12) నెలల పాటు అంటే ఏప్రిల్-2025 నుండి మార్చి-2026 వరకు సికింద్రాబాద్ జోన్, GHMCలో చనిపోయిన జంతువులను ఎత్తివేయడం మరియు సరైన పారవేయడం కోసం టెండర్. 2025-2026 సంవత్సరంలో (12) నెలల పాటు అంటే ఏప్రిల్-2025 నుండి మార్చి-2026 వరకు సికింద్రాబాద్ జోన్, GHMC పరిమితుల నుండి కోతులను పట్టుకుని సికింద్రాబాద్ జోన్, GHMCలోని లోతైన అడవులలో వదలడానికి టెండర్. **అంచనా వ్యయం : రూ. 30,37,531/-, రూ. 3,26,600/-.** **తేది మరియు సమయం :** 12-03-2025 నుండి 18-03-2025 సా॥ 5.00 గం॥ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** డా॥ కె. చక్రపాణి రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ సెక్షన్, సికింద్రాబాద్ జోన్, GHMC, మొబైల్: 9989930358.

సం/- డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ సెక్షన్, సికింద్రాబాద్ జోన్, GHMC

DIPR.RO.No.11283-PP/CL/Advt/1/2024-25 , Dt: 11-03-2025

## రూ. 10,000 కోట్లు ఇచ్చినా ఆ పని చేయను : స్టాలిన్

- ఎన్ఈపీ అమలుపై స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు
- కేంద్రం, తమిళనాడు మధ్య "హిందీ" వివాదం

తమిళనాడు: జాతీయ విద్యా విధానంపై గత కొన్ని రోజులుగా కేంద్రం, తమిళనాడు ప్రభుత్వానికి మధ్య గొడవ జరుగుతోంది. తమ రాష్ట్రంపై బలవంతంగా "హిందీ"ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. తాను ఈ ఎన్ఈపీకి వ్యతిరేకంగా తన వైఖరిపై రాజీ పడలేనని చెప్పారు. రూ.10,000 కోట్లు ఇచ్చినా కూడా తమిళనాడులో దీనిని అమలు చేయమని చెప్పారు.

చెంగల్పట్టులో జరిగిన ఒక కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ, విద్య, మహిళల అభ్యున్నతికి సంబంధించి తమిళనాడు మార్గదర్శకంగా ఉందని, తక్కువ అడ్డంకులు ఉంటే రాష్ట్రం మరింత మెరుగ్గా రాణించగలదని అన్నారు. "నిన్న పార్లమెంట్‌లో ఏం జరిగిందో మీరంతా చూసే ఉంటారు. తమిళనాడుకు అందించాల్సిన నిధులు రాష్ట్రంలో త్రిభాషా సూత్రాన్ని వర్తింపచేసి, హిందీ మరియు సంస్కృతాన్ని అంగీకరించడం ద్వారా మాత్రమే విడుదల చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అహంకారంలో అన్నారు" అని స్టాలిన్ ఆరోపించారు. కేంద్రం తమిళనాడు విద్యా విధానాన్ని నాశనం చేయాలని అనుకుంటున్నారని, మేము దానిని వ్యతిరేకిస్తున్నామని స్టాలిన్ చెప్పారు. విద్యార్థులను విద్యకు అందించే బదులు, విద్యకు దూరం చేయడానికి జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చారని దుయ్యబట్టారు. విద్యను ప్రవేటీకరించడం, ఉన్నత విద్యను ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉంచడం, విద్యలో మతాన్ని ప్రవేశ పెట్టడం, నీట్ పరీక్షలు తీసుకురావడం, విద్యలో కేంద్రానికి మరింత అధికారాన్ని ఇవ్వడానికి దీనిని తీసుకువచ్చారని ఆరోపించారు. కేంద్ర విద్యా మంత్రి తమిళనాడును బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ మండిపడ్డారు. "నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా, కేవలం రూ. 2,000 కోట్లు కాదు, మీరు రూ. 10,000 కోట్లు ఇచ్చినా మేము మీ వినాశకరమైన నాగ్‌పూర్ పథకాన్ని అంగీకరించము. ఈ వేదికపై నేను దానిని మళ్లీ పునరావృతం చేస్తున్నాను" అని స్టాలిన్ ప్రకటించారు. ఎన్ఈపీని ఆర్ఎస్ఎస్ ఎజెండాగా ఆరోపించారు. కేంద్రం విద్యా శాఖ మంత్రి తమిళుల పట్ల ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు.



# మా బంధాలు మరింత ధృడం

- మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ప్రధాని మోడీ
- వేడుకలలో పాల్గొనటం నాకు, నా దేశానికి దక్కిన గౌరవం
- మారిషస్‌ప్రెసిడెంట్ గోఖూల్‌తో పధానిమోడీ ప్రత్యేక సమావేశం
- మహాకుంభ నీరు, బీహార్‌లోని మఖానాలు బహుమతులుగా అందజేత
- సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలపై ఇరునేతల మధ్య చర్చ
- ఇరుదేశాలు దృఢమైన అనుబంధాలను గుర్తు చేసుకున్న నేతలు
- సర్ అనిరూద్ జుగ్నాథ్ సమాధి వద్ద నివాళులర్పించిన ప్రధాని
- రామగూళం చారిత్రాత్మక ఉద్యానవనంలో "ఏక్ పెడ్ మా కే నామ్ నాటిన మోడీ



మారిషస్ : రిపబ్లిక్ ఆఫ్ మారిషస్లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మారిషస్ ప్రెసిడెంట్ గోఖూల్తో సమావేశమై , మహాకుంభ నీరు, బీహార్లోని మఖానా మరియు మరిన్నింటిని బహుమతిగా ఇచ్చారు. ఆగ్నేయాసియా దేశంలోని స్టేట్ హౌస్లో రిపబ్లిక్ ఆఫ్ మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోఖూల్తో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో, ప్రధాని మోదీ పవిత్ర సంగమ జలాన్ని, బీహార్కు చెందిన మహా?నా, వారణాసికి చెందిన బనారసి పట్టు చీర మరియు గణేశుడి విగ్రహాన్ని రాష్ట్రపతి మరియు మారిషస్ ప్రథమ మహిళకు బహుమతిగా ఇచ్చారు. బనారసి చీర దాని చక్కటి పట్టు, క్లిష్టమైన బ్రోకేడ్లు మరియు సంపన్నమైన జరీ పనికి ప్రసిద్ధి చెందింది. చీరకు అనుబంధంగా గుజరాత్కు చెందిన సడేలి బాక్స్లో క్లిష్టమైన పొదిగిన పని ఉంది, విలువైన చీరలు, ఆభరణాలు లేదా కీప్సేక్లను నిల్వ చేయడానికి రూపొందించబడింది. భారతదేశం మరియు మారిషస్ మధ్య ప్రత్యేక మరియు సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంచుకోవడంపై ఇరువురు నేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య భాగస్వామ్య చరిత్రను, ప్రజల మధ్య దృఢమైన అనుబంధాలను వారు గుర్తు చేసుకున్నారు. భారతదేశం మరియు మారిషస్ మధ్య ప్రత్యేక మరియు సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంచుకోవడంపై ఇరువురు నేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య భాగస్వామ్య చరిత్రను, ప్రజల మధ్య దృఢమైన అనుబంధాలను వారు గుర్తు చేసుకున్నారు. మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలకు రెండోసారి ముఖ్య అతిథిగా హాజరుకావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు భారత ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన స్టేట్ హౌస్లోని ఆయుర్వేద గార్డెన్ను కూడా ప్రధాన మంత్రి సందర్శించారు. ఆయుర్వేదంతో సహా సాంప్రదాయ ఔషధం యొక్క ప్రయోజనాలను అభివృద్ధి చేయడంలో భారతదేశానికి మారిషస్ ఒక ముఖ్యమైన భాగస్వామి అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలకు రెండోసారి ముఖ్య అతిథిగా హాజరుకావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. ప్రత్యేక సంజ్ఞలో, ప్రధాన మంత్రి ప్రధాని గోఖూల్ మరియు ప్రథమ మహిళ బృందా గోఖూల్కి ఓసిఐ కార్డులను అందజేసారు. భారత ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన స్టేట్ హౌస్లోని ఆయుర్వేద గార్డెన్ను కూడా ప్రధాన మంత్రి సందర్శించారు. ఆయుర్వేదంతో సహా సాంప్రదాయ వైద్యం యొక్క ప్రయోజనాలను అభివృద్ధి చేయడంలో భారతదేశానికి మారిషస్ ఒక ముఖ్యమైన భాగస్వామి అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. చర్చల అనంతరం, ప్రెసిడెంట్ గోఖూల్ ప్రధాన మంత్రి గౌరవార్థం రాష్ట్ర మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు.

**సర్ అనిరూద్ జుగ్నాథ్ సమాధి వద్ద నివాళులు :** అంతకు ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సర్ సీవూసగూర్ రామ్గూలం బొటానిక్ గార్డెన్, పాంప్లెమౌసెస్లో సర్ సీవూసగూర్ రామగూలం మరియు సర్ అనిరూద్ జుగ్నాథ్ సమాధి వద్ద నివాళులర్పించారు. ప్రధాన మంత్రితో పాటు మారిషస్ ప్రధాన మంత్రి హెచ్.ఇ. నవీనచంద్ర రామగూళం ఉన్నారు. ఈ సందర్భంగా, మారిషస్ పురోగతిలో మరియు భారతదేశం–మారిషస్ సంబంధాలకు బలమైన పునాదిని నిర్మించడంలో ఇరువురు నాయకుల చిరకాల వారసత్వాన్ని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. తరువాత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు మారిషస్ ప్రధాన మంత్రి హెచ్.ఇ. నవీనచంద్ర రామగూళం చారిత్రాత్మక ఉద్యానవనంలో "ఏక్ పెడ్ మా కే నామ్" పేరుతో మొక్కను నాటారు.





## ఓటర్ జాబితాపై సందేహాలు

### రాజకీయ పార్టీలకు 'ఈసీ' పిలుపు!



దిల్లీ: దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వివిధ సమస్యలను పరిష్కరించి.. ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీనికి సహకరించాలంటూ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ 30 నాటికి సలహాలను అందించాలని కోరింది. అందుకు సంబంధించి రాజకీయ పార్టీలకు సూచనలిచ్చింది. ఎన్నికల ప్రక్రియను మరింతగా బలోపేతం చేసేందుకు ఆయా పార్టీల అధ్యక్షుడు, సీనియన్ నేతలతో చర్చలు జరిపేందుకు యోచిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పార్టీల సీనియర్ నేతలు అందించే కీలక సూచనలను స్వీకరించనున్నట్లు తెలిపింది. పార్టీలతో సీఈవో, డీఈవో, ఈఆర్వోలు సమావేశం కావాలని.. ఆ సమయంలో వారు అందించే సమస్యలు, కీలక సూచనలను స్వీకరించి దానిపై నివేదిక ఏర్పాటు చేసి కమిషన్‌కు సమర్పించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా, గుర్తింపు కార్డుల అంశంపై ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఈసీ స్పందించింది. ఆయా స్థాయిలో పరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తాజాగా కోరింది.

## కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్‌కు ఢిల్లీ కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతిం చింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను అదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు.

దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారంనాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండి కొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## జమ్మూ కశ్మీర్‌లో రెండు సంస్థలపై కేంద్రం నిషేధం




దిల్లీ: జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేస్తోన్న రెండు సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. చట్టవ్యతిరేక కార్యకలా పాల (నివారణ) చట్టం – 1967 ప్రకారం ఆవామీ యాక్షన్ కమిటీ, జమ్మూ కశ్మీర్ ఇత్తిహదుల్ ముస్లిమీన్ గ్రూపులను ఐదేళ్ల పాటు నిషేధిత సంస్థలుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ రెండు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ)కి ఉమర్ ఫరూక్ నేతృత్వం వహిస్తుండగా.. జమ్మూ కశ్మీర్ ఇత్తిహదుల్ ముస్లిమీన్ (జేకేఐఎం) సంస్థను మస్రూర్ అబ్బాస్ అన్సారీ నడిపిస్తున్నారు.

ఈ రెండు సంస్థలకు చెందిన సభ్యులు జమ్మూ కశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని రెచ్చగొట్టేలా.. ఉగ్రవాద కార్యకలా పాలకు మద్దతు ఇవ్వడం, భారత వ్యతిరేక ప్రాచారంలో పాల్గొన్నంటున్నట్లు కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రత కు హాని కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని ఈ రెండు సంస్థలపై ఐదేళ్ల పాటు నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు

- ఎలాంటి హామీ ఇవ్వలేమని తేల్చి చెప్పిన భారత ప్రభుత్వం
- ట్రంప్ వ్యాఖ్యలు సరికాదని స్పష్టీకరన



న్యూఢిల్లీ : అమెరికాపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా భారత ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. సుంకాల తగ్గింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేసింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్రులు, శత్రువులు అని తేడా లేకుండా పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. భారత్ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించిన ఆయన.. వచ్చేనెల రెండో తేదీ నుంచి తమ ప్రతీకార సుంకాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇటీవల మరోసారి ఇదే అంశాన్ని ప్రస్తావించిన ట్రంప్.. భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని, ఆ దేశంలో ఏ వస్తువు విక్రయించడానికి వీలులేనంత భారంగా ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తడం.. భారత్ చర్యలను తాము బహిరంగపరచడం వల్ల సుంకాలను తగ్గించడానికి ఆ దేశం అంగీకరించిందని తెలిపారు. దీనిపై తాజాగా భారత్ స్పందించింది.

'సుంకాల తగ్గింపు అంశంపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు పదేపదే లేవనెత్తుతున్న ఈ సమస్య పరిష్కారానికి సెప్టెంబర్ వరకు సమయం కోరాం" అని పార్లమెంటరీ ప్యానెల్‌కు భారత ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు జాతీయ మీడియా కథనం పేర్కొంది. భారత్ – అమెరికా పరస్పరం ప్రయోజనకరమైన ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకొనే దిశగా కృషి చేస్తున్నాయని, తక్షణం సుంకాల సర్దుబాటు చేసుకునే బదులు దీర్ఘకాలిక వాణిజ్య సహకారంపై దృష్టిసారించాయని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి వెల్లడించారు. ట్రంప్ పాలన, భారత్తో సుంకాలు తదితర అంశాలపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల స్పందించిన సంగతి తెలిసిందే.

"ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాలన్నింటికీ సమాన అధికారాలు ఉండాలనే విధానంలో ట్రంప్ పాలన సాగుతోంది. అది భారత ఆలోచనలకు సరిగ్గా సరిపోతుంది" అని పేర్కొన్నారు.

## నదుల వద్ద సబ్బుల విక్రయాలు బంద్

### కర్ణాటక సర్కారు నిర్ణయం



బెంగళూరు: నదులు, సరస్సుల వద్ద కాలుష్యాన్ని నివారించేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాటికి 500 మీటర్ల పరిధిలో సబ్బులు, షాంపుల విక్రయాలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ కండ్రే ఆదేశాలు జారీ చేశారు. అధికారు లను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ..'యూజ్ అండ్ త్రో సంస్కృతి' ప్రబలంగా ఉందన్నారు. "దేవాలయాల సమీపంలోని నదులను సందర్శిం చే భక్తులు స్నానాలు ఆచరిస్తారు.

షాంపూ ప్యాకెట్లు, వాడేసిన సబ్బులు వాటివద్ద వదిలేస్తారు. ఆధ్యాత్మిక ప్రాంతాల్లోని నది, సరస్సు, ఇతర నీటి వనరులకు 500 మీటర్ల దూరంలో సబ్బులు, షాంపూ, కాలుష్యానికి కారణమయ్యే ఇతర వస్తువుల విక్రయాలు చేపట్టకుండా చూడాలి. అదేవిధంగా భక్తులు తమ దుస్తులను నీటిలో వదిలేయకుండా చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.

## డీలిమిటేషన్‌తో సీట్ల సంఖ్య పెరుగుతుంది: రాజ్‌నాథ్ సింగ్



దిల్లీ: లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన అమలుపై దక్షిణాది రాష్ట్రం తమిళనాడు కొంతకాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని.. పార్లమెంట్‌లో సీట్ల సంఖ్య తగ్గుతుందని డీఎంకే ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు.

"డీలిమిటేషన్ ప్రక్రియ ప్రణాళికబద్ధంగా కొనసాగుతుందని భావిస్తున్నా. దీనిపై అభ్యంతరాలు ఉంటే తమిళనాడు సీఎం ఎమ్‌కే. స్టాలిన్‌కు వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఉంటుంది. ఆ అంశాలపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారు. నిర్ణయం న్యాయంగా ఉంటుంది. శాసనసభ, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుంది" అని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. "తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్ల సంఖ్య పెరుగుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూరుతుందనేది సరైన వాదన కాదు" అని పేర్కొన్నారు. కాగా.. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంత కాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీలిమిటేషన్ వ్యతిరేకించాలని కోరుతూ స్టాలిన్..ఏడుగురు ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. తాజాగా ఈ దీనిపై స్పందించిన రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనపై వ్యక్తం అవుతున్న ఆందోళనలు సరైనవి కావని పేర్కొన్నారు.

## రూ.318కే వంటగ్యాస్.. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం



చెన్నై: రాష్ట్రంలో రూ.318 లకు వంటగ్యాస్ ఇవ్వాలని, మే 1 నుంచి సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని, రాజధాని నగరం చెన్నైలో అందరికీ ఉచిత బస్ సదుపాయం కల్పించాలని పీఎంకే సోమవారం విడుదల చేసిన షాడో బడ్జెట్‌లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. ఈ షాడో బడ్జెట్‌ను పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు అన్బుమణి విడుదల చేశారు. మొత్తం 359 ప్రతిపాదనలతో ఈ బడ్జెట్ రూపొందించారు. రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రూ.5.43,442 కోట్లుగా చూపెట్టారు. ఇది గత యేడాదికంటే రూ.1,91,602 కోట్లు అధికమన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు క్వారీలకు బదులుగా ఖనిజవనరుల తవ్వకాలు చేపడితే ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో జూలై 25 జన గణన నిర్వహించాలని, దీనికోసం రూ.400 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనవరి 25 ప్రపంచ తమిళ మాతృభాషా దినంగా పాటించాలని, ఏప్రిల్ ఒకటి నుండి పాత పింఛన్ పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కూడా పేర్కొన్నారు. కోయంబేడు బస్‌స్టేషన్‌ను ఉద్యానవనంగా మార్చాలని సూచించారు.

## పాక్‌తో కలిసి బంగ్లా ఆర్మీలో సైనిక కుట్ర.. కీలక సైనిక జనరల్‌పై నిఘా

- బంగ్లాదేశ్ ఆర్మీలో తిరుగుబాటుకు కుట్ర
- పాక్‌తో సంబంధం ఉన్న సైనిక జనరల్ పని
- సైనిక జనరల్ పై నిఘా పెంచిన బంగ్లాదేశ్ ఆర్మీ



బంగ్లాదేశ్: షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత బంగ్లాదేశ్ ఆర్మీలో తిరుగుబాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపించాయి. ముఖ్యంగా, పాకిస్తాన్‌తో కలిసి బంగ్లా ఆర్మీ చీఫ్‌ని మార్చడం లేదా ఆర్మీలో తిరుగుబాటు తేవడానికి ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. క్వార్టర్ మాస్టర్ జనరల్ అయిన లెఫ్టినెంట్ జనరల్ ఫైజుర్ రెహమాన్ కొన్ని రోజులుగా ఇందుకు కుట్ర పన్నుతున్నారనే వార్తలు వచ్చిన తర్వాత అతడిపై బంగ్లాదేశ్ ఆర్మీ నిఘా పెంచినట్లు తెలుస్తోంది. ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్ కూడా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆమోదించినట్లు తెలుస్తోంది. మతఛాందసవాద సంస్థ జమాతే ఇస్లామికి సానూభూతి పరుడైన లెఫ్టినెంట్ జనరల్ ఫైజుర్ రెహమాన్, ఆర్మీ చీఫ్‌కి తెలియకుండానే సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ సెక్రటేరియట్‌లో వార్తలు వచ్చిన తర్వాత అతడిపై నిఘాలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. బంగ్లాదేశ్ ఆర్మీ యాక్టింగ్ చీఫ్ వకార్ ఉజ్ జమాన్‌కి వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు డివిజనల్ కమాండర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అతడికి తగినంత మద్దతు లభించలేదు. మార్చి మొదటి వారంలో లెఫ్టినెంట్ జనరల్ ఫైజుర్ రెహమాన్ కీలకమైన డివిజనల్ కమాండర్ల (జిఓసి) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఆర్మీ చీఫ్ సెక్రటేరియట్ సమావేశం గురించి తెలుసుకుని ఉన్నతాధి కారులకు హెచ్చరిక పంపబడింది. దీంతో ఉన్నతాధికారులు కీలకమైన సమావేశం నుంచి వెనక్కి తగ్గారు. 2025 మొదటి రెండు నెలల్లో లెఫ్టినెంట్ జనరల్ ఫైజుర్ రెహమాన్ జమాత్, పాకిస్తాన్ దౌత్యవేత్తలతో అనేక సమావే శాలు నిర్వహించారు. ఈ సమావేశాల గురించి ఆర్మీ ఛీఫ్‌కి సమాచారం లేదు. ఇటీవల పాక్ ఐఎస్ఐ చీఫ్ బంగ్లాకు వచ్చిన సమయంలో కూడా ఫైజుర్ రెహమాన్‌నే వీరిని దగ్గర ఉండి చూసుకున్నారు. గత కొన్ని నెలలుగా హింస, మత ఘర్షణలు, అల్లర్లు పెరుగుతున్న నేపథ్యంలో, బంగ్లాదేశ్‌లో మళ్లీ అశాంతి చెలరేగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల షేక్ హసీనా కుటుంబంతో సంబంధం ఉన్న ఆస్తుల్ని ధ్వంసం చేశారు. వీరిలో బంగ్లాదేశ్ జాతిపితగా చెప్పబడుతున్న షేక్ ముజిబుర్ రెహమాన్ ఇల్లు కూడా ఉంది. గత నెలలో, ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్–ఉజ్–జమాన్ మాట్లాడుతూ, దేశంలో శాంతిభద్రతల పరిస్థితి వేగంగా దిగజారడానికి రాజకీయ గందరగోళమే కారణమని అన్నారు. సాయుధ దళాలలో ఐక్యత, క్రమశిక్షణ అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. "మనం చూస్తున్న అరాచకం మనమే సృష్టించుకున్నాం" అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## పార్లమెంట్‌లో మన అరకు కాఫీ స్టాల్.. పర్మిషన్ గ్రాంటెడ్



న్యూఢిల్లీః పార్లమెంట్‌లో అరకు కాఫీకి ప్రత్యేక స్థానం కల్పించేందుకు కేంద్ర మంత్రులు సహా పలువురు నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పార్లమెంట్లో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు కోసం స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, బీజేపీ ఎంపీ సీఎం రమేష్ కలిసి స్పీకర్‌ను కలుసుకుని అరకు కాఫీ ప్రాముఖ్యతను వివరించారు.

**ప్రధాని మోదీ కూడా**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ ఉత్పత్తుల్లో అరకు కాఫీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఈ విషయాన్ని ప్రధాని మోదీ కూడా తన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించినట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు స్పీకర్కు తెలిపారు. ఆంధ్రప్రదేశ్లోని మారుమూల గిరిజన ప్రాంతం అరకు వ్యాలీ ఈ కాఫీ పంటకు ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు అరకు కాఫీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతించాలని ఎంపీలు కోరారు.

**రైతులకు కూడా లాభాలు**

ఈ క్రమంలో పార్లమెంటు ప్రాంగణంలో శాశ్వతంగా అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయడానికి కూడా అనుమతులు ఇవ్వాలని రామ్మోహన్ నాయుడు స్పీకర్ను కోరారు. అరకు కాఫీ ప్రత్యేకతకు మంచి ఆదరణ లభిస్తుందని, దీర్ఘకాలిక మార్కెట్ అవకాశాలు మెరుగవుతాయని ఆయన తెలిపారు. ఈ కాఫీ ఉత్పత్తి ద్వారా స్థానిక రైతులకు కూడా లాభాలు చేకూరుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

**మరింత గుర్తింపు లభిస్తుందని**

స్పీకర్ ఓం బిర్లా, ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. అయితే, శాశ్వతంగా స్టాల్ ఏర్పాటు విషయాన్ని తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా అరకు కాఫీకి మరింత గుర్తింపు లభిస్తుందని, దేశవ్యాప్తంగా కాఫీ ప్రేమికుల్లో ఈ కాఫీకి ప్రత్యేకమైన స్థానం ఏర్పడుతుందని ఆశిస్తున్నారు. అరకు కాఫీ, దాని ప్రత్యేకతలు, ఆర్థిక లాభాల గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో కీలకమని ఎంపీలు అభిప్రాయపడ్డారు.

**దేశవ్యాప్తంగా ఈ కాఫీకి..**

అరకు కాఫీకి సంబంధించిన ఈ కార్యక్రమం పార్లమెంట్లో కాఫీ ప్రియులకు ఒక ప్రత్యేక అనుభవాన్ని అందించడంతో పాటు, దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ కాఫీని పరిచయం చేయడానికి దోహదపడుతుంది. ఈ కాఫీ ఉత్పత్తి కేవలం ఆంధ్రప్రదేశ్లోనే కాకుండా, దేశవ్యాప్తంగా కాఫీ ఉత్పత్తుల మార్కెట్లో కూడా ప్రత్యేక గుర్తింపు పొందేందుకు దోహదపడుతుంది. ఈ క్రమంలో అరకు కాఫీకి సంబంధించిన అవగాహన పెరిగి, కాఫీ ఉత్పత్తుల మార్కెట్లో దాని స్థానం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఈ కాఫీ ఉత్పత్తి, కేవలం ఆర్థిక లాభాలకే పరిమితం కాకుండా, స్థానిక సంస్కృతిని, సంప్రదాయాలను కూడా ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. అరకు కాఫీ స్టాల్





## కాలుష్య కాసారంగా

# మన భారతావని

### ప్రపంచంలోని అత్యంత వాయు కాలుష్యనగరాలు 20 అందులో 13 నగరాలు మనదేశంలోనే ఉండటం ఆందోళనకరం

**ప్రపంచంలో అత్యంత కాలుష్యదేశాల జాబితా వెల్లడైంది. ప్రపంచంలోని 20 అత్యంత వాయు కాలుష్యం గల నగరాల్లో 13 భారతదేశంలోనే ఉన్నాయని, వాటిలో మేఘాలయలోని బైర్నిహాట్ అగ్రస్థానంలో ఉందని వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024 పేర్కొంది. అంతేకాదు ప్రపంచంలోని అత్యంత కలుషితమైన రాజధాని నగరాల్లో దిల్లీ ప్రథమ స్థానంలో ఉందని సదరు నివేదిక స్పష్టం చేసింది. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూఎయిర్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం, 2023లో భారత్ ప్రపంచంలోనే మూడో అత్యంత కాలుష్య దేశంగా ఉండగా, 2024 నాటికి కాస్త మెరుగుపడి ఐదో స్థానానికి చేరుకుంది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోని 4 నగరాలు, చైనాలోని ఒక నగరం కూడా ప్రపంచంలోని టాప్-20 కాలుష్య నగరాల జాబితాలో ఉన్నాయి. మరిన్ని వివరాలలోకి వెళితే**

పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ దేశంలోని చిన్న నగరాలను సైతం కాలుష్య కోరల్లోకి నెట్టేస్తోంది. ఇప్పటికే దేశ రాజధాని దిల్లీలో కర్బన ఉద్గారాల విడుదల ఆందోళనకర స్థాయికి చేరింది. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగాలు చర్యలు చేపడుతున్నప్పటికీ, దేశంలో పలు నగరాల్లో గాలి నాణ్యత పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. భారత దేశం కాలుష్యానికి కేరాఫ్‌గా మారుతోందా.. దేశంలో గాలి నాణ్యత వేగంగా పడిపోతుందా అంటే పర్యావరణ నివేదికలు అదే చెబుతున్నాయి. రోజు రోజుకూ దేశంలో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. గాలి నాణ్యత పడిపతోంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాలు 20 ఉండగా, అందులో 13 భారత్‌లోనే ఉండడం గమనార్హం. ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో భారత్ ఒక ప్రముఖ స్థానంలో ఉంది. 2024లో స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ సంస్థ ఐక్యూ ఎయిర్ విడుదల చేసిన 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్' ప్రకారం, ప్రపంచంలోని టాప్ 20 కాలుష్య నగరాల్లో 13 భారతదేశంలోనివే ఉన్నాయి. ఈ జాబితాలో మేఘాలయలోని బైర్నీహట్ అగ్రస్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధానిగా గుర్తింపు పొందింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చాలా ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నివేదిక ప్రకారం, భారత్‌లో పీఎం2.5 సాంద్రత 2023లో క్యూబిక్ మీటర్‌కు 54.4 మైక్రోగ్రాములు ఉండగా, అది 2024లో 7 శాతం మేర తగ్గింది. అంటే సగటున క్యూబిక్ మీటర్‌కు 50.6 మైక్రోగ్రాములు తగ్గింది. అయినప్పటికీ ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారతదేశంలోనే ఉండడం గమనార్హం.

### దిల్లీలో పెరుగుతున్న కాలుష్యం!

నివేదిక ప్రకారం, దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం మరింతగా పెరుగుతోంది. 2023లో పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 102.4 మైక్రోగ్రాములు ఉండగా, అది 2024లో క్యూబిక్ మీటర్‌కు 108.3 మైక్రోగ్రాములకు పెరిగింది.

మొత్తంగా చూసుకుంటే, దాదాపు 35 శాతం భారతీయ నగరాల్లో వార్షిక పీఎం2.5 సాంద్రత స్థాయిలు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పరిమితి కంటే 10 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 5 మైక్రోగ్రాముల కంటే తక్కువ ఉండాలి. కానీ భారత్‌లో ఈ పరిమితి కంటే 10 రెట్లు ఎక్కువగా పీఎం2.5 సాంద్రతలు ఉన్నాయి.





### అమెరికాలో కాలుష్యం స్థాయి

అమెరికాలో అత్యంత కాలుష్య నగరంగా కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్ నిలిచింది. అలాగే, కాలిఫోర్నియాలోని ఒంటారియో నగరం అమెరికాలో అత్యంత కాలుష్యపూరిత ప్రాంతంగా గుర్తించబడింది. మ-రోవైపు, వాషింగ్టన్‌లోని సియాటెల్ అమెరికాలో అత్యంత పరిశుభ్రమైన ప్రధాన నగరంగా నిలిచింది. 2024 నాటికి ఓషియానియా ఖండం ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన ప్రాంతంగా గుర్తించబడింది.

భారత్ లో అత్యంత కలుషితమైన ప్రాంతం బర్నిహాట్ 2024లో అస్సాంలోని బర్నిహాట్ భారత్ లో అత్యంత కలుషితమైన మెట్రోపాలిటన్ ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ వార్షిక సగటు PM2.5 సాంద్రత 128.2 μg/m3 గా ఉంది. ప్రపంచంలోని తొమ్మిది అత్యంత కాలుష్య నగరాలకు మధ్య ఆసియా, దక్షిణాసియా ప్రాంతం నిలయంగా ఉంది. ప్రపంచంలోని 9 అత్యంత కాలుష్య నగరాల్లో 6 భారత్ లోనే ఉన్నాయి. ఈ వాయు కాలుష్యం వల్ల భారత్‌లో తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మానవుల ఆయుర్దాయం 5.2 సంవత్సరాలు తగ్గుతోందని అంచనా. గతేడాది ప్రచురించిన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ స్టడీ ప్రకారం, 2009-2019 మధ్యలో భారత్‌లో ఏటా దాదాపు 1.5 మిలియన్ మరణాలు పీఎం2.5 కాలుష్యం వల్లనే కలిగాయని తేలింది.

### ఆరోగ్య ప్రభావం

భారత్‌లో వాయు కాలుష్యం ఒక తీవ్రమైన ఆరోగ్య సంక్షోభంగా మారింది. ఇది సగటు జీవిత కాలాన్ని 5.2 సంవత్సరాలు తగ్గిస్తుందని అంచనా. లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం ప్రకారం, 2009%-%2019 మధ్య ఏటా సుమారు 15 లక్షల మరణాలు %పీ%2.5 కాలుష్యంతో సంబంధం కలిగి ఉన్నాయి. పీఎం2.5 అంటే 2.5 మైక్రాన్ల కంటే చిన్నగా ఉండే కణాలు. సింపుల్‌గా చెప్పాలంటే వాయు కాలుష్య కణాలు. ఇవి ఊపిరితిత్తుల్లోకి, రక్తప్రవాహంలోని ప్రవేశించి దీర్ఘకాలిక శ్వాస సమస్యలు, గుండె జబ్బులకు, క్యాన్సర్ రావడానికి కారణమవుతాయి.

ప్రపంచంలోని టాప్ 20 కాలుష్య నగరాల్లో 13 భారత్‌లో ఉండటం ఆందోళనకరం. ఢిల్లీ వంటి రాజధాని నగరం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుంటే, బైర్నీహట్ వంటి చిన్న పట్టణాలు కూడా ఈ జాబితాలో చేరడం వాయు కాలుష్య సమస్య విస్తృతిని చూపిస్తోంది. ప్రభుత్వం 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' వంటి చర్యలు చేపడుతున్నప్పటికీ, కఠిన నియంత్రణలు, ప్రజల సహకారం లేకుండా ఈ సమస్యను అధిగమించడం కష్టం. వాయు కాలుష్యాన్ని తగ్గించడం కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

### జన చైతన్యంతోనే నివారణ



ఈ నివేదికలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ ప్రధాన శాస్త్రవేత్త, ఆరోగ్య మంత్రిత్వశాఖ సలహాదారు సౌమ్య స్వామినాథన్ మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉ ందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లల్లో వంట చెరుకు ఉపయోగించడం వల్ల అక్కడి ప్రజలు అధికంగా కాలుష్య కారక వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వాటిని నివారించడానికి బయోమాస్‌ను ఎల్‌పీజీ సిలిండర్లతో భర్తీ చేయడం వంటి విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. దీనికోసం భారత ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమ పథకాన్ని అమలుచేస్తోందని.. అయితే దీనిని పూర్తిగా నివారించాలంటే అదనపు గ్యాస్ సిలిండర్లపై మరింత రాయితీ ఇవ్వాలని ఆమె సూచించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం మెరుగవ్వడమే కాకుండా కాలుష్య స్థాయులు కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నగరాల్లో ప్రజా రవాణాను విస్తరించడం, కొన్నిరకాల వాహనాలపై జరిమానాలు విధించడం.. పరిశ్రమలు, నిర్మాణసంస్థలు తగిన నిబంధనలు పాటించడం వంటి చర్యల ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చున్నారు.



### భారత్‌లోని 13 కాలుష్య నగరాలు

బైర్నిహాట్ (మేఘాలయ) అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది.
ఢిల్లీ అత్యంత కాలుష్య రాజధానిగా రికార్డు సష్టించింది.
ముల్లన్‌పూర్ (పంజాబ్)
ఫరీదాబాద్ (హర్యానా)
లోనీ(ఉత్తరప్రదేశ్)
గురుగ్రామ్(హర్యానా)
గంగానగర్(రాజస్థాన్)
గ్రేటర్ నోయిడా(ఉత్తరప్రదేశ్)
భివాడీ(రాజస్థాన్)
ముజఫ్ఫర్‌నగర్(ఉత్తరప్రదేశ్)
హనుమాన్‌గఢ్ (రాజస్థాన్)
నోయిడా (ఉత్తరప్రదేశ్)

### కాలుష్యానికి కారణాలు ఇవే!

మేఘాలయ-అసోం సరిహద్దుల్లోని బైర్నిహాట్ పట్టణంలో చాలా డిస్టిలరీలు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు ఉన్నాయి. వీటి నుంచి వెలువడే ఉద్గారాల వల్ల ఆ నగరం కాలుష్యకాసారం అవుతోంది. ఇక దేశ రాజధాని నగరమైన దిల్లీ ఏడాది పొడవునా అధిక వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. శీతాకాలంలో అయితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంటుంది. వాహన ఉద్గారాలకు తోడు, పంట వ్యర్థాలను తగులబెట్టడం, పటాకులు కాల్చడం సహా, ఫ్యాక్టరీల నుంచి వెలువడే ఉద్గారాలు దిల్లీలోని గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయి.

## రిషబ్ పంత్ ఇంట్లో పెళ్లి భాజాలు

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఇంట్లో పెళ్లి భాజాలు మోగనున్నాయి. అతడి సోదరి సాక్షి పంత్ పెళ్లి పీటలు ఎక్కనుంది. సాక్షి పంత్.. వ్యాపార వేత్త అంకిత్ చౌదరిని వివాహం చేసుకోబోతోంది. ఈ వివాహ వేడుకలు మంగళవారం, బుధవారం ముస్సోరీ లో జరగనున్నట్లు తెలిసింది. ఈ వివాహాని కి భారత కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని హాజరు కానున్నట్లు పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. కాగా 9 ఏళ్లపాటు ప్రేమలో మునిగి తేలిన ఈ జంట.. గతేడాది నిశ్చితార్థం చేసుకున్నారు. లండన్‌లో జరిగిన వారి నిశ్చితార్థానికి ఎంఎస్ ధోని హాజరయ్యాడు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ-2025 గెలుచుకున్న భారత జట్టులో పంత్ సభ్యునిగా ఉన్నాడు. కానీ ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం పంత్‌కు రాలేదు. కేఎల్ రాహుల్ ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్ గా ఉండడంతో పంత్‌కు తుది జట్టు లో చోటుదక్కలేదు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఐపీఎల్‌పైనే పడింది. ఐపీఎల్-2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఒకట్రెండు రోజులు విశ్రాంతి తీసుకుని ఆటగాళ్లంతా తమ తమ జట్ల లో చేరనున్నారు. ఇప్పటికే రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా వంటి స్టార్ ప్లేయర్లు తమ ప్రాతినిథ్యం వహిస్తున్న ఫ్రాంచైజీలతో కలిశారు. ఈ ఏడాది సీజన్ ఐపీఎల్‌లో రిషబ్ పంత్ లక్నో సూపర్‌జెయింట్స్ తరపున ఆడనున్నాడు. గత డిసెంబర్‌లో జరిగిన మెగా వేలంలో పంత్‌ను రూ.27 కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది.



### భారత రెజ్లింగ్ సమాఖ్యపై
## సస్పెన్షన్ ఎత్తివేత



ఏసియన్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ ముందు క్రీడా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ)పై ఉన్న సస్పెన్షన్‌ను మంగళవారం ఎత్తి వేసింది. అంతర్జాతీయ టోర్నీలపై భారత రెజ్లర్ల ఆసక్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. పాలనా శూన్యత అథ్లెట్ల శిక్షణపై ప్రభావం చూపుతుందని, రాబోయే ఆసియా గేమ్స్-2026, ఒలింపిక్స్-2028లలో పతకాలపై ఆ ప్రభావం ఉంటుందని తెలిపింది. రెజ్లింగ్ నిర్వహణలో స్థిరత్వం తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పింది. 2023 డిసెంబర్ 24న డబ్ల్యూఎఫ్ఐపై కేంద్రం సస్పెన్షన్ విధించింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ నిబంధనలను విరుద్ధంగా జాతీయ చాంపియన్‌షిప్ నిర్వహణపై ప్రకటన చేయడం, కొత్త పాలకవర్గం ఎన్నికైనా మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ నియంత్రణలోనే సమాఖ్య ఉండటం లాంటి కారణాలతో అప్పుడు చర్యలు చేపట్టింది. ఆ తర్వాత డబ్ల్యూఎఫ్ఐ రోజు వారీ కార్యకలాపాలను భారత ఒలింపిక్ అసోసియేషన్ నియమించిన అడ్ హక్ కమిటీ పర్యవేక్షించింది. 14 నెలల తర్వాత భారత రెజ్లింగ్ సమాఖ్యపై విధించిన నిషేధాన్ని క్రీడా శాఖ తాజాగా ఎత్తివేసింది. దీంతో డబ్ల్యూఎఫ్ఐ సంజయ్ సింగ్ నేతృత్వం లోని పాలక వర్గం నియంత్రణలోకి వచ్చింది. దీంతో దేశీయ టోర్నీలు, అంతర్జాతీయ టోర్నీల కు జాతీయ జట్ల ఎంపికకు మార్గం సుగుమమైంది. ఈ నెల 15న ఢిల్లీలో రెజ్లింగ్ ట్రయల్స్ నిర్వహిస్తామని సంజయ్ సింగ్ తెలిపారు. ఈ నెల 25-30 వరకు జోర్డాన్‌లోని అమ్మాన్ లో జరిగే ఏసియన్ చాంపియన్‌షిప్స్ జరగనుంది. ఈ టోర్నీ లో పాల్గొంటేనే సెప్టెంబర్‌లో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో బరిలోకి దిగొచ్చు. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ సింగ్ కు సంజయ్ సింగ్ సన్నిహితుడు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో సంజయ్ సింగ్ గెలుపొందారు. ఆయన ఎన్నికను వ్యతిరేకంగా సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగట్ ఆందోళన చేసిన విషయం తెలిసిందే.

## టెస్టుల్లో రీ ఎంట్రీకి సిద్ధం



టీమిండియా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ టెస్టుల్లో పునరాగమనంపై దృష్టి సారించాడు. దేశవాళీ టోర్నమెంట్లలో తాను అద్భుతంగా రాణించానని.. అందుకే తాను తిరిగి జాతీయ జట్టుకు ఆడతాననే ధీమా వ్యక్తం చేశాడు. కాగా వన్డే ప్రపంచకప్-2023 తర్వాత క్రమ శిక్షణారాహిత్యానికి పాల్పడ్డాడనే కారణంతో బీసీసీఐ శ్రేయస్ అయ్యర్‌పై వేటు వేసిన విషయం తెలిసిందే. దేశవాళీ క్రికెట్ ఆడాలన్న నిబంధనలను గాయం సాకు చూపి తప్పించుకున్నాడని భావించిన బోర్డు.. అయ్యర్ వార్షిక కాంట్రాక్టును రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ముంబై తరఫున దేశీ బరిలో దిగిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. గతేడాది శ్రీలంకతో వన్డే సిరీస్ సందర్భంగా టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ఇక తాజాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 లో సత్తా చాటిన శ్రేయస్ అయ్యర్.. ఈ వన్డే టోర్నీ లో భారత్ తరఫున టాప్ రన్ స్కోరర్గా నిలిచాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసి ఐదు ఇన్నింగ్స్‌లో కలిపి 243 పరుగులు సాధించాడు. తద్వారా ఈ మెగా ఈవెంట్లో అత్యధిక పరుగుల వీరుల జాబితా లో న్యూజిలాండ్ స్టార్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రచిన్ రవీంద్ర(263) తర్వాతి స్థానాన్ని ఆక్రమించాడు. ఇదిలా ఉంటే.. వన్డేల్లో తానేంటో మరోసారి నిరూపించుకున్న శ్రేయస్ అయ్యర్.. టీమిండియా టెస్టు రీఎంట్రీకి తాను సిద్ధమనే సంకేతాలు ఇచ్చాడు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడుతూ.. "టెస్టుల్లో పునరాగమనం చేయాలని ఉంది. వీలైనంత ఎక్కువ గా క్రికెట్ ఆడాలని భావిస్తున్నా. దేశవాళీ టోర్నమెంట్లో నేను ఉత్తమంగా రాణించాను. అయితే, నా చేతుల్లో ఏమీ లేదు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే. కానీ ఈ విషయం గురించి పదే పదే ఆలోచించను. దాని వల్ల అనసవరంగా నా మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. అనుకున్నది జరుగకపోతే మానసికంగానూ కాస్త ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ క్షణాన్ని ఆస్వాదిస్తా. విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటా. సమయం వచ్చినపుడు అవకాశం అదే తలుపుతడుతుంది. ముందుగా చెప్పినట్లు నేను భవిష్యత్తు, గతం గురించి ఎక్కువగా ఆలోచించే మనిషిని కాను. ప్రస్తుతం నేను ఇలా ఉండటానికి కారణం అదే" అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు. కాగా చివరిసారిగా అయ్యర్ గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఇక ఇప్పటి వరకు మొత్తంగా టీమిండియా తరఫున 14 టెస్టులు ఆడిన ఈ ముంబైకర్ 811 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం కూడా ఉంది. ఇక తాజా రంజీ ట్రోఫీ సీజన్ లో శ్రేయస్ అయ్యర్.. ఆడిన ఐదు మ్యాచ్ల లోనే ఏకం గా 480 పరుగులు సాధించాడు. ఇక టీమిండియా జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇందులో భాగంగా స్టోక్స్ బృందంతో టెస్టులు ఆడనుంది. ఈ సిరీస్ నాటికి అయ్యర్ పునరాగమనం చేసే అవకాశాలు లేకపోలేదు.

### రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పై రాయుడు సెటైర్లు



ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసింది. అయినా మన క్రికెట్ అభిమానుల కు ఎలాంటి ఇబ్బంది లేదు. భారత క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్‌కు మరో 11 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటికే అన్ని జట్లు తమ క్యాంప్ చేరుకొని ప్రాక్టీస్ ను కూడా ప్రారంభించేశాయి. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత క్రికెటర్లు త్వరలో తమ ఐపీఎల్ జట్లలో చేరనున్నారు. ఎప్పటిలాగే ఈ సారి ఐపీఎల్‌కు ముందు మాటల యుద్ధం ప్రారంభమైంది. భారత మాజీ క్రికెటర్లు అంబటి రాయడు, రాయల్ ఛాలెంజర్స్ మాజీ హెడ్ కోచ్ మధ్య ఐపీఎల్ కు సంబంధించిన చర్చలు జరిగాయి.

# కేఎల్ రాహుల్ సంచలన నిర్ణయం ?



ప్రతిష్టాత్మక ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీ పూర్తయింది. దీంతో ఇప్పుడు క్రికెట్ అభిమానుల దృష్టి మొత్తం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పై పడింది. ఈ 18వ సీజన్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మొత్తం పది జట్లు ఈ మెగా లీగ్‌లో హోరాహోరీగా పోటీ పడతాయి. ఇప్పటికే ఈ పది జట్లలో 9 జట్లు కెప్టెన్లపై క్లారిటీ ఇచ్చేశాయి. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ మాత్రం తమ కెప్టెన్ ఎవరనే విషయాన్ని అధికారికంగా తెలపలేదు. పైగా ఢిల్లీ క్యాపిటల్స్‌కి గత సీజన్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన రిషబ్ పంత్‌ని విడిచిపెట్టింది. దీంతో కొత్త కెప్టెన్‌ని ఎంపిక చేయడం అనివార్యమైంది. అయితే ఢిల్లీ కెప్టెన్‌గా భారత జట్టు వికెట్ కీపర్, బ్యాట్స్మెన్ అయిన కేఎల్ రాహుల్ లేదా ఆల్రౌండర్ అక్షర్ పటేల్‌లలో ఒకరిని ఎంపిక చేస్తారని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటి వరకు కేఎల్ రాహుల్ లక్నో సూపర్ జెంట్స్ జట్టుకి నాయకత్వం వహించాడు. కానీ రాహుల్‌ని 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ 14 కోట్లకు కొనుగోలు చేసింది. రాహుల్‌కి ఐపీఎల్‌లో ఎంతో అనుభవం ఉంది. 2013లో ఆర్సిబి జట్టుతో తన ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించాడు రాహుల్. ఆ తర్వాత సన్ రైజర్స్ హైదరాబాద్, కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరాడు. అయితే రాహుల్ కి చాలా అనుభవం ఉండడంతో అతడినే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకి కెప్టెన్‌గా నియమిస్తారని భావించారు. కానీ కె.ఎల్ రాహుల్ కెప్టెన్సీపై సంచలన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తన పూర్తి ఫోకస్‌ని బ్యాటింగ్‌పై పెట్టేందుకు కెప్టెన్సీ బాధ్యతలను తనకు అప్పగించవద్దని జట్టు మేనేజ్మెంట్‌కి తెలియజేశాడట కేఎల్ రాహుల్. దీంతో ఢిల్లీ జట్టుకి అక్షర్ పటేల్‌ని కెప్టెన్‌గా నియమించడం లాంఛనంగా మారింది. ఇన్ని రోజులుగా కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ లలో ఢిల్లీ జట్టుకు ఎవరూ కెప్టెన్ అవుతారు అనే ప్రశ్నలకు తాజా నిర్ణయంతో జవాబు దొరికినట్లయింది. త్వరలోనే మేనేజ్మెంట్ కెప్టెన్ ని ప్రకటించే అవకాశం ఉంది. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తన తొలి రెండు మ్యాచ్ ల కోసం విశాఖపట్నం వెళ్లే ముందు.. ఢిల్లీ లోనే ప్రాక్టీస్ శిబిరాన్ని నిర్వహిస్తుంది. అయితే మరోవైపు కె.ఎల్ రాహుల్ భార్య అథియా శెట్టి త్వరలోనే ఓ బిడ్డకు జన్మనివ్వనుంది. ఈ క్రమంలో ఐపీఎల్ ప్రారంభ సమయంలో కేఎల్ రాహుల్ కుటుంబానికి సమయాన్ని కేటాయించాలని భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో మొదటి రెండు మ్యాచ్‌లకు కేఎల్ రాహుల్ దూరమయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇక కె.ఎల్ రాహుల్ కెప్టెన్సీలో లక్నో జట్టు రెండుసార్లు ప్లేఆఫ్‌కి చేరుకుంది. రాహుల్ 134 కంటే ఎక్కువ స్ట్రైక్ రేటుతో 4683 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు కూడా ఉన్నాయి. మరోవైపు అక్షర్ పటేల్ ఇప్పటివరకు 150 ఐపీఎల్ మ్యాచ్లు ఆడాడు. దాదాపు 131 స్ట్రైకరేట్‌తో 1653 పరుగులు చేశాడు. అలాగే 7.28 ఎకానమీ రేట్‌తో 123 వికెట్లు పడగొట్టాడు.

# ఐపీఎల్‌కు ముందే ఢిల్లీ క్యాపిటల్స్‌కు షాక్!

ఐపీఎల్ సీజన్ 2025కి కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఇప్పటికే ఆయా ఫ్రాంచైజీ ప్లేయర్లు తమ జట్లను చేరుకుని ప్రారంభం కానుంది. ఈ క్రమంలో దిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్లేయర్ హ్యారీ బ్రూక్ ఇప్పుడు నిషేధం ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. 18వ ఎడిషన్‌లో ఆడటం లేదని హ్యారీ బ్రూక్ వెల్లడించాడు. జాతీయ జట్టు సేవలకు సిద్ధమయ్యేందుకు ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపాడు. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు కూడా ఇదే విషయం పై బీసీసీఐకి సమాచారం ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. గతేడాది నవంబరులో జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో దిల్లీ జట్టు హ్యారీ బ్రూక్‌ను రూ.6.25 కోట్లకు కొనుగోలు చేసింది. వరుసగా రెండో సారి.. బ్రూక్ తాజా నిర్ణయంతో బీసీసీఐ అతనిపై నిషేధం విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీసీఐ కొత్త రూల్స్ ప్రకారం వేలంలో అమ్ముడుపోయిన ఆటగాడు సరైన కారణం లేకుండా ఐపీఎల్ నుంచి వైదొలిగితే రెండేళ్ల బ్యాన్ పడుతుంది. మరి బ్రూక్‌పై ఐపీఎల్ నిర్వహకులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలని క్రిటిక్స్ అంటున్నారు. గతేడాది కూడా బ్రూక్ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. దీంతో బ్రూక్ వరుసగా రెండు సీజన్లలో ఐపీఎల్ నుంచి వైదొలిగినట్లైంది. గత సీజన్‌లోనూ బ్రూక్ ఇలాగే పొంతన లేని కారణాలు చెప్పి ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. బ్రూక్ వ్యక్తిగత కారణాలను సాకుగా చూపి టోర్నీ నుంచి వైదొలిగాడు. అయినా అసలు కారణాలు వేరే అని తెలిసింది. ఆ సీజన్ వేలంలో తక్కువ ధర (రూ. 4 కోట్లు) పలికినందుకు బ్రూక్ వైదొలిగాడని తెలుస్తోంది. 2023 సీజన్‌లో బ్రూక్‌ను సన్ రైజర్స్ హైదరాబాద్ రూ. 13.25 కోట్ల రికార్డు ధర వెచ్చింది సొంతం చేసుకుంది. 2024 వేలం లోనూ బ్రూక్ ఇదే స్థాయి మొత్తాన్ని ఆశించగా నిరాశ ఎదురైంది. రూ.6.25 కోట్లకు దిల్లీ జట్టు దక్కించుకుంది. కెప్టెన్సీ కోసమేనా? అయితే ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జట్టు ఓటమికి బాధ్యత వహిస్తూ జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. బట్లర్ స్థానంలో బ్రూక్ కెప్టెన్‌గా ఎంపికవుతారని వార్తలు వస్తున్నాయి. అందుకే బ్రూక్ ఐపీఎల్ 2025లో ఆడొద్దని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.



# ప్రపంచ క్రికెట్‌ని శాసిస్తున్న భారత్



టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ది ప్రత్యేక శైలి. స్వతహా గా ఇంజనీర్ అయిన అశ్విన్ తన స్పిన్ బౌలింగ్ లోనూ అదే మేధస్సును ప్రదర్శించాడు. గత సంవత్సరం జరిగిన ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించిన 38 అశూ.. ఆటను విశ్లేషించడంలో మాంచి దిట్ట. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజయంపై కూడా తనదైన శైలిలో స్పందించాడు. ప్రస్తుత భారత్ జట్టు 1990- 2000లలో దశాబ్ద కాలంలో ఆస్ట్రేలియా ప్రపంచ క్రికెట్ ని ఎలా శాసించిందో.. అదే రీతిలో విజయ పరంపర కొనసాగిస్తుందని వ్యాఖ్యానించాడు. భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ ని గెలుచుకున్న తర్వాత ఒక ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూ లో అశ్విన్ మాట్లాడుతూ.. ప్రధాన పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేకుండానే భారత్ ఈ విజయం సాధించడం చాలా ప్రత్యేకమైందన్నాడు. ఇది భారత బౌలింగ్ లైనప్ బలాన్ని రుజువు చేసిందని వ్యాఖ్యానించాడు. టీమిండియా ఈసారి బ్యాటింగ్ వల్ల కాదు, బౌలింగ్ వల్లే ఈ ట్రోఫీ గెలిచిందని. .ఇది అందరూ గుర్తించాల్సిన అవసరం ఉందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా గ్రాస్ రూట్ స్థాయిలో బౌలర్లకు మరింత మద్దతు, ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరముందని అశ్విన్ పిలుపునిచ్చాడు. బుమ్రా లేకుండా ఈ టోర్నమెంట్లో విజయం సాధిండానికి భారత్ బౌలర్ల చేసిన కృషి ని ప్రత్యేకంగా అభినందించక తప్పదని అశ్విన్ తెలియజేసాడు. వచ్చే సంవత్సరం జరిగే టీ20 ప్రపంచ కప్ గురించి మాట్లాడుతూ అశ్విన్ భారత జట్టుకు ముగ్గురు ప్రధాన ఆటగాళ్లను అశ్విన్ గుర్తించాడు. జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ మరియు వరుణ్ చక్రవర్తి భారత్ జట్టులో తప్పనిసరిగా ఉండాలని అశ్విన్ సూచించాడు. వారి ముగ్గురి తో కూడిన బౌలింగ్ ని ఎదుర్కోవడం ప్రత్యర్థుల కు భయంకరంగా ఉంటుందని వ్యాఖ్యానించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూ జిలాండ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర ని ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు ప్రకటించడం పై అశ్విన్ విభేదించాడు. రచిన్ రవీంద్రకి బదులుగా, భారత్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కి ఆ గౌరవం దక్కాల్సిందని అశ్విన్ పేర్కొన్నాడు. రచిన్ 263 పరుగులతో ఈ టోర్నమెంట్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. "ఎవరేమి చెప్పినా, ఏం చేసినా, నా దృష్టిలో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ కచ్చితంగా వరుణ్ చక్రవర్తి. అతను ఈ మొత్తం టోర్నమెంట్ ఆడలేదు. కానీ ఆడిన రెండు మూడు మ్యాచ్ లలోనే చాల కీలక భూమిక వహించాడు. వరుణ్ చక్రవర్తి లేకుంటే, ఈ భారత్ కి ఈ టోర్నమెంట్ చాల భిన్నంగా ఉండేదని నేను భావిస్తున్నాను. అతను భారత్ జట్టులో 'ఎక్స్ ఫ్యాక్టర్'.. జట్టు బౌలింగ్ కి వైవిధ్యాన్ని అందించాడు" అని అశ్విన్ స్పష్టంచేశాడు .ఓ వైపు భారత్ క్రికెటర్లు సంబరాల్లో మునిగిపో గా, ఈ టోర్నమెంట్ కి ఆతిధ్యమిచ్చి చివరికి ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండా గ్రూప్ దశ నుంచి నిష్క్రమించిన పాకిస్తాన్ పరిస్థితి చాల దారుణంగా తయారైంది. ఈ టోర్నమెంట్ కి ఆతిధ్యమిచ్చిన గౌరవం దక్కక పోగా, ఆ జట్టు వైఫల్యం తో అవమానంతో తలవంపులు తెచ్చుకుంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోహ్సిన్ నఖ్వీ దుబాయ్ లో భారత్, న్యూ జిలాండ్ ల మధ్య జరిగిన ఫైనల్ కి హాజరుకాకపోవడం మరో దుమారానికి దారితీసింది. భారత్ అన్ని మ్యాచ్ లను 'హైబ్రిడ్ మోడల్'లో దుబాయ్లో ఆడింది. దీనితో పాటు భయానకమైన ఎయిర్ షోలు, ఖాళీ స్టేడియంలు మరియు పేలవమైన డ్రైనేజీ వ్యవస్థలు ఐసీసీ టోర్నమెంట్కు పాకిస్తాన్ అధ్వాన్నస్థితిని బయటపెట్టాయి. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్కు వ్యతిరేకంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిరసన తెలియజేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. దుబాయ్ లో జరిగిన ముగింపు వేడుకలో టోర్నమెంట్ డైరెక్టర్ సుమైర్ అహ్మద్ ను ఆహ్వానించకపోవడం పై పీసీబీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీనిపై ఐసీసీ వెలిబుచ్చిన కారణాలతో మొహ్సిన్ నఖ్వీ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది.

# ఐపీఎల్ ఫ్యాన్స్‌కు జియో అదిరిపోయే శుభవార్త




క్రికెట్ భిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) త్వరలో ప్రారంభం కాబోతోంది. ఈ 18వ ఎడిషన్ మార్చ్ 22 నుండి ప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్ని జట్లు తమ సన్నాహాలను ప్రారంభించాయి. ఆదివారం రోజు రాత్రి వరకు ఐసిసి ఛాంపియన్ ట్రోఫీ 2025 మజాను ఆస్వాదించిన క్రికెట్ ప్రియులు.. ఇప్పుడు ఐపీఎల్ కొత్త సీజన్ పై దృష్టి పెట్టారు. అయితే ఐపీఎల్‌లో మ్యాచ్‌లు చూడడానికి మీరు జియో డేటా రీఛార్జ్ ప్లాన్ కోసం చూస్తున్నారా..? ఆ డేటా మీకు సరిపోవడం లేదా..? ఇందుకోసం కస్టమర్లకు ప్రత్యేక డేటా ప్లాన్‌ని ప్రవేశపెట్టింది జియో. ఈనెల 22 నుండి ప్రారంభం కాబోయే ఐపీఎల్ సీజన్ కోసం రిలయన్స్ జియో అద్భుతమైన ఆఫర్ ని తీసుకువచ్చింది. ఎందుకంటే ఐపీఎల్ 2025 సీజన్ జియో హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం కాబోతోంది. దీంతో క్రీడాభిమానుల కోసం జియో రూ 100 ప్లాన్‌ని తీసుకువచ్చింది. ఈ వంద రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే మూడు నెలల పాటు జియో హాట్ స్టార్‌ని ఉచితంగా పొందవచ్చు. ఈ ప్లాన్ 90 రోజుల వ్యాలిడిటీతో 5జిబి డేటాతో పాటు జియో హాట్ స్టార్ సబ్స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తుంది. అయితే ఈ ప్లాన్ ద్వారా కాల్స్, ఎస్ఎంఎస్ వంటి సౌకర్యాలను పొందలేరు. రోజు 5 జిబి డేటా పూర్తయ్యాక ఇంటర్నెట్ స్పీడ్ 64 కేబిపిఎస్‌కి పరిమితం అవుతుంది. అయితే జియో హాట్ స్టార్ సబ్స్క్రిప్షన్ ప్లాన్ నెల రోజులకు గాను 149గా ఉంది. ఇక ప్రీమియం ప్లాన్ కావాలనుకునే వారు నెలకు 299 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి 1,499 చెల్లించాలి. జియో సినిమా మరియు డిస్నీ ప్లస్ హాట్ స్టార్ విలీనం తర్వాత రిలయన్స్ జియో తన అన్ని రీచార్జ్ ప్లాన్ల నుండి బేసిక్ జియో సినిమా బెనిఫిట్‌ని తొలగించింది. ఈ నేపథ్యంలో మార్చి 22 నుండి ప్రారంభమయ్యే ఐపీఎల్ 18వ సీజన్ ఫీవర్‌ని మీరు మిస్ కాకూడదనుకుంటే జియో హాట్ స్టార్ సబ్స్క్రిప్షన్ తీసుకోవాల్సిందే. ఇక ఈ వంద రూపాయల ప్లాన్ ఐపీఎల్ అభిమానులకు బెస్ట్ ఆప్షన్ అవుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ వంద రూపాయల ప్లాన్ లో వినియోగదారులు స్మార్ట్ ఫోన్ - స్మార్ట్ టీవీ రెండింటిలోనూ మ్యాచ్‌లను చూడవచ్చు. అంతే కాకుండా జియో హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న వెబ్ సిరీస్‌లు, సినిమాలను కూడా 1080 రెసొల్యూషన్‌లో వీక్షించవచ్చు. ఈ ప్లాన్ పట్ల వినియోగదారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సూర్య
suryachitramagazine@gmail.com
హైదరాబాద్
బుధవారం
12 మార్చి 2025



సూర్య సినిమా

# ఉమెన్ రెస్పెక్ట్‌గా ఫీలయ్యే "దిల్ రూబా"



"క" సినిమా సూపర్ హిట్ తర్వాత సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న మూవీ "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తు న్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. న్యూ ఏజ్ కమర్షియల్ మూవీగా ఈ నెల 14న హెూలీ పండుగ సందర్భంగా ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఇప్పటికే సాంగ్స్, టీజర్, ట్రైలర్ తో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకున్న "దిల్ రూబా" అన్ని వర్గాల ప్రేక్షకుల దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను లేటెస్ట్ ఇంటర్వ్యూలో వెల్లడిం చారు హీరో కిరణ్ అబ్బవరం.

– "దిల్ రూబా" సినిమా నిన్న ఫైనల్ గా చూసుకున్నాం. మూవీ ఔట్ పుట్ చూశాక చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాం. సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. టీజర్, ట్రైలర్ అందరికీ బాగా రీచ్ అయ్యింది. ఈ సినిమా వుమెన్ రెస్పెక్ట్ ఫీలయ్యేలా ఉంటుంది. మిగతా వారితో పాటు ఫీమేల్ ఆడియెన్స్ "దిల్ రూబా"ను బాగా ఇష్టపడతారు. 2గంటల 20నిమిషాల మూవీలో ఎక్కడా బోర్ ఫీల్ అవ్వరు. థియేటర్స్ నుంచి బయటకు వచ్చేప్పుడు ఒక మంచి మూవీ చూశామనే భావిస్తారు. "క" కంటే ముందు చేసిన సినిమా కదా ఇందులో కొత్తగా ఏదీ ఉండకపోవచ్చు అనుకుంటారు కానీ 10 టు 20 పర్సెంట్ సీన్స్ ఎక్కడైనా చూసినట్లు అనిపించినా మిగతా మూవీ మొత్తం న్యూ ఏజ్ కమర్షియల్ దారిలో వెళ్తూ ఆకట్టుకుంటుంది.

– "దిల్ రూబా"లో ఏదో ఉంటుందని ఎక్స్ పెక్ట్ చేయొద్దనే మేము ముందే ప్రెస్ మీట్స్ లో కథ రివీల్ చేశాం. లవ్ లోని మ్యాజిక్ మూవ్ మెంట్స్ ను ఎంజాయ్ చేస్తారు. హీరో క్యారెక్టరైజేషన్ బాగుంటుంది. మనం సారీ, థ్యాంక్స్ ఎలా పడితే అలా చెప్పేస్తుంటాం. కానీ హీరోకు అలా చెప్పడం నచ్చదు. సారీ, థ్యాంక్స్ మాటలకు ఒక విలువ ఉందనేది అతని వెర్షన్. ఎక్స్ లవర్ ప్రెజెంట్ లవర్స్ ను కలపడం కొత్తగా ఉంటుంది. ఇప్పటిదాకా మన సినిమాల్లో ఎక్స్ లవర్ వల్ల గొడవలు జరగడం, కామెడీగా చూపించడం జరిగింది. కానీ "దిల్ రూబా"లో ఎక్స్ లవర్ తో కూడా ఒక స్నేహాన్ని షేర్ చేసుకోవచ్చు, మోరల్ సపోర్ట్ ఇవ్వొచ్చనే మంచి పాయింట్ ను మా మూవీలో చూస్తారు. "క" సినిమా సక్సెస్ తర్వాత "దిల్ రూబా"లో మేము ఎంతవరకు ఏమేం ఛేంజెస్ చేసి బెస్ట్ ఔట్ పుట్ ఇవ్వగలమో అక్కడి వరకు మార్చాం.

– "దిల్ రూబా" సిద్ధు క్యారెక్టరైజేషన్ హైలైట్ గా ఉంటుంది. ఆ క్యారెక్టర్ ఎమోషనల్ డ్రైవ్ లో మూవీ సాగుతుంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో హీరోలు క్యారెక్టరైజేషన్స్ లా ఇందులో హీరో సిద్ధు నమ్మే సిద్ధాంతం, అతను చెప్పే మాటలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. హీరో సారీ, థ్యాంక్స్ ఎందుకు చెప్పడు, అతని ఫ్యామిలీలో జరిగిన ఫ్లాష్ బ్యాక్ ఏంటి అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమా చేసేప్పుడు నేను కూడా కొంత మారాను. ఊరికే సారీ, థ్యాంక్స్ చెప్పి ఆ మాటల విలువ తీయొద్దు అనుకున్నాను. మనిషి మోసం చేసినప్పటి నుంచే దేవుడు అతనితో మాట్లాడటం మానేశాడు, తప్పు చేయని ప్రతివాడూ హీరోనే, కానీ చేసిన తప్పు తెలుసుకున్నవాడు ఇంకా పెద్ద హీరో లాంటి హీరో చెప్పే డైలాగ్స్ హిట్టింగ్ గా ఉంటాయి. అన్ని ఎలిమెంట్స్ తో మూవీ అంతా ప్యాకేజ్ లా ఉంటుంది.

## అభినవ్ చిత్ర పోస్టర్, ట్రైలర్ ఆవిష్కరణ

శ్రీ లక్ష్మి ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ మరియు సంతోష్ ఫిల్మ్ నిర్మిస్తున్న బాలలచిత్రం "అభినవ్" చేజ్డ్ పద్మవ్యూహ. ఈ చిత్ర పోస్టర్, చిత్ర ట్రైలర్ ను తెలంగాణా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సుధాకర్ ఈ చిత్రాన్ని



నిర్మించారు. సమాజ శ్రేయస్సు కోసం, లాభాపేక్ష లేకుండా ఈ చిత్రాన్ని భీమగాని సుధాకర్ నిర్మించడం అభినందనీయం. ఇలాంటి చిత్రాలకు ప్రభుత్వ సహకారం తప్పకుండా ఉంటుంది అన్నారు. డ్రగ్ మాఫియా విద్యార్థులను సైతం వదలడంలేదు. చిత్ర ట్రైలర్ ఎంతో ఇన్స్పైరింగ్‌గా ఉంది. గంజాయి మాఫియా మరియు డ్రగ్ మాఫియా కబంధ హస్తాల్లో ఇరుకున్న గిరిజన అనాధ బాల కార్మికులను, హైదరాబాద్ లోని ప్రముఖ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు యోగ మరియు ఆర్మీ శిక్షణ తీసుకొని గంజాయి మాఫియాను డ్రగ్ మాఫియాను ఎలా అంతం చేసారు అనే కథాంశంతో చిత్రం ఉంటుంది అన్నారు దర్శక నిర్మాత భీమగాని సుధాకర్. బాలల చిత్రం అయినా యాక్షన్ సన్నివేశాలతో బలమైన కథాంశంతో పూర్తిగా ఉత్కంఠ భరితంగా ఈ చిత్రం రూపొందించబడింది అన్నారు.

## సాయి కుమార్‌కి కొమరం భీమ్ జాతీయ పురస్కారం

నటుడిగా స్వర్ణ ఉత్సవం జరుపుకుంటున్న డైలాగ్ కింగ్ సాయి కుమార్ 'అగ్ని' సాయి కుమార్ కి 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారానికీ ఎంపికచేసినట్లు సెలక్షన్ చైర్మన్ సి.పార్థ సారధి ఐఎఎస్, కో–చైర్మన్ నాగబాల డి.సురేష్ కుమార్, కన్వీనర్ కొమరం సోనే రావు, శిడాం అర్జు మాస్టారు, అధికారిక ప్రకటనలో తెలియచేసారు. గత 12 సంవత్సరాలుగా 'భారత కల్చరల్ అకాడమి, ఓం సాయి తేజ ఆర్ట్స్, ఆదివాసి సాంస్కృతిక పరిషత్' సంయుక్త నిర్వహణలో ఈ అవార్డ్ ను అందిస్తున్నామని, గతంలో ఈ కొమరం భీమ్ అవార్డును సుద్దాల అశోక్ తేజ, అల్లాణి శ్రీధర్, లెజెండరీ ఆర్టిస్ట్ రాజేంద్ర ప్రసాద్, గూడ అంజయ్య వంటి దిగ్గజాలకు ఈ పురస్కారం తో సన్మానించమని, అవార్డుతో పాటు జ్ఞాపిక ను, యాభై ఒక వెయ్యి రూపాయల నగదు అందిస్తామని, కమిటి సభ్యులు తెలియచేసారు. మార్చ్ 23 వ తేది నాడు ఈ పురస్కరోత్సవం కొమరం భీమ్ జిల్లా, ఆసిఫాబాద్ కేంద్రం లోని ప్రమీల గార్డెన్స్ లో స్థానిక శాసనసభ్యులు శ్రీమతి కోవా లక్ష్మి, ప్రముఖ బి జే పి నాయకులు శ్రీ అరిగెల నాగేశ్వర రావు గారి పర్యవేక్షణలో జరుపుతున్నామని, రాజకీయ, సినీ, వ్యాపార, గిరిజన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని వారు తెలియ చేసారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారులతో పలు గిరిజన సాంప్రదాయ నృత్యాల ప్రదర్శన ఆకర్షణ కాబోతుందని తెలిపారు.



# వెంకీ మామ నెక్స్‌ట్ ప్లాన్



సోలో హీరోగా వెంకటేష్‌కి హిట్ పడి చాలా సంవత్సరాలు అవుతుంది. వెంకటేష్ కెరీర్ ఖతం అయిందని, యంగ్ హీరోల సినిమాల్లో ముఖ్య పాత్రల్లో నటిస్తే బాగుంటుంది అంటూ చాలా మంది చాలా రకాలుగా కామెంట్స్ చేస్తూ వచ్చారు. ఆ విమర్శలన్నింటికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సమాధానం ఇచ్చారు. తనకు సరైన అవకాశం లభిస్తే దున్నేస్తా అని సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో నిరూపించారు. ఏకంగా రూ.300 కోట్ల వసూళ్లు సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సినిమా తర్వాత వెంకటేష్ చేయబోతున్న సినిమా ఏంటి అనేది సహజంగానే ఆసక్తి నెలకొని ఉంటుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో కామెడీ ఎంటర్‌టైనర్‌ను చేసి సక్సెస్ దక్కించుకున్న వెంకటేష్ అదే జోనర్‌లో సినిమా చేస్తే బాగుంటుందని అభిమానులు అంటున్నారు. కానీ వెంకటేష్ మాత్రం ఈసారి యాక్షన్ జోనర్‌లో సినిమాను చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం అందుతోంది. వెంకటేష్ గత రెండు నెలల కాలంలో చాలా కథలు విన్నాడట. ముఖ్యంగా వెంకటేష్ తదుపరి సినిమా విషయంలో వి వి వినాయక్, సురేందర్ రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గతంలో వెంకీతో లక్ష్మి సినిమాను తీసిన వినాయక్ ఇటీవల ఒక కథను వినిపించాడని వార్తలు వస్తున్నాయి. లక్ష్మి సినిమాకు సీక్వెల్‌గా వినాయక్ ఆ సినిమాను ప్లాన్ చేస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో కిక్ దర్శకుడు సురేందర్ రెడ్డి దర్శకత్వంలోనూ వెంకటేష్ సినిమా ఉండే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌తో సినిమా అనుకున్న సురేందర్ రెడ్డి ఆయనతో వీలు పడక పోవడంతో అదే కథను వెంకటేష్ వద్దకు తీసుకు వెళ్లాడని, వెంకీ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు విషయం ఏంటి అనేది తెలియాల్సి ఉంది. ఈ ఇద్దరు దర్శకులు ఒకప్పుడు సూపర్ హిట్ సినిమాలను అందించారు అనడంలో సందేహం లేదు, ఆ సమయంలో వీరు తోపు దర్శకులు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో మాత్రం ఈ ఇద్దరు దర్శకులు హిట్ బొమ్మ తీయగలరు అనే నమ్మకం ప్రేక్షకుల్లో లేదు. ఇండస్ట్రీలోనూ వీరిపై పెద్దగా నమ్మకం పెట్టడం లేదు. అందుకే వీరికి పెద్దగా ఆఫర్లు రావడం లేదని టాక్. ఇలాంటి ఇద్దరు సీనియర్ దర్శకులతో సినిమాకి వెంకటేష్ ఓకే చెప్పాడంటూ వస్తున్న వార్తలు ఆయన అభిమానుల్లో ఆందోళన కలిగిస్తుంది.



## జాన్వీ క్యూట్ లుక్స్

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా కాలం అయింది. ఈమె అక్కడ పెద్దగా సక్సెస్‌ను దక్కించుకోలేక పోయింది. అయినా సోషల్ మీడియాలో ఉన్న పాపులారిటీ కారణంగా ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు దక్కిన గుర్తింపు కారణంగా బాలీవుడ్‌లో ఫ్లాప్‌లు పడ్డా వరుసగా ఆఫర్లు అయితే వచ్చాయి. తాజాగా తెలుగులో ఎన్టీఆర్‌కి జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో మొదటి కమర్షియల్ బ్రేక్‌ను దక్కించుకుంది. తెలుగులో ఈ అమ్మడు ప్రస్తుతం రామ్ చరణ్‌కి జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే. ఎన్టీఆర్‌తో దేవర సినిమాలో నటించి నటిగా ఆశించిన స్థాయిలో అలరించలేక పోయిన జాన్వీ కపూర్‌కి ప్రస్తుతం నటిస్తున్న రామ్ చరణ్ మూవీతో కచ్చితంగా మంచి మార్కులు వస్తాయని అంతా భావిస్తున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న సినిమాలో జాన్వీ కపూర్ పల్లెటూరు అమ్మాయిగా కనిపించబోతుంది. బుచ్చిబాబు మొదటి సినిమా ఉప్పెనలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. కనుక ఈ సినిమాలోనూ జాన్వీ కపూర్ పాత్రకు మంచి ప్రాముఖ్యత ఉండటం ద్వారా టాలీవుడ్‌లో ఈ అమ్మడు మరింతగా ప్రేక్షకులకు చేరువ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ప్రతి సారి జాన్వీ కపూర్ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఏ ఔట్ ఫిట్‌లో అయినా జాన్వీ కపూర్ చాలా అందంగా ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు.



## వీర ధీర సూరన్ పార్ట్ 2 లవ్ సాంగ్

చియాన్ విక్రమ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్–ప్యాక్డ్ మూవీ వీర ధీర సూరన్ పార్ట్ 2. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషార విజయన్ వంటి అద్భుతమైన నటులు ఉన్నారు. హెచ్.ఆర్. పిక్చర్స్ రియా శిబు నిర్మించిన 'వీర ధీర సూరన్ పార్ట్ 2' ఒక యాక్షన్ థ్రిల్లర్, ఇది ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ కళ్లల్లో సాంగ్ ని రిలీజ్ చేశారు. స్టార్ కంపోజర్ జీవి ప్రకాష్ కుమార్ ఈ పాటని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. శరత్ సంతోష్, రేష్మ శ్యామ్ తమ ప్లజెంట్ వోకల్స్ మెలోడీ అండ్ గ్రేస్ ని మరింత ఎలివేట్ చేశారు. రాజేష్ గోపిశెట్టి రాసిన లిరిక్స్ మనసుని హత్తుకున్నాయి. ఈ సాంగ్‌లో విక్రమ్, దుషార విజయన్ కెమిస్ట్రీ చాలా నేచురల్ గా వుంది. ఈ లవ్ ట్రాక్ ఇన్స్టంట్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జి.కె. ప్రసన్న ఎడిటింగ్ వర్క్ పర్యవేక్షిస్తున్నారు.

## డివోషనల్ థ్రిల్లర్ షణ్ముఖ - ఆది సాయికుమార్

కొత్తతరహా కథలతో రూపొందే డివోషనల్ థ్రిల్లర్స్‌కు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ వుంది. ఇప్పుడు అదే తరహాలో ఓ ఇంట్రెస్టింగ్ డివోషనల్ కథతో రూపొందుతున్న చిత్రం 'షణ్ముఖ' కూడా ఆ జాబితాలో చేరడానికి రెడీ అవుతోంది. డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'షణ్ముఖ'. అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రాన్ని మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నటుడు ఆది సాయికుమార్ మాట్లాడుతూ " విడుదలకు ముందే ఈ సినిమా అన్ని డిజిటల్ హక్కులు, అన్ని భాషల శాటిలైట్ హక్కులు, థియేట్రికల్ హక్కులు ఫ్యాన్సీ రేటుకు అమ్ముడు పోవడం ఆనందంగా ఉంది. నా సినిమా విడుదలై సంవత్సరం దాటిపో యిది. ఫైనల్‌గా మార్చి 21తో షణ్ము ఖతో వస్తున్నాను. ఈ సినిమా క్రెడిట్ అంతా దర్శక, నిర్మాత షణ్ముగం సాప్పని. ఈ సినిమా విషయంలో ఆయన చాలా కష్టపడ్డాడు. ఈసినిమా బిజినెస్ అయిపోవడం కూడా హ్యాపీగా ఉంది. రవిబసూర్‌తో సంగీతంతో పాటు ఆయన అందించిన నేపథ్య సంగీతం సినిమాను మరో లెవల్‌కు తీసుకవెళుతుంది. అవికాతో పనిచేయడం హ్యాపీగా ఫీలయ్యాను అన్నారు.



## క్రైమ్, కామెడీ డ్రామా 'చౌర్య పాఠం'

బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రినాథరావు నక్కిన తన అప్ కమింగ్ క్రైమ్–కామెడీ డ్రామా 'చౌర్య పాఠం'తో మూవీ ప్రొడక్షన్ అడుగుపెడుతున్నారు. యంగ్ ట్యాలెంటెడ్ ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు.



కార్తికేయ –2 మొదలైన చిత్రాలకు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి చూడమణి సహ నిర్మాత. ఈ చిత్రం టీజర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్ తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. నాగ చైతన్య లాంచ్ చేసిన ప్రమోషనల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సమ్మర్‌లో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ అట్రాక్షన్‌గా 'చౌర్య పాఠం' ఏప్రిల్ 18న థియేటర్లలోకి వస్తుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. పరీక్షలు ముగిసి, వేసవి సెలవులు ప్రారంభమౌతున్నందున ఈరిలీజ్ డేట్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పర్ఫెక్ట్ టైం.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044